తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

fb.com/vaartha Digital
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-6-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 132 పేజీలు: 12 వెల: 6.50



విమాన ప్రమాదం వార్త వినగానే నా హృదయం ముక్కలైంది. అది మాటలకందని విషాదం

- ప్రధాని మోడీ



ఊహించని విధంగా కుప్పకూలిన విమానం 241 మంది ప్రయాణికులతో పాటు 20 మంది మెడికల్ విద్యార్థుల ప్రాణాలు హరించడం పెనువిషాదం. ఢిల్లీ-లండన్ వయా అహ్మదాబాద్ ఎయిరిండియా విమానం అహ్మదాబాద్ విమానాశ్రయం నుండి టేకాఫ్ అయిన ఐదు నిముషాల్లోనే కూలిపోవడం మొత్తం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రమాదానికి కారణాలు తెలియవలసి ఉంది.

# ఘోర విషాదం

## కుప్పకూలి.. భగ్గుమన్న విమానం

గురువారం అహ్మదాబాద్‌లో మెడికల్ హాస్టల్ భవనంపై కూలిన విమానం





గురువారం అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## విమానంలో 169 మంది భారతీయులు

**అహ్మదాబాద్,జూన్ 12:** అహ్మదాబాద్ సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంనుంచి లండన్‌కు బయలుదేరిన కొన్ని సెకన్లలోనే ఎయిరిండియా విమానం ప్రమాదానికి లోనయింది. మొత్తం 242 మందిప్రయాణీకులతో వెళుతున్న విమానంలో సాంకేతిక సమస్య రావడంతో ఒక భవనంపై కూలిపోయింది. మొత్తంప్రయాణీకుల్లో 169 మంది భారతీయులున్నారు. 53 మంది బ్రిటన్‌పౌరులు, ఏడుగురు పోర్చుగల్ వాసులు, ఒకరు కెనడాకు చెందినవారు ఉన్నారు. 11 మంది చిన్నారులుంటే మరో ఇద్దరుపసికందులు కూడా ఉన్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. మరోవైపు విమానం బిజెమెడికల్‌కళాశాల హాస్టల్‌పై కూలడంతో విద్యార్థుల్లో కొందరు మృతిచెందారని వినిపిస్తోంది. ప్రమాదంపై దర్యాప్తునకు సంపూర్ణ సహకారం ఇస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. ప్రయాణీకులకోసం 1800-5691-444 నంబరును అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు హుటాహుటిన అహ్మదాబాద్‌చేరుకుని ప్రమాద వివరాలను తెలుసుకని ప్రధానికి నివేదించారు.





ఘటనా స్థలంలో మృతదేహాలను తరలిస్తున్న సహాయక సిబ్బంది



### కుమార్తెకోసం లండన్ బయలుదేరిన రూపానీ.. ప్రమాదానికి బలి

9



### మృత్యుంజయుడు ఒక్కడే

**అహ్మదాబాద్,జూన్ 12:** ఎయిరిండియా బోయింగ్ విమానప్రమాదం నుంచి ఏకైక ప్రయాణీకుడు మృత్యుంజయుడుగా బయటపడ్డాడు. అహ్మదాబాద్ పోలీస్ కమినర్ మాట్లాడుతూ 11ఎ సీటులో ఉన్న వ్యక్తి బయటపడ్డాడని, ప్రమాదం నుంచి నడుచుకుంటూ బయటకు వచ్చేసాడని, ఆ ప్రయాణీకుడిని రమేష్‌విశ్వాస్‌కుమార్(38)గా గుర్తించామని చెప్పారు. మరో ప్రయాణీకుడు ఢిల్లీనుంచి అహ్మదాబాద్‌కు వస్తున్న >>2

## అహ్మదాబాద్ విమానాశ్రయంలో పెను ప్రమాదం

### గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ సహా 241 మంది దుర్మరణం

### విమానం మెడికల్ హాస్టల్‌ను ఢీ కొనడంతో 20 మంది విద్యార్థుల మృతి

టేకాఫ్ అయిన ఐదు నిమిషాల్లోనే పతనం

ప్రధాని మోడీ దిగ్భ్రాంతి.. తక్షణ చర్యలకు ఆదేశం

సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించిన కేంద్ర మంత్రులు

అమిత్‌షా, రామ్మోహన్‌నాయుడు, ఉన్నతాధికారులు

దుర్ఘటనపై డిజిసిఎ దర్యాప్తు ఆరంభం

**అహ్మదాబాద్,జూన్ 12:** భారత పౌరవిమానయాన రంగంలో దుర్దినం. అత్యంత అనుభవం కలిగిన పైలట్లు నడిపినా విమానం గాల్లోకి ఎగిరినట్లే ఎగిరి కేవలం 825 అడుగుల ఎత్తులో ఉండగానే కుప్పకూలిపోయింది. సిబ్బందితోసహా 241 మంది అగ్నికి ఆహుతయిపోయారు. అహ్మదాబాద్ సర్దార్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిక్షణాలకే బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలి మంటల్లో ఆహుతయిపోయింది. మృతుల్లో తన కుటుంబాన్ని చూసేందుకు వెళుతున్న గుజరాత్ మాజీ సీఎం విజయ్‌రూపానీ కూడా ఉన్నారు. ఇటీవలే వివాహం అయిన నవవధువు తన భర్తను కలిసేందుకు లండన్ వెళ్లేందుకు ఇదే విమానంలో వెళుతున్నారు. ప్రమాదంలో ఎయిర్‌హోస్టెస్‌లు >>2

### మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

-టాటాసన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్

**అహ్మదాబాద్,జూన్ 12:** అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్‌విమాన ఘోరప్రమాదంలో మృతులకుటుంబాలకు ఒక్కొక్కరికి కోటిరూపాయలు పరిహారంగా చెల్లించనున్నట్లు టాటా గ్రూప్ ఎయిరిండియా ప్రకటించింది. అలాగే ప్రమాదంలో గాయపడిన వారి వైద్యఖర్చులను కూడా కంపెనీయే పూర్తిగా >>2



### మంటల వల్లే సాయం ఆలస్యం

క్షతగాత్రులను పరామర్శించిన అమిత్‌షా

**అహ్మదాబాద్,జూన్ 12:** అహ్మదాబాద్ నగరశివార్లలో కుప్పకూలిన ఎయిరిండియా విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉందని, విమానం పేలిన వెంటనే మంటలు వ్యాపించాయని, మంటలు వ్యాపించడంవల్లనే ఎవ్వరినీ కాపాడేపరిస్థితి లేకుండాపోయిందని కేంద్ర >>2

## సూపర్-6లో కీలకం ‘తల్లికి వందనం’

### ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం

### ఎందరు పిల్లలుంటే అందరికీ పథకం: మంత్రి లోకేష్



**విజయవాడ,జూన్12.,ప్రభాతవార్తప్రతినిధి:** తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలున్నా ఇస్తామని ముందే చెప్పామని, అలా చెప్పినట్లుగానే అందరికీ ఇస్తున్నామని మానవ వనరులశాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. కూటమి ఏడాది పాలన సందర్భంగా సిఎం చంద్రబాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి నిధులు ఇవాళ్టి నుంచి తల్లుల ఖాతాలో జమ అవుతాయని వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ.13,000 చొప్పున ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఒక్కో విద్యార్థికి సంబంధించి మిగతా 2000 రూపాయలను పాఠశాలల నిర్వహణ నిధి కింద ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్లుగా పరుగులు పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. 67 లక్షల మందికి తల్లికి వందనం ఇస్తున్నామని దానికి రూ.10,091 కోట్లుఖర్చు అవుతుంది వివరించారు. ఈ నిధుల నుంచి స్కూళ్ల డెవలప్‌మెంట్‌కు రూ.1,346 కోట్లు వెళ్తాయని అన్నారు.అమ్మ ఒడి మార్గదర్శకాలే పాటిస్తూ అదనంగా ఎంతమంది పిల్లలున్నా ఇవ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. గత ప్రభుత్వం 42,61,965 మందికి అమ్మ ఒడి ఇచ్చిందని కాని కూటమి ప్రభుత్వం 67,27,164 మందికి తల్లికి వందనం ఇస్తున్నామని వెల్లడించారు. అలానే ఈ పథకానికి గత ప్రభుత్వం రూ.5,540 కోట్లు ఖర్చుపెడితే తాను రూ.8,745 కోట్లు ఇస్తున్నామని మంత్రి అన్నారు. రాష్ట్రంలో ఒకే బిడ్డ ఉన్న తల్లులు 18,55,760, ఇద్దరు బిడ్డలు ఉన్న తల్లులు 14,55,322, ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులు 2,10,684, నలుగురు పిల్లలు ఉన్న తల్లులు >>2



### మోగిన బడి గంటలు

తగ్గిన పుస్తకాల బరువు

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో బడి గంటలు మోగాయి. వేసవి శెలువులు ముగియడంతో బడికి బిలబిలమంటూ చేరుకున్నారు. నూతన విద్యాసంస్కరణ, విద్యావిధానం,తగ్గిన పుస్తకాల బరువు ఇతర నూతన అంశాలతో 2025-26 విద్యా సంవత్సరం ఆరంభమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 35 లక్షల మంది విద్యార్థులకు నేటి నుంచే విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. కిట్‌లోబ్యాగు, యూనిఫాం,బూట్లు, సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టు, డిక్షనరీ ఉంటాయి. అలాగే పాఠశాలల్లో నేటి నుంచి సంసిద్ధత కార్యక్రమాలు చేపడతారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం అన్నం చోటు చేసుకుంది. విద్యాశాఖ సమాచారాన్ని అనుసరించి ఈ విద్యా సంవత్సరంలో 233 రోజులు బడులు నిర్వహిస్తారు. 83 రోజులు వివిధ రూపాల్లో సెల >>2

## రాష్ట్ర ప్రగతిని ఆపలేరు..

### యేడాదిలో విధ్వంసంనుంచి వికాసం వైపు పయనం

### ఏ రాష్ట్రంలో లేని పెన్షన్లు ఇస్తున్నాం

### 2036 ఒలింపిక్స్ అమరావతిలో జరిపేలా టార్గెట్: కూటమి ప్రభుత్వ యేడాది పాలనపై మీడియాతో సిఎం చంద్రబాబు



**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్షేమం, అభివృద్ధి అనేది కూటమి ప్రభుత్వానికి జోడెద్దులబండి వంటిదని అని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు.కూటమి పాలన ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు, ఐటి, విద్యా, మానవవనరుల మంత్రి నారా లోకేష్‌తో కలిసి మాట్లాడుతూ.. ప్రజలు, ప్రజాస్వామ్యంగెలిచి ప్రజాపాలన ఏర్పడి ఏడాది పూర్తిచేసుకుంటున్నాం. సుపరిపాలనలో తొలి అడుగు పడింది. విధ్వంస పాలన నుంచి ఏకంగా వికాసం వైపు మన ప్రభుత్వం ప్రయాణం ప్రారంభించింది. కేంద్రంలో ప్రధానమంత్రి సహకారంతో ఆంధ్ర రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. ఉద్యోగాల విషయంలో మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ప్రజా ప్రభుత్వం భర్తీ చేస్తోంది. డిఎస్సీని ఎట్టిపరిస్థితుల్లో ఆపాలని ప్రతిపక్ష పార్టీ సుమారు 24 కేసులు వేసింది. ఈ రోజుతో 24వ కేసు కూడా సుప్రీం కోర్టులో డిస్మిస్ అయింది. అవన్నీ తట్టుకుని డిఎస్సీ ప్రక్రియను పూర్తిచేస్తున్నాం. గడచిన పదేళ్లలో రాని పెట్టుబడులు ఏడాదిలో తీసుకువచ్చాం. రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 8.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. డొమెస్టిక్ ఇన్వెస్ట్ మెంట్స్‌లో ఏపీ భారతదేశంలోనే నెంబర్ వన్‌గా ఉంది. 16శాతం పెట్టుబడులు ఎపికి వచ్చాయి.

ఇందులో భాగంగా టిసిఎస్, ఎల్జీ, ఎన్టీపిసి గ్రీన్, ఆర్సెల్లార్ మిట్టల్, బిపిసిఎల్, రిలయన్స్ రెన్యూ పవర్ లాంటి సంస్థలు ఈ రోజు ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది కనుకనే విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడుకోగలిగాం. రైల్వేజోన్ సాధించాం. అంతేకాకుండా భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాంప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. వృద్ధులకు రూ.వెయ్యిపెంచి రూ.4వేలుఅందిస్తున్నాం. వికలాంగులకు రూ.3వేలు >>2



విరిగిపడిన విమాన టైర్లు



సహాయం కోసం సిద్ధంగా అంబులెన్సులు



మృతదేహాలను తరలిస్తున్న సహాయకులు



చెల్లాచెదురుగా పడిన విమాన శకలాలు

# ఘోర విషాదం

>> కూడా మరణించడంతో వారి కుటుంబాలు ఒక్కసారిగా బావురుమన్నాయి. గురువారం మధ్యాహ్నం 1.30 గంటలప్రాంతంలో గుజరాత్‌లోని పటేల్ ఎయిర్‌పోర్టులో 23వ రన్‌వేనుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా ఎఐ-171 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. టేకాఫ్‌కు అవసరమైనంత వేగం కూడా విమానం అందుకోలేకపోయిందని చెపుతున్నారు. మేఘాని నగర్ ఘోడాసర్ క్యాంప్‌ప్రాంతంలో విమానం సాంకేతిక సమస్యల కారణంగా కుప్పకూలిపోయింది. విమానం 625 అడుగుల ఎత్తులో ఉన్నపుడే సిగ్నల్స్ కోల్పోయింది. అత్యవసర పరిస్థితిని వివరిస్తూ ఎటిసికి పైలట్లు 'మేడే'కాల్ చేసారు. ఇదిజరిగిన కొద్ది క్షణాలకే విమానం కూలిపోయింది. టేకాఫ్ 1.30 గంటలకు కాగా 1.39 గంటలకే విమానం 625 అడుగుల ఎత్తునుంచి క్రమేపీ కిందికి దిగిపోతూ ఒక చెట్టును ఢీకొని ఆపై ఒక వైద్యకళాశాల హాస్టల్‌భవనాన్ని కూడా ఢీకొన్ని పడిపోయింది. ఒక్కసారిగా మంటలు అలుముకోవడంతో విమానం పైలట్లతోసహా క్రూసిబ్బంది మొత్తం 241 మంది చనిపోయినట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకించింది. ప్రమాదానికి గురయిన బోయింగ్ వైడ్‌బాడీ డ్రీమ్‌లైనర్ 707 విమానం 11 ఏళ్లుగా ఎయిరిండియాలోపనిచేస్తోంది. సుదూరప్రయాణం కావడంతో విమానంలో ఇంధనం కూడా భారీ మొత్తంలోనే ఉంది. అందువల్లనేప్రమాద తీవ్రత మరింతపెరిగింది. వీరిలో 53 మంది బ్రిటన్‌వాసులు కాగా 169 మంది భారతీయులు. మృతుల్లో 11 మంది చిన్నారులుంటే మరో ఇద్దరు పసికందులు కూడా ఉన్నారు.

వ్యాపార ట్రిప్‌ల్లో వెళ్లే ప్రముఖులు, తమ వారిని కలిసేందుకు వెళ్లే కుటుంబీకులు వీరంతా ఒక్కసారిగా మంటల్లో అహుతయిపోయారు.

విమానానికి కెప్టెన్‌గా సుమిత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్‌గా క్లైవ్ కుందర్‌లు వ్యవహరించారు. సమిత్‌కు ఎల్టీసీగా 8200గంటలు, కోపైలట్‌కు 1100 గంటల అనుభవం ఉందని డిజిసిఎ వెల్లడించింది. ఎటిసి సమాచారం మేరకు రన్‌వే 23నుంచే గాల్లోకి టేకాఫ్ అయిందని, కొద్దిసేపటికే ఎటిసికి మేడేకాల్ అంటే అత్యవసరకాల్ వచ్చిందని ఆ కాల్ వచ్చిన కొద్ది క్షణాలకే విమానం కూలిపోయిందని తెలిపింది. ఎమర్జెన్సీ సమయాల్లో పైలట్లు మూడుసార్లు మేడే పదాన్ని చెపుతారు. ఫ్రెంచ్‌పదం మైడేర్‌నుంచి వచ్చింది. సాయంచేయండి అని దీని అర్థం విమానాలు, నౌకల్లోకూడా మేడేకాల్ వినియోగిస్తారు. ప్రస్తుతం ఎయిరిండియా బోయింగ్ పైలట్లుకూడా ఇదే పదం వినియోగించారు.

**మెయింటెనెన్స్‌లోపాలు..!**

ప్రమాదం జరిగిన విమానానికి సకాలంలో ఓవర్‌హాలింగ్‌చేయ దంలో కూడా నిర్లక్ష్యం వహించినట్లు ఎయిర్‌ఇండియాపై ఆరోప ణలున్నాయి. పలుపర్యాయాలు ఈవిమానానికేసాంకే తికలోపాలు ఎదురయ్యాయి. గడచిన ఏడాది డిసెంబరులో కూడా ఇదే విమానంలో పొగలు వచ్చాయి. ఏడాదిలో రెండుసార్లు సాంకేతిక సమస్యలు రాగా జూన్, డిసెంబరు మాసాల్లో కూడా భారీ ప్రమాదాలు తప్పినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై డిజిసిఎ కూడా తన దర్యాప్తులో విమానం సాంకేతిక లోపాలేనని ప్రాథమికంగా గుర్తించింది. కాగా విమానంలో 10 మందిక్రూసిబ్బందితోపాటు మొత్తం 242 మంది ప్రయాణిస్తుండగా 241 మందిప్రాణాలు వదిలినట్లు తేలింది.

**ప్రమాదంనుంచి బయటపడిన మృత్యుంజయుడు**

కాగా ఎయిరిండియా బోయింగ్ విమానప్రమాదంనుంచి ఏకైక ప్రయాణీకుడు మృత్యుంజయుడుగా బయటపడ్డాడు. అహ్మదాబాద్ పోలీస్ కమినర్ మాట్లాడుతూ 11ఎ సీటులో ఉన్న వ్యక్తి బయటపడ్డాడని, ప్రమాదంనుంచి నడుచుకుంటూ బయటకు వచ్చేసాడని, ఆ ప్రయాణీకుడిని రమేష్ విశ్వాస్‌కుమార్(38)గా గుర్తించామని చెప్పారు. మరో ప్రయాణీకుడు ఢిల్లీనుంచి అహ్మదాబాద్‌కు వస్తున్న సమయంలోనే విమానంలో సమస్యలున్నట్లు గుర్తించి వాటిని విడియోతీసి వైరల్‌చేసాడు. ఎసి, సీట్లు, పారిశుధ్యం వంటి వాటితోపాటు విమానంలో సాంకేతికసమస్యలు కూడా ఉండొచ్చని ట్వీట్‌చేసాడు. వీటన్నింటినీ గుర్తించి విమానం ఢిల్లీనుంచి అహ్మదాబాద్‌కు చేరుకోగానే తాను దిగిపోయినట్లు ఆకాశ్‌అవస్థ అనే ప్రయాణీకుడు తన ట్వీట్‌తో వైరల్‌చేయడంతో విమానంలో సాంకేతికలోపాలు ఎక్కువగానే ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

## మంటల వల్లే సాయం ఆలస్యం

>> హోంమంత్రి అమిత్‌షా ఆవేదన వ్యక్తంచేసారు. ఎయిరిండియా బోయింగ్‌డ్రీమ్‌లైనర్ కుప్పకూలిన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. అహ్మదాబాద్ ఆసుపత్రులకువెళ్లి ఆయన క్షతగాత్రులను పరామర్శించారు. అలాగే ఏకైకమృత్యుంజయుడు రమేష్ విశ్వాస్‌కుమార్‌ను కూడా ఆయన ఓదార్చారు. అతనికి అన్నివిధాలా అండగా ఉంటాం. మృతులను గుర్తించేందుకు డిఎన్ఎ పరీక్షలుచేస్తున్నామని పరీక్షలుచేసిన తర్వాతనే మృతుల వివరాలను వెల్లడిస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట పర్యటనలో కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, గుజరాత్‌సీఎం భూపేంద్రపటేల్ ఇతర మంత్రులు అధికారులు ఉన్నారు.

## మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

>> భరిస్తుందని, వారికి అవసరమైన అన్ని సంరక్షణ దీర్ఘకాలిక అవసరాలకు అండగా నిలుస్తుందని టాటాసన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ ప్రకటించారు. కాగా ఈ విమానంలో 169 మంది భారతీయులుంటే పదిమంది సిబ్బంది. 53 మంది బ్రిటన్‌పౌరులు, ఏడుగురు పోర్చుగల్ జాతీయులు, ఒకరు కెనడా దేశస్తుడున్నారు. మృతుల్లో 217 మంది పెద్దలు, 11 మంది పిల్లలు, ఇద్దరు పసికందులున్నారని అహ్మదాబాద్ పోలీస్ కమిషనర్ స్వయంగా ప్రకటించారు. విమానప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్నట్లు చెపుతున్న వైద్యకళాశాల భవనాన్ని టాటా సన్స్ పునర్‌నిర్మిస్తుందని చంద్రశేఖరన్ హామీ ఇచ్చారు.

## మృత్యుంజయుడు ఒక్కడే

>> సమయంలోనే విమానంలో సమస్యలున్నట్లు గుర్తించి వాటిని విడియోతీసి వైరల్‌చేసాడు. ఎసి, సీట్లు, పారిశుధ్యం వంటి వాటితోపాటు విమానంలో సాంకేతికసమస్యలు కూడా ఉండొచ్చని ట్వీట్‌చేసాడు. వీటన్నింటినీ గుర్తించి విమానం ఢిల్లీనుంచి అహ్మదాబాద్‌కు చేరుకోగానే తాను దిగిపోయినట్లు ఆకాశ్‌అవస్థ అనే ప్రయాణీకుడు తన ట్వీట్‌తో వైరల్‌చేయడంతో విమానంలో సాంకేతికలోపాలు ఎక్కువగానే ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

## సూపర్-6లో కీలకం 'తల్లికి వందనం'

>> 2,053 మంది ఉన్నారని వారందరికీ తల్లికి వందనం ఇస్తున్నామని లోకేష్ తెలిపారు. తల్లి లేని పిల్లలకు తండ్రికి లేదా గార్డియన్ ఖాతాలో తల్లికి వందనం డబ్బులు జమ చేస్తామని అలానే అనాథ పిల్లలుంటే జిల్లా కలెక్టర్ నిర్ధారించిన ప్రకారం వారి ఖాతాలో నిధులు జమ చేస్తామని అన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి నిధులు ఇవాళ్టి నుంచి తల్లుల ఖాతాలో జమ అవుతాయని వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ రూ.13,000 చొప్పున ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లోని 76,000 మందికి కూడా తల్లికి వందనం వర్తింపచేశామని తెలిపారు. తల్లికి వందనం జాబితా సచివాలయం, గ్రామ, వార్డు కార్యాలయాల్లోనూ ఉంచుతామని, ఇంకా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే తెలియజేస్తే పరిష్కారం చేస్తామని తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణకు జూన్ 26 వరకు గడువు పెట్టామని జూన్ 30న తల్లికి వందనం తుదిజాబితా పెడతామని తెలిపారు.

## నేడు, రేపు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి రుతుపవనాల్లో కదలిక రానుంది. రెండు వారాల విరామం తర్వాత రుతుపవనాల్లో కదలిక ఆరంభమైందని వాతావరణ శాఖ చెబుతుంది. గత నెల 29వ తేదీ తర్వాత నిలిచిపోయిన నైరుతి రుతుపవనాలు ఒకటి, రెండు రోజుల్లో మళ్లీ పురోగమించే వాతావరణం నెలకొంది. రెండు, మూడు రోజుల్లో కర్ణాటక, కొంకణ్, గోవా, ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. తమిళనాడు, తెలంగాణ, ఎపిలో వర్షాలు పెరగనున్నాయి.

## సిఎం నేటి విశాఖ టూర్ రద్దు

**విజయవాడ జూన్ 12,ప్రభాతవార్తప్రతినిధి:** నేడు విశాఖలో నిర్వహిస్తున్న న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ రీజనల్ వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనాల్సి ఉంది. అయితే అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో విశాఖ కార్యక్రమం రద్దు అయింది. అలాగే ప్రమాదం కారణంగా రేపటికి వాయిదా పడిన సుపరిపాలనలో తొలి అడుగు పేరిట నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం కూడా రద్దు అయింది.

## ప్రభుత్వ విజయోత్సవ సభ నేటికి వాయిదా

**విజయవాడ.జూన్12,.ప్రభాతవార్తప్రతినిధి:** అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా నిర్వహించ తలపెట్టిన విజయోత్సవ సభను ఈ నెల 13 శుక్రవారానికి వాయిదా వేసింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం కారణంగా సభను వాయిదా వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

## వైఎస్సార్సీ నేత సజ్జలకు మహిళా కమిషన్ నోటీసులు

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామ కృష్ణారెడ్డికి రాష్ట్ర మహిళా కమీషన్ నోటీసులు జారీ చేసింది. వీళ్లంతా పిశాచాలు, రాక్షసులు కలిసిన సంకర తెగ అంటూ రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సజ్జలపై ఆరోపణలతో కూడిన ఫిర్యాదుపై ఈ నోటీసులు జారీ చేసినట్లు మహిళా కమీషన్ చైర్‌పర్సన్ శైలజా రాయపాటి తెలిపారు. అంతేకాకుండా ఆయన అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన వార్తలను మహిళా కమీషన్ సూమోటోగా తీసుకుందని వివరించారు. దీనిపై అమరావతి మహిళలు, రైతులు సైతం మహిళా కమీషన్‌ను కలిసి ఫిర్యాదు చేశారనివివరించారు. ఈ నేపథ్యంలో ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఏ ఆధారాలతో ఇలాంటి వ్యాఖ్యలు చేశారో... ఈ నెల 18న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని కమీషన్ స్పష్టం చేసింది.

## వారం - వర్జ్యం

తేది : 13-06-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
విదియ మ.3.16
పూర్వాషాఢ రా.11.18
వర్జ్యం ఉ.7.39-9.19
దు.ఉ.8.12-9.04, 2) మ.12.34-మ.1.26
శుభసమయం : ఉ.9.25-10.00, 2) సా.6.30-7.10
రాహుకాలం - ఉ.10.30-12.00

## వారఫలం

- **మేషం** : ఏపని చేపట్టినా విజయవంతంగా పూర్తిచేస్తారు. విలువైన వస్తు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.
- **వృషభం** : ఆరోగ్య, వాహనాల విషయాలలో మెలకువ చాలా అవసరం. ఉద్యోగులకు పదోన్నతి అవకాశాలు.
- **మిథునం**: బంధువులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.
- **కర్కాటకం** : ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. మిత్రుల నుండి కీలక సమాచారం అందుకొంటారు.
- **సింహం**: జీవితభాగస్వామి సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. శుభవార్తలు వింటారు.
- **కన్య** : ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు. గృహ యోగం.
- **తుల** :కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. సోదరుల నుండి ధనలాభం పొందుతారు.
- **వృశ్చికం**: పారిశ్రామిక, వైద్య రంగాలలోని వారికి విదేశీ పర్యటనలవుంటాయి. ఉద్యోగ యత్నాలు కలిసివస్తాయి.
- **ధనుస్సు**: జీవిత భాగస్వామి నుండి సహాయ సహకారాలు అందిస్తారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.
- **మకరం**: సంఘంలో ప్రత్యేక గుర్తింపు పొందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపందాలుస్తాయి.
- **కుంభం**: వైద్య, విద్య రంగాలలో వారికి సన్మానాలు, సత్కారాలు పొందుతారు. మీ మాటకు విలువ పెరుగుతుంది.
- **మీనం** : బంధువుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం అహ్మదాబాద్‌లో ప్రమాదానికి గురైన ఎయిర్ ఇండియా విమానం దృశ్యం

## బ్లాక్‌బాక్స్ రికవరీలో అధికారులు నిమగ్నం!

### పక్షులు ఢీకొనడంవల్లే కూలిపోయిందా?

**అహ్మదాబాద్,జూన్ 12:** అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిరిండియా బోయింగ్‌డ్రీమ్‌లైనర్ విమానానికి సంబంధించి బ్లాక్‌బాక్స్‌ను రికవరీచేసేందుకు డిజిసిఎ అధికారులు కృషిచేస్తున్నారు. అటు సర్దార్‌పటేల్ ఎయిర్‌పోర్టు అధికారులతోపాటు, టాటా ఎయిరిండియా అధికారులు కూడా బ్లాక్‌బాక్స్ స్వాధీనం అయితే ప్రమాదానికి గల అసలు కారణాలు తెలుస్తాయని చెపుతున్నారు. బ్లాక్‌బాక్స్ అనేది విమానం పనితీరు, పైలట్లమధ్య సంభాషణలను రికార్డుచేసేందుకు ఈ బాక్స్ ఏర్పాటుచేస్తారు. ఫ్లైట్ డేటా రికార్డర్, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ రెండు భాగాలను బ్లాక్‌బాక్స్‌గా పరిగణిస్తారు. ఫ్లైట్ డేటా రికార్డర్ విమానం ఎంత ఎత్తులో ఉంది. ఎంతవేగంతోప్రయాణిస్తోంది. ఫ్లైట్‌కంట్రోల్స్ పనితీరును రికార్డుచేస్తుం ది. ఫ్లైట్‌డేటా రికార్డర్ ఎత్తు వేగం ఇంజిన్‌థ్రస్ట్ ఫ్లైట్ పాత్ డేటాతోసహా మొత్తం ముఖ్యమైన టెక్నికల్ పారామీ టర్స్ అన్నీ నమోదుచేస్తుంది. ఇక కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ పైలట్లమధ్య సంభాషణలు ఎటిసినుంచి వచ్చే ఆదేశాలు సేకరిస్తుంది. ఈ బాక్స్ లబిస్తే విమానప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయి. ఈ బ్లాక్ బాక్సులు అత్యంత దృఢంగా ఉంటాయి. ఎలాంటి ప్రమాదం అయినా తట్టుకుంటాయి. ప్రకాశవంతమైన నారింజరంగులో ఉంటే ఈ బాక్స్ పేలుళ్లు, మంటలు, నీటిపీడనం, హైస్పీడ్‌క్రాష్‌లను కూడా తట్టుకుంటుంది. 25 గంటల ఫ్లైయిట్ సమాచారాన్ని రికార్డుచేసి ఈ బ్లాక్‌బాక్స్ భద్రపరుచుకునే సామర్థ్యంతో ఉంటుంది. వైమానికరంగంలోపనిచేసిన సీనియర్ పైలట్ కెప్టెన్ సౌరభ్ భట్నాగర్ బహుశా పక్షలు ఢీకొనడంవల్ల రెండు ఇంజన్ల శక్తిని కోల్పోయి ఉంటాయన్న అనుమానం వ్యక్తంచేసారు. టేకాఫ్ బాగానే ఉందని, లానయండింగ్‌గేర్ పైకి లేవడానికి ముందే విమానం కిందకు దిగుతున్నట్లుకనిపించిందన్నారు. ఇది ఇంజిన్ వైఫల్యాన్ని సూచిస్తోందని, విమానానికి లిఫ్ట్ అయ్యేందుకు కావాల్సిన శక్తిలేకపోవడంవల్లే జరిగినట్లు కనిపిస్తున్నదన్నారు. టేకాఫ్ అసమానంగా జరిగిందని, నియంత్రణలేకుండా కిందకు వచ్చిందని అందువల్లనే పైలట్ మేడేకాల్‌చేసినట్లు స్పష్టం అవుతోందన్నారు. టేకాఫ్ సమయంలో పక్షులు ఢీకొట్టి ఉంటే, ఆరేడు నిమిషాల తర్వాత పడిపోవడం ప్రారంభం అయి ఉండవచ్చని అంచనావేసారు. ఇది చాలా కొత్త విమానం అని చెపుతూనే 11 ఏళ్ల విమానంకాబట్టి సాంకేతికసమస్యలు కూడా తక్కువగానే ఉండవచ్చని అంచనావేసారు.



విమాన ప్రమాదంలో మరణించిన పైలట్లు

## బిజె వైద్యకళాశాల హాస్టల్‌పై పడిన విమానశకలాలు

### 20 మందికి పైగా విద్యార్థులు మృతి

**అహ్మదాబాద్, జూన్ 12:** నగరంలోప్రమాదానికి గురయిన ఎయిర్‌ఇండియా విభాగం ఎఐ-171 జనావాసాల్లోపడింది. దీనితోని కొన్ని భాగాలుఅక్కడే ఉన్న బిజె మెడికల్ కళాశాల యూజి హాస్టల్‌భవనాలపై పడ్డాయి. ఇందులోనే మెడికల్‌కళాశాల యుజి విద్యార్థులు బసచేస్తున్నారు. అందరికీ భోజనవిరామసమయం కావడంతో అందరూ హాస్టల్‌లోనే ఉన్నట్లు తేలింది. శకలాలు భవనంపైపడి ఒకచోట భారీ స్థాయిలో మంటలు చెలరేగాయి. కనీసం 20మందికిపై విద్యార్థులు మృతిచెందినట్లు అధికారులు చెపుతున్నారు. ప్రమాదంజరిగిన నిమిషాల్లో సహాయక సిబ్బంది అక్కడికి చేరుకోవడంతో పలువురిని సురక్షితంగా బయటకు తీసారు. ప్రస్తుతంమూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలుచేపట్టాయి. వదోదరనుంచి మరో రెండు బృందాలను అక్కడికి తరలిస్తున్నారు. ప్రమాదస్థలినుంచి అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రివరకూ గ్రీన్‌కారిడార్‌ను ఏర్పాటుచేసారు.

## బోయింగ్ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు!

### పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు

**అహ్మదాబాద్,జూన్ 12:** సాంకేతికలోపంతో కుప్పకూలిన టాటా ఎయిరిండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్‌ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించామని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విజయవాడలో ఉన్న కేంద్ర మంత్రి ప్రధానిమోడీ ఫోన్‌చేయడంతో హుటాహుటిన అక్కడినుంచే నేరుగా అహ్మదాబాద్‌కువెళ్లారు. అనంతరం ఆయన ప్రమాద స్థలాన్ని పరిశీలించిన తర్వాత మాట్లాడుతూ ప్రమాద ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ప్రధానిమోడీ ఫోన్‌చేసి ప్రమాదం గురించి ఆరాతీసారని, ప్రమాదం తెలిసినవెంటనే తాను నేరుగా ప్రమాదస్థలానికి వచ్చి పరిశీలించి మొత్తం వివరాలు ప్రధాని మోడీజీకి అందచేసానన్నారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తుజరుగుతోందని, అన్ని కోణాల్లో లోతైన నిష్పాక్షికమైన దర్యాప్తుచేస్తామని చెప్పారు. అధికారులతో సమావేశం తర్వాత మరిన్ని వివరాలు అందిస్తామన్నారు.

## విమాన ప్రమాద ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఎయిర్ ఇండియా విమానం కూలిపోయింది. విమానం ప్రమాదానికి గురైన సమయంలో అందులో ఇద్దరు పైలట్లు, 10 మంది క్యాబిన్ సిబ్బందితో సహా 242 మంది ఉన్నారు. అయితే ఈ విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సిఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రార్థిస్తున్నానని అన్నారు. అహ్మదాబాద్ లో విమాన ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఘటనలో బాధితులైన వారి కోసం ప్రార్థిస్తున్నానని తెలిపారు.

**అహ్మదాబాద్ విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికరం: డి.సిఎం పవన్**

అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. 242 మందితో లండన్ బయలుదేరిన విమానం - టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోవడాన్ని ఊహించలేకున్నాము. వైద్య కళాశాల వసతి భవనాలపై కూలడంతో ఒక మహా విషాదంగా మిగిలింది. ఈ దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు దేశం బాసటగా ఉండాల్సిన సమయం ఇదని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

**విజయవాడ నుంచి అహ్మదాబాద్ బయలుదేరిన రామ్మోహననాయుడు**

విమాన ప్రమాద ఘటన తెలియగానే కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు విజయవాడ నుంచి హుటాహుటిన అహ్మదాబాద్ బయలుదేరి వెళ్లారు. కాగా ఈ ఘటనపై రామ్మోహన్‌తో ప్రధాని మోడీ ఫోన్‌లో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన వివరాలపై ఆరాతీశారు. క్షేత్రస్థాయిలో సహాయ చర్యలు స్వయంగా పర్యవేక్షించేందుకు తాను అహ్మదాబాద్ వెళ్తున్నట్లు రామ్మోహన్ నాయుడు ప్రధానికి తెలిపారు. అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటూ, పరిస్థితిపై క్రమం తప్పకుండా సమాచారం అందించాలని ప్రధాని సూచించారు. సంబంధిత అన్ని సంస్థలను సమన్వయం చేసుకోవాలని ప్రధాని మోదీ ఆదేశించారు.

## మోగిన బడి గంటలు

>> వులు ఉంటాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ 2025-26 విద్యా సంవత్సరానికి అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసింది. ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలకు వేర్వేరుగా క్యాలెండర్లు రూపొందించింది. సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 10 వరకు దసరా సెలవులు, జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయి. సబ్జెక్టుల వెయిటేజీని పరిశీలిస్తే గణితం సబ్జెక్టుకు అత్యధికంగా 40 పీరియడ్లు కేటాయించారు. తెలుగుకు 30, హిందీకి 25, ఇంగ్లీష్‌కు 30, బయాలజీకి 30, ఫిజిక్స్‌కు 18, సోషల్‌కు 30 పీరియడ్లు కేటాయించాం. నవంబరు 10 నుంచి 19 వరకు సమ్మేటివ్ అసెసమెంట్1 పరీక్షలు, ఏప్రిల్ 6 నుంచి 15 వరకు సమ్మేటివ్ అసెసమెంట్ 2 పరీక్షలు జరుగుతాయి. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రాథమిక తేదీలను ఈసారి ముందుగానే ప్రకటించారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగేలా షెడ్యూలు రూపొందించారు. మార్చి 2 నుంచి 12 వరకు టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తారు. పబ్లిక్ పరీక్షలకు ముందు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తారు.

## రాష్ట్ర ప్రగతిని ఆపలేరు..

>> పెంచి రూ.6వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి ప్రతినెలా రూ.15వేలు అందిస్తున్నాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా 203 అన్నా క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడం జరిగింది. ఆగష్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం కూడా అమలుచేస్తున్నాం. దీపం పథకం ద్వారా ఇప్పటికే 2 కోట్ల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ప్రజా ప్రభుత్వం తెలుగింటి ఆడపడుచులకు అందించడం జరిగింది. గ్యాస్ పథకంలో సవరణలు తీసుకువచ్చి సదరు నగదును మహిళల బ్యాంక్ అకౌంట్లకే నేరుగా బదిలీ చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. బాబు సూపర్ సిక్స్‌లో తల్లికి వందనం హామీ నిలబెట్టుకున్నాం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా తల్లికి వందనం హామీ నిలబెట్టుకుంటున్నాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అమలుచేస్తామని చెప్పాం. హామీ ఇచ్చిన విధంగా జీవో విడుదల చేయడం జరిగింది. ఈ రోజు నుంచి నగదు తల్లుల అకౌంట్లలో జమచేయడం జరుగుతుంది. రూ.13వేలు తల్లుల అకౌంట్లలో పడతాయి. రూ.2వేలు పాఠశాలల్లో మెయింటెనెన్స్ గ్రాంట్ కింద ఖర్చు చేయడం జరుగుతుంది. తల్లికి వందనం కింద దాదాపు 60శాతం కుటుంబాలు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉన్నారు. వారికి ఇద్దరుంటే రూ.26వేలు, ముగ్గురుంటే రూ.39వేలు వస్తాయి. వారి అకౌంట్ల లోనే నగదు జమచేయడం జరుగుతుందన్నారు. అమరావతి మాస్టర్‌ప్లాన్‌లో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా మార్పుచేర్పులు చేస్తున్నామని సిఎం చంద్రబాబు చెప్పారు. అప్పట్లో స్పోర్ట్స్ సిటీ కావాలనుకున్నామని, ఈ ఐదేళ్లలో చాలా మార్పులు వచ్చాయన్నారు. స్పోర్ట్స్‌కోసం ప్రత్యేక నగరాలు ఏర్పాటవుతు న్నాయని, అమరావతిలో ఇప్పుడు కేవలం ఒక స్టేడియం సరిపోదని అభిప్రాయపడ్డారు. క్రికెట్ స్టేడియం, దానిచుట్టూ హోటళ్లు, నివాస ప్రాంతాలు, వివిధ ఈవెంట్ల నిర్వహణకు అవసరమైన ప్రాంగణాలను 500 నుంచి 1000 ఎకరాల్లో నిర్మిస్తామని అన్నారు. 2036లో ఒలింపిక్స్ నిర్వహించే అవకాశం భారత్‌కు వస్తుందని, వాటిని అమరావతిలోనే జరిగేలా టార్గెట్‌గా పెట్టుకున్నా మని పేర్కొన్నారు.

పోలవరం పనులను జగన్ మోహన్ రెడ్డి కక్షతో నిలిపేశారని, ఇంజినీర్లను, గుత్తేదారు సంస్థను మార్చారని చంద్రబాబు అన్నారు. రూ.440 కోట్లతో నిర్మించిన డయాఫ్రం వాల్ పర్యవేక్షణ లేక వరదల్లో ధ్వంసమైందని, ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పేవరకూ డయాఫ్రం వాల్ దెబ్బతిందని తెలియదని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతంలో పనిచేసిన ఏజెన్సీనే పిలిపించి రూ.1,000 కోట్లతో డయాఫ్రం వాల్ కడుతున్నామని చెప్పారు. పోలవరం బనకచర్ల అనుసంధానంతో రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీళ్లివ్వగలమని, ఇప్పుడు రూ.81,000 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు, ఐదేళ్ల తర్వాత చేపడితే రూ.1.60 లక్షల కోట్లు అవుతుందని చంద్రబాబు అన్నారు. గోదావరి నుంచి ఏటా 3,000 టీఎంసీల నీళ్ల సముద్రంలోకి పోతున్నాయని చంద్రబాబు వెల్లడించారు.

# కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌తో మరో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు భేటీ

**పామాయిల్ దిగుమతులపై సుంకం సవరించాలి**

**ఉపాధి హామీ బకాయిల సమస్య పరిష్కరించాలి**

**కందిదినుసుల సేకరణ గడువు పెంచాలని వినతి**



కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో మంత్రి రామ్మోహన్‌నాయుడు భేటీ

**విజయవాడ ,జూన్ 12,ప్రభాత వార్త ప్రతినిధి:** ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో రాష్ట్ర రైతుల సమస్యలను చర్చించేందుకు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మూడు ప్రధాన అంశాల మీద ఇరువురి చర్చ జరిగింది. 2014-19 సంవత్సరాల మధ్య ఉపాధి పథకం కింద రాష్ట్రానికి చెల్లించాల్సిన బకాయిల సమస్యను త్వరితగతిన పరిష్కరించి నిధులు విడుదల చేయమని కోరారు. దేశం లోనే అత్యధిక పామాయిల్ ఉత్పత్తి చేసే రాష్ట్ర ఆంధ్రప్రదేశ్. కేంద్ర ప్రభుత్వం క్రూడ్ ఎడిబుల్ ఆయిల్‌పై దిగుమతి సుంకం 20 శాతం నుండి 10 శాతానికి తగ్గించడం వల్ల దేశీయంగా పంట ఉత్పత్తి చేస్తున్న రైతులు మార్కెట్ హెచ్చు తగ్గుల వల్ల నష్టపోతారని, ఆ సుంకాన్ని పాత రేటు ప్రకారం కొనసాగించాలని కోరారు. అలాగే జాతీయ వ్యవసాయ కార్పొరేషన్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ ద్వారా సేకరించిన పప్పు దినుసులు ముఖ్యంగా రెడ్ గ్రామ్ గడువు ఈ నెల జూన్ 15తో ముగియనుందని రైతుల సౌకర్యార్థం సేకరణ గడువు మరింత పెంచాల్సిందిగా కోరారు.

వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ చౌహాన్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు కేంద్రమంత్రి తెలిపారు.



జలవనరుల శాఖ మంత్రికి వినతి పత్రం అందిస్తున్న సుధీర్‌రెడ్డి

# కాళహస్తి అభివృద్ధికి నిధులిచ్చి సహకరించండి

## జలవనరుల మంత్రికి అభ్యర్థన సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,జూన్ 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయానికి పెట్టింది పేరు అని ఇక్కడ వ్యవసాయం కేవలం చెరువులు, బావులు, బోర్ల మీద ఆధారపడి సాగుతుందని అయితే రెండే రెండు ప్రాజెక్టులు ఉన్నాయని మల్లిమడుగు,స్వర్ణముఖి లని వాటికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంగా రాణిస్తుందని ఇక్కడి నియోజకవర్గంలో సుమారు 250 గ్రామాలున్నట్లు వివరించారు. ఓ వైపు స్వర్ణముఖి జీవనది తీరాన వ్యవసాయం సాగుతుందన్నారు. శ్రీకాళహస్తిని సస్యశ్యామలం చేసే ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఆయన్ను కోరారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయటానికి గతంలో తన తండ్రి గోపాలకృష్ణారెడ్డి సోమశిల-స్వర్ణముఖి ప్రాజెక్టును రూపకల్పన చేయించారని తెలుగుగంగ నీటిని ఎస్ ఎస్ కెనాల్‌లో అనుసంధానం చేసి సుమారు లక్ష ఎకరాలకు సాగునీటిని అదనంగా ఇవ్వటానికి మరో పంట పండించుకొనుటకు అవకాశం కల్పించారన్నారు. ఇందుకు ఏడు రిజర్వాయర్‌లను నిర్మించారు. కానీ అటవీశాఖ పేచితో ఎస్ ఎస్ కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయి. అయితే ప్రతి ఏడాది బడ్జెట్‌లో కేటాయింపుచేస్తున్నారు కానీ కాలువ పూర్తి కాకుంటే నీరు ఎలా వస్తుందని ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ కాలువ పూర్తి అయితే శ్రీకాళహస్తి ఏర్పేడు మండలాల్లో రైతులు ంరెండు పంటలు పండించుకోవచ్చునని అంతేకాక తొండమనాడుచెరువు నుంచి స్వర్ణముఖి నదిలోకి నీటిని విడుదల చేయటంతో పరివాహక ప్రాంతాల్లో సాగునీటితో పాటు శ్రీకాళహస్తి ప్రజల దాహార్తిని తీర్చుటకు స్వర్ణముఖినదిలో భూగర్భ జలాలు పెరుగుతాయని రాబోవు రోజుల్లో ఇదో పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుటకు అలాగే హైదరాబాద్ ట్యాంక్ బండ్‌ను మరిపించే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని ఎంఎల్‌ఏ జలవనరులశాఖ మంత్రికి వివరించారు.

# జర్నలిస్టు కృష్ణంరాజుకు 14 రోజుల రిమాండ్

**సచివాలయం,జూన్12,ప్రభాతవార్త:**అమరావతి మహిళలను అనుచిత పదజాలంతో కించపరిచిన జర్నలిస్టు కృష్ణంరాజు పోలీసులు అరెస్ట్ చేసారు. ఈ నేపథ్యంలో గురువారం అతన్ని మంగళగిరి కోర్టుకు హాజరు పరిచారు. న్యాయస్థానం అతనికి 14 రోజుల రిమాండ్ విధించింది. దాంతో కృష్ణంరాజును పోలీస్ బందోబస్తుతో జిల్లా జైలుకు తరలించారు. ఓ ఛానల్ డిబేట్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన అనలిస్టు కృష్ణంరాజును తుళ్లూరు పోలీసులు విశాఖ దగ్గరల్లో అరెస్టు చేశారు. . అక్కడి నుండి గుంటూరు తీసుకువచ్చారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం ఆయనను మంగళగిరి కోర్టుకు లో హాజరపరిచారు. న్యాయమూర్తి జర్నలిస్ట్ కృష్ణంరాజుకు 14 డిమాండ్ విధించారు. రాజధాని మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని అమరావతి రాజధాని మహిళ నేత కంభంపాటి శిరీష తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు మేరకు కృష్ణంరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన మొదటి ముద్దాయి కాగా రెండవ ముద్దాయి జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్ ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో వీరిపై పలు కేసులు నమోదు అయ్యాయి. కోర్టు వద్ద రైతులు నిరసకాగా కృష్ణంరాజును మంగళగిరి కోర్టుకు తీసుకువస్తున్నారన్న సమాచారంతో రాజధాని ప్రాంతాలనుండి జేఏసీ నేతలు మహిళలు ప్రజలు పెద్ద ఎత్తున కోర్టుకు వద్దకు చేరుకున్నారు. ఎట్టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిందితుని కోర్టు డిమాండ్ విధించి గుంటూరు జిల్లా జైలుకు తరలిస్తున్న సమయంలో అమరావతి ప్రాంత రైతులు నేతలు మహిళలు పెద్ద ఎత్తున కోర్టు బయట నిలబడి కృష్ణంరాజుకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

# రాష్ట్రంలో టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు గురువారం సాయంత్రం విడుదలయ్యాయి. మొత్తంగా 1,23,477మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 76.14శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. బాలికల్లో 80.10శాతం, బాలురలో 73.55 శాతం ఉత్తీర్ణత నమోదైందని అన్నారు. విద్యార్థులు జూన్ 13 నుంచి 19వ తేదీ వరకు రీకౌంటింగ్/ రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలను మే 19 నుండి 28వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించింది.

# అనంతపురం జిల్లా మీదుగా బళ్లారి-చిక్ జాజుర్ డబ్లింగ్ రైలు మార్గానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

**- ప్రాజెక్టు మొత్తం నిడివి 185కి.మీలు**

**- అంచనా వ్యయం రూ.3,342కోట్లు**




రైలు మార్గం ప్రాజెక్టు రూట్‌మ్యాప్

**గుంతకల్లు రైల్వే,జూన్ 12,ప్రభాత వార్త** అనంతపురం జిల్లా మీదుగా బళ్లారి-చిక్ జాజుర్‌ల మధ్య 185కి.మీల డబ్లింగ్ రైలు మార్గం ప్రాజెక్టును రూ.3,342కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు కేంద్రప్రభుత్వం ఆమోదించింది. న్యూఢిల్లీలో బుధవారం ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ రూ.3,342కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బళ్లారి-రాయదుర్గం- చిత్రదుర్గ-చిక్ జాజుర్‌ల మధ్య కొత్తగా నిర్మించనున్న డబ్లింగ్ రైలు మార్గంతో పాటు ఝార్ఖండ్ రాష్ట్రంలో కోడర్మ-బర్కకానా మధ్య చేపట్టనున్న మరో డబ్లింగ్ రైలు మార్గానికి సైతం కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. బళ్లారి-రాయదుర్గం- చిత్రదుర్గ-చిక్ జాజుర్ డబ్లింగ్ రైలు మార్గం ప్రాజెక్టు వివరాలు : ప్రాజెక్టు నిడివి 185కి.మీలు, అంచనా వ్యయం రూ.3342కోట్లు కర్ణాటక,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని బళ్లారి,అనంతపురం, చిత్రదుర్గ జిల్లాలలోని 470గ్రామాలలో నివసించే 13లక్షల మందికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. అలాగే ఇనుప ఖనిజం, బొగ్గు,స్టీల్,ఫర్టిలైజర్స్,ఆహార ఉత్పత్తుల,పెట్రోలియం వంటి సరుకు రవాణా అదనంగా 18.9మిలియన్ టన్నులు సరుకు రవాణా, ఆదాయం అదనంగా పెరుగుతుంది. 185కి.మీల ఈ ప్రాజెక్టులో 19స్టేషన్లు,29మేజర్ బ్రిడ్జిలు,230మైనర్ బ్రిడ్జిలు,21ఫ్లైఓవర్‌లు,85అండర్ పాస్ బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# ఐఎస్‌డబ్ల్యూ సిబ్బందికి యూనిఫాం అలవెన్స్ పెంపు

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ నిఘా విభాగంలో అంతర్భాగమైన ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ) సిబ్బందికి యూనిఫామ్ అలవెన్స్ రూ.11 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పోలీసు శాఖలో గ్రేహౌండ్స్,అక్టోపస్ విభాగాలకు ఇప్పటికే రూ.11వేలు అందుతుండగా ఐఎస్‌డబ్ల్యూ(వీఐపీల రక్షణ) సిబ్బందికి ప్రభుత్వం 8,750 మాత్రమే చెల్లిస్తోంది. నిఘా విభాగాధిపతి ప్రతిపాదనతో అలవెన్సు పెంచుతూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులిచ్చారు.

# 15న సిఎం చంద్రబాబుతో సినీ ప్రముఖుల భేటీ

## డిసిఎం పవన్ కూడా పాల్గొనే అవకాశం

**విజయవాడ.జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:**ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఈనెల 15వ తేదీన అగ్ర నటులు, నిర్మాతలు, సినీ ప్రముఖులు భేటీ కానున్నారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో సాయంత్రం నాలుగు గంటలకు ఈ భేటీ జరగనుంది. ఇందుకు సంబంధించి, ప్రదేశంతోపాటు అపాయింట్‌మెంట్ ఖరారైంది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఈ భేటీలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. అయితే ఉస్తాద్ భగత్‌సింగ్ సినిమా చిత్రీకరణ జరుగుతున్నందున పవన్ కల్యాణ్ హాజరుపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. తెలుగు సినీరంగంలోని అగ్రనటులతోపాటు ఇతర ముఖ్యులకు కూడా సీఎం చంద్రబాబు నాయుడు అపాయింట్‌మెంట్‌కు చెందిన సమాచారం చేరింది. సినీరంగ ప్రముఖులు అంతా ఈనెల 15వ తేదీన కలిసి రావాలని, వారికి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి మార్కెట్ ఉంది, ఉంటుందని, అందరి సహకారం తీసుకుని సినీ పరిశ్రమకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందిస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గతనెల 24వ తేదీన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినీపరిశ్రమ వ్యవహరిస్తోన్న తీరుపై ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని, అయినప్పటికీ తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని తెలుగు చలనచిత్ర మండలి, ఇతర ముఖ్యులు కనీసం ఒక్కసారి కూడా ఎందుకు మర్యాదపూర్వకంగా కలవలేకపోయారని ప్రశ్నించారు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్ర రంగం అభివృద్ధి కోసం సంఘటితంగా రావడం లేదని, అంతా కలసి రావాలని గతంలో తాను సూచించినా వారెవరి నుంచీ సానుకూల స్పందన లేకపోవడం సరికాదని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. తెలుగు సినిమా రంగంలోని అగ్ర నటులను, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఏ విధంగా ఇబ్బందులకు గురిచేసిందే మరచిపోయినట్లున్నాయనే భావనను పవన్ కల్యాణ్ వ్యక్తం చేశారు.

# మహిళలను చులకనగా మాట్లాడే వారిని పార్టీల నుండి బహిష్కరించాలి

**- భారత జాతీయ మహిళా సమాఖ్య నేత దుర్గాభవాని**

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:**మహిళల గురించి చులకనగా,అసభ్యంగా మాట్లాడే వారిని పార్టీల నుండి బహిష్కరించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని డిమాండ్ చేశారు. రాజకీయంశాల్లో ఉద్దేశపూర్వకంగా మహిళలపై అనుచిత విమర్శలు చేయడం సరికాదన్నారు. అమరావతి మహిళలపై ఓ ఛానల్‌లో జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఓ మ్యాగ్జైన్ ఎడిటర్ వీవీఆర్ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ విజయవాడ ప్రెస్ క్లబ్‌లో వివిధ మహిళా సంఘాల ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజధాని మహిళలను కించపర్చడం దారుణమన్నారు. వైకాంగ్రెస్‌పార్టీలో కీలక స్థానంలో ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి అసభ్యంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు,వారి వారి మహిళా సంఘాల ద్వారా ఇలాంటి అంశాలపై సమగ్ర చర్చలు జరపాలని కోరారు. స్త్రీలను ఇటువంటి విమర్శలు వారి మనోభావాలతో ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలపై అసభ్య వ్యాఖ్యానాలు ఏంటన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ...సమాచార ప్రసార మాధ్యమాల్లో ప్రత్యర్థులపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు,ప్రతినిధులు శ్రీదేవి,కె.వసుంధర,పి.సుహాసిని,పంచదార్ల దుర్గాంబ,పి.దివ్యలక్ష్మి,నార్ల మాలతి,ధనలక్ష్మి, అరుణ్‌కుమార్, గోళ్ళ నారాయణరావు, ఎ.మల్యాద్రి, షరీఫా,ఓర్సు భారతి పాల్గొన్నారు.

# ఆర్టీజిఎస్ కేంద్రాన్ని సందర్శించిన ఇథియోపియా ప్రతినిధి బృందం

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ను ఇథియోపియా దేశానికి చెందిన ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. ఇథియోపియా దేశ డిజిటల్ అగ్రికల్చర్ అండ్ ఫైనాన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్ గిరుమ్ కెటెమా టెక్లెమారియం నేతృత్వంలో 10 మంది ప్రతినిధుల బృందం అమరావతిలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా ఈ బృందం ఆర్టీజీఎస్‌ను సందర్శించింది. ఈ బృందానికి ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ ఎం. మాధురి స్వాగతం పలికారు. ఆర్టీజీఎస్ పనితీరు గురించి ఆమె ఈ బృందానికి వివరించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సాంకేతిక వారధిలా ఆర్టీజీఎస్ పనిచేస్తున్న తీరు గురించి తెలిపారు. విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూత్న ఆలోచనల నుంచి ఆర్టీజీఎస్ వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. ఇలాంటి సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న మొట్టమొదటి రాష్ట్రంలో భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల డేటాను అనుసంధానిస్తూ ఒక పెద్ద డేటాలేక్‌ను రూపొందిస్తున్నామని, దీని ద్వారా పాలన మరింత సరళీతరం చేయడానికి వీలవుతుందన్నారు. ప్రజలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి మొబైల్ ఫోన్లోనే ప్రజలకు అన్ని సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మన మిత్ర పేరిట వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం 455 రకాల సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని, రాబోయే రోజుల్లో ప్రజలకు వెయ్యికి పైగా సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందించాలన్నదే లక్ష్యమని చెప్పారు. ప్రజలకు వాతావరణ మార్పుల గురించి ఎప్పటికప్పుడు రియల్ టైమ్‌లో అందించి వారిని అప్రమత్తం చేయడానికి వీలుగా అవేర్ హబ్ ఏర్పాటు చేశామన్నారు. ఇస్రో సహకారంతో వాతావరణాన్ని ఆర్టీజీఎస్ నిరంతరం పర్యవేక్షిస్తుంటుందని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించి ప్రజలకు సత్వరం మెరుగైన సేవలందించడానికి వీలుగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సును పెద్ద ఎత్తున ఉపయోగిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ఆర్టీజీఎస్‌లో ప్రత్యేకించి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ హబ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ఫలాలు ప్రజలకు సక్రమంగా అందించడానికి కావాల్సిన సాంకేతిక సహకారాన్ని ఆయా ప్రభుత్వ శాఖలకు ఆర్టీజీఎస్ అందిస్తోందన్నారు. ఇథియోపియా ప్రతినిధి బృంద సభ్యులు పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# జెన్‌కో పై పెరుగుతున్న బకాయిల భారం, రుణాల రీస్ట్రక్చరింగ్ దిశలో సంస్థ

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:**జెన్‌కో పై బకాయిల భారం పెరుగుతున్న నేపథ్యంలో జెన్‌కో రుణాల రీస్ట్రక్చరింగ్‌కు సన్నద్ధమవు తుంది; థర్మల్ యూనిట్ల నిర్మాణానికి పీఎఫ్‌సీ,ఆర్ఈసీల నుంచి జెన్‌కో రుణాలు తీసుకుంది. ప్లాంటు జీవితకాలం సుమారు 15 ఏళ్ళుగా పరిగణించి ఆ సంస్థలు రుణాన్నిచ్చాయి. దీనివల్ల ప్రతి నెలా చెల్లించే వాయిదాల మొత్తం భారంగా మారింది. వాస్తవంగా ప్లాంట్ల జీవితకాలం 30 నుండి 40 ఏళ్ళ వరకు ఉంటోంది. ఏపీ జెన్‌కో...ఉత్పత్తి చేసిన థర్మల్ విద్యుత్తుకు ప్రతినెలా డిస్కంలు సుమారు రూ.1400 కోట్ల మేర చెల్లిస్తున్నాయి. ఆ మొత్తంలో సంస్థ తీసుకున్న రుణాలపై నెల వాయిదాలు,సిబ్బంది జీతాలకే సుమారు రూ.1300 కోట్లు సర్దుబాటు చేయాల్సి వస్తోంది. మిగిలిన రూ.100 కోట్లు ఇతర అవసరాలకు వినియోగిస్తోంది. ఈ లెక్కన ప్రతి నెలా బొగ్గు సరఫరా చేసే సంస్థలకు పైసా చెల్లించే పరిస్థితి లేదు. జెన్‌కో థర్మల్ యూనిట్ల నిర్వహణ కోసం ఒడిశా లోని మహానది కోల్ ఫీల్డ్స్,సింగరేణి,కోల్‌కతా లోని ఈస్టర్న్ కోల్ ఫీల్డ్‌ల నుండి సుమారు రూ.500 కోట్ల విలువైన బొగ్గును సంస్థ ప్రతి నెలా తీసుకుంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లోనే బొగ్గు సరఫరా సంస్థలకు సుమారు రూ.1800 కోట్ల మేర జెన్‌కో బకాయిలు పెట్టింది. మహానదికి రూ.వెయ్యి కోట్లు,సింగరేణికి బిల్ డిస్కౌంట్ కింద రూ.600 కోట్లు, ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్‌కు రూ.200 కోట్లు చెల్లించాలి. దీంతో పాటు వాషరీస్,బొగ్గురవాణా కాంట్రాక్టర్లకు మరో రూ.1200 కోట్లు బకాయిలున్నాయి. విజయవాడ వీటీపీఎస్ లోని మొదటి యూనిట్ సుమారు 40 ఏళ్ళుగా ఉత్పత్తిలో ఉంది. ఇదే విషయాన్ని రుణ మంజూరు సంస్థలకు వివరించి...అందుకనుగుణంగా రుణాన్ని రీస్ట్రక్చరింగ్ చేసే ప్రతిపాదనపై అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. యూనిట్ జీవితకాలాన్ని 30 ఏళ్ళుగా పరిగణించేందుకు రుణ మంజూరు సంస్థలు అంగీకరించిఏ అవకాశం ఉందని సమాచారం. దీనివల్ల రుణ చెల్లింపు వ్యవధి పెరిగి...ప్రస్తుతం చెల్లించే నెల వాయిదా మొత్తంలో కనీసం 50 శాతం తగ్గే అవకాశం ఉంది.

# తిరుమల సమాచారం

## యోగాతో శారీరక అలసట ఉండదు

**- తిరుమలలో యోగాసనాల్లో పోలీసులు**



**తిరుమల,జూన్ 12ప్రభాత వార్తప్రతినిధి:** యోగాతో పోలీసులకు శారీరక అలసట ఉండదని, మనస్సు ఏకాగ్రత కలుగుతుందని తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ తెలిపారు. ప్రతిరోజూ యోగాతో పోలీసులు ప్రశాంతంగా విధులు నిర్వహించగల రన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం తిరుమల ట్రాఫిక్, క్రైమ్ పోలీసులు ఎస్వీ హైస్కూల్‌లో యోగా ఆసనాలు చేశారు. ఉదయం 6గటంల నుండి 7గంటల వరకు ఈ ఆసనాలు చేసి, ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచారు.

## సంక్షేమం, అభివృద్ధి దిశగా సిఎం పాలన

**- ఆగస్ట్ 15నుండి మహిళలకు ఉచిత బస్సుప్రయాణం :మంత్రి మండిపల్లి**



**తిరుమల,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ఏడాదికాలంలో ఆంధ్రప్రదేశ్‌ను సంక్షేమం, అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగులువేయించి ,ఆ దిశగా కృషి చేస్తున్నారని రాష్ట్రరవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సరిగ్గా ఏడాదిక్రిందట ఇదేరోజు సిఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేశారన్నారు. ఏడాదిలో సూపర్‌సిక్స్ పథకాలు అమలుచేయడం ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. గురువారం రాష్ట్రంలో తెరచుకున్న పాఠశాలలు,కళాశాలల విద్యార్థుల తల్లులకు సంతోషకరమైన విషయంగా ఈ రోజు ఉదయం తల్లికివందనం నిధులు మంజూరుచేశారన్నారు. ఇంకా రైతన్నలకు నిధులు జమచేసి ఆదుకుంటామన్నారు. ఇదే స్ఫూర్తితో ఆగస్ట్ 15నుండి మహిళలకు ఉచిత బస్సుప్రయాణం అమలుచేస్తామని మంత్రి ప్రకటించారు. రానున్న నాలుగేళ్ళలో ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా పూర్తిగా అభివృద్ధి చెందడానికి కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కోరానన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. గురువారం ఉదయం ఎంతో ముఖ్యమైన రోజుగా ఏడాదిపాలక పూర్తిచేసుకున్న సందర్భంగా తిరుమలేశుని దర్శించుకున్నట్లు తెలిపారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానంలో విద్య, వైద్యరంగాలకు ఇతోధిక సేవలందిం చేందుకు విరాళాలు సేకరిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఉన్న ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు కూడా దాతలు తమవంతుగా విరాళా లందిస్తున్నారు. గురువారం ఉదయం తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన పోతిరెడ్డి లోకేశ్ ఎస్వీ ప్రాణదానట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు విరాళాన్ని అందించారు. తిరుమలలోని అదనపు ఇఒ కార్యాలయంలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి డిడిని అందజేశారు.

## తిరుమల ఘాట్‌రోడ్ల మరమ్మతులు షురూ!

**వాహనాలను అప్రమత్తంగా నడపాలని టిటిడి విజ్ఞప్తి**



**తిరుమల,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల- తిరుపతి, తిరుపతి- తిరుమలకు రాకపోకలుసాగించే మొదటి,రెండో ఘాట్‌రోడ్లను పూర్తిస్థాయిలో వాహనాల ప్రయాణానికి పటిష్టం చేయడంలో భాగంగా తారురోడ్డు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ పనులు ఇటీవల మొదలయ్యాయి. పనులు జరుగుతుండటంతో వాహనదారులు మరింత అప్రమత్తంగా వాహనాలను నడపాలని టిటిడి ఇంజనీరింగ్ విభాగం విజ్ఞప్తి చేసింది. సాధారణంగా తిరుమల ఘాట్‌రోడ్లను ప్రతి రెండేళ్ళకోసారి మరమ్మతులు చేయడం, అవసరమైతే పూర్తిగా బిటి తారురోడ్డునిర్మాణం పనులు చేపడుతుంది. ఈ పనులు తిరుమలకు వచ్చే భక్తుల వేసవిరద్దీ తగ్గిన సమయంలోగానీ, శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ముందుగానీ చేపట్టడం పరిపాటి. ప్రస్తుతం ఘాట్‌రోడ్లకు ఇరువైపులా రక్షణగోడలు నిర్మాణ పనులు చేపట్టడం, అక్కడక్కడా ఇప్పటికే ఘాట్‌రోడ్లు పాక్షికంగా దెబ్బతినడం జరిగింది. వేకువజామున 3గంటల నుండి అర్ధరాత్రి 12గంటల వరకు దీంతో రోజువారీగా తిరుమలకు వస్తున్న యాత్రికుల వాహనాలు ఎక్కువయ్యాయి. యాత్రికుల సురక్షిత ప్రయాణానికి ఘాట్‌రోడ్లను పటిష్టంగా నిర్మించాలని భావించారు. ఇందుకోసం ఇటీవలే కాంట్రాక్టు పనులకు పాలకమండలి అనుమతించింది. ప్రస్తుతం గత రెండురోజులుగా 18కిలోమీటర్లు వరకు ఉన్న మొదటి,రెండో ఘాట్‌రోడ్లుపై బిటిరోడ్లు నిర్మాణపనులు జరుగుతుండటంతో శ్రీవారి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తున్నారు. యాత్రికులకు ఇబ్బంది లేకుండా, ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఘాట్‌రోడ్లను మూసివేయకుండా నిర్దేశించిన సమయంలో మరమ్మతు పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టిరు. భక్తులు తమ తిరుమల ప్రయాణాన్ని ప్రణాళికాబద్ధంగా మార్చుకుని గంటముందే ప్రారంభించాలని టిటిడి తెలిపింది. మరమ్మతుల కారణంగా వాహనాల ప్రయాణానికి అక్కడక్కడా నెమ్మదిగా ఆగి ఆ తరువాత ప్రయాణించాల్సి వస్తోంది. ఈ విషయంతో భక్తులు మరింత సులభంగా, సౌకర్యంగా ప్రయాణించేందుకు ఈ మరమ్మతులు పనులు చేపట్టింది. దేశంలోని నలు మూలల నుండి విదేశాల నుండి తిరుమలకు చేరుకునే రేణిగుంట విమానాశ్రయం, తిరుపతి రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండు ప్రాంతాలనుండి విచ్చేసే వాహనదారులు తమ ప్రయాణం గంటముందుగానే చేసుకోవాలని టిటిడి సూచించింది. ఘాట్‌రోడ్ల మరమ్మతు పనులు చేయడానికి ప్రతి విభాగంఅప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అత్యవసర సేవలకు టిటిడి టోల్‌ఫ్రీనంబర్ 155257కు సంప్రదించాలని టిటిడి అధికారులు విజ్ఞప్తి చేశారు.

pnb Housing Finance Limited Ghar Ki Baat

**అనుబంధం-IV-A - స్థిరాస్తి/లు యొక్క ఇ-వేలం బహిరంగ విక్రయ ప్రకటన**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 యందు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు ఏర్పాటుతో చదువబడే దాని క్రింద స్థిరాస్తుల యొక్క విక్రయం కొరకు ఇ-వేలం-విక్రయ ప్రకటన

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష్ భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ-110001, ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com

బ్రాంచి కార్యాలయం: GB ప్లైమ్, 31-4-363, 1వ అంతస్తు, అరండల్‌పేట్, 4వ లేన్, గుంటూరు - 522002 ల్యాండ్‌మార్క్: హెల్త్ హాస్పిటల్ ప్రక్కన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ప్రత్యేకించి కాలమ్ నెం.A మరియు పేర్కొనబడిన రుణగ్రహీత(లు) మరియు హామీదారు/లుకు నోటీసు జారీ చేయునది ఏమనగా సెక్యూరిటీ క్రెడిటార్ వద్ద తనఖా పెట్టబడిన/ఛార్జ్ చేయబడిన కాలమ్ నెం.D మరియు తెలుపబడిన స్థిరాస్తు(ల)ను (కాలమ్ నెం.C యందు పేర్కొనబడిన) వానిని M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటార్, నిర్మాణాత్మకంగా/భౌతికంగా స్వాధీనం చేసికొని ఉన్నారు. మరియు క్రింద పేర్కొన్న వివరాల ప్రకారం "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా ఏది ఏలా ఉన్నవి అక్కడ ఏది ఉందో అది అలా" ప్రాతిపదిక అమ్మివేయబడుతుంది. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యందు ఇట్టి తేదీ నాటికి సవరించబడిన విధంగా గల రూల్ 8(6) మరియు 9 ప్రకారంగా కాలమ్ నెం.A యందు తెలిపిన విధంగా కేసును బట్టి రుణగ్రహీతలు/తనఖాదారులు (మృతి చెంది ఉన్నట్లయితే) వారి యొక్క రుణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/చట్టబద్ధవారసులు, చట్టబద్ధ ప్రతినిధులు (తెలిసినవారు లేదా తెలియనివారు), ఎగ్జిక్యూటర్లు, పాలనాధికారులు, సక్సెసర్లు, అసైనీలకు నోటీసులు ఇవ్వబడుచున్నవి. మరిన్ని సవివరమైన నియమ నిబంధనల కోసం (వేలానికి సంబంధించిన) M/s. PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యందు ఇవ్వబడిన లింకును, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క వెబ్‌సైట్‌ను అనగా www.pnbhousing.com చూడవచ్చును.

| రుణం నెం./రుణగ్రహీత పేరు/ సహ-రుణగ్రహీత/హామీదారు/ చట్టబద్ధ వారసులు (A) | డిమాండ్ మొత్తం & తేది (B) | స్వాధీనతా యొక్క స్వభావం (C) | తనఖాపెట్టబడిన ఆస్తుల వివరణ (D) | రిజర్వు వెల (RP) (E) | బయానా (RP యొక్క 10%)(F) | బిడ్ సమర్పణకు చివరి తేది (G) | బిడ్ ఇంక్రిమెంట్ రేట్ (H) | ఇన్స్‌పెక్షన్ తేది మరియు సమయం (I) | వేలం తేది మరియు సమయం (J) | తెలిసిన అభ్యంతరాలు/ కోర్టుకేసుల ఉన్నట్లయితే (K) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| HOU/GNTR/0322/966058 B. సూర్యనారాయణ / B. మహాలక్ష్మి & లక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్, B.O: విజయవాడ | రూ. 29,15,727.00 & 12.04.2024 | భౌతికం | 501.0, 4వ అంతస్తు, ఏసుగంటీస్ సిండెరెల్లా, ఏసుగంటీస్ సిండెరెల్లా, ఇ.నం.18/A18/B మరియు 19 LP నం.4 2016, ఫ్లాట్ నం.11 12 13, అగతవరప్పాడు గ్రామం, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522509. | రూ. 21,82,000 | రూ. 2,18,200 | 29.06.2025 | రూ. 10,000 | 20.06.2025 ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. | 30.06.2025 మ.02.00 గం. నుండి మ.3.00 గం. | 'లేవు / తెలియవు |

* దీనికి తదుపరి వడ్డీ, @ 18% P.A. వర్తించే తగు వ్యయములు, ఇన్సిడెంటల్ ఖర్చులు, ధర, ఛార్జీలు మొ॥నవి చెల్లింపు తేదీ వరకు మరియు/లేదా రియలైజేషన్ వరకు అయినవి. **PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి యొక్క ఎరుక మరియు సమాచారం మేరకు పైన తెలుపబడిన స్థిరాస్తి పై కాలమ్ నెం.K యందు తెలుపబడినవి తప్పించి మరేటువంటి ఇతర అభ్యంతరములు/క్లెయిమ్‌లు గానీ లేవు. తదుపరి అట్టి అభ్యంతరములు ఉన్నచో, అట్టి వానిని సఫలీకృతుడైన కొనుగోలుదారు/బిడ్డరు చెల్లించవలసి ఉంటుంది. ఆసక్తి గల కొనుగోలుదారు/బిడ్డరు తెలుపబడిన విధంగా ఏవైనా అభ్యంతరములు ఉన్నచో అట్టి వాని నిజాలను తామే స్వయంగా తెలుసుకోవలసి ఉంటుంది.
1) పైన తెలుపబడిన స్థిరాస్తులు/సెక్యూర్డ్ ఆస్తులపై ఈ తేదీ వరకు PNBHFL/PNBHFL యొక్క అధీకృత అధికారి సదరు ఆస్తి విక్రయించేందుకు, కేటాయించేందుకు, మరియు/లేదా అమ్మివేయుటకు ఎటువంటి ఆటంకపరిచే ఆర్డరుగానీ, మరియు కోర్టువారి ఇంజెక్షన్ గానీ లేదు. 2) కాలమ్ నెం.కెలో తెలిపిన విధంగా ఆసక్తి గల కొనుగోలుదారు/బిడ్డరు మరియు ఆసక్తిగల పార్టీలు స్వతంత్రంగా ఏవేని అభ్యర్థనలు వగైరాలు ఉన్నచో వానిని సర్వేక్షించుకొనగలరు. కానీ టైటిల్ యొక్క డాక్యుమెంట్‌ల పరిమితిలో కాదు ఇందుకు సంబంధించిన టైటిల్ PNBHFL కార్యాలయం యందు బిడ్డింగ్‌లో పాల్గొనే ముందు టెండరు/బిడ్ దరఖాస్తునకు ముందు లేదా ఆఫర్లు ఇచ్చేముందు అన్ని విధాలుగా పరిశీలించి సంతృప్తి చెందేందుకుగాను లభ్యంగా గలదు. బిడ్డరు బిడ్ ఫారముతోపాటుగా ఈ వేలానికి సంబంధించిన అన్ని నియమ నిబంధనలపై సంతకం చేయవలసి ఉంటుంది. 3) సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యందలి రూల్ 9(3) నిబంధనలను అనుసరించి, బిడ్డరు/కొనుగోలుదారు అమ్మకపు మొత్తం (బయానా ధరావత్తును ఒకవేళ డిపాజిట్ చేసినట్లయితే దానితోసహా) అమ్మకపు విలువలో 25% మొత్తాన్ని చట్టబద్ధంగా జమ చేయవలసి ఉంటుంది. అట్టి దానిని అదే రోజున లేదా తదుపరి పని దినాన జమ చేయవలెను. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నిబంధన 9(2) ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా నిర్ణయించిన విధంగా అమ్మకపు విలువలో 25% మొత్తాన్ని జమచేసిన మీదట మాత్రమే సేల్ బిడ్డరు(లు) యొక్క పేరిట నిర్ధారించబడుతుంది. విక్రయ పరిగణన మొత్తం యొక్క మిగతా 75% మొత్తం కొనుగోలుదారునిచే విక్రయ నిర్ధారణ పత్రం యొక్క ఎక్నాలెడ్జ్‌మెంట్ తేదీ నుండి 15 రోజులలోగా జమ చేయవలసి ఉంటుంది. విఫలమైతే ఆస్తి/సెక్యూర్డ్ చేయబడిన ఆస్తి సర్ఫేసీ చట్టం యొక్క ఏర్పాట్లు ప్రకారం పునర్ విక్రయించబడుతుంది. 4) ఇట్టి ఇ-వేలం ద్వారా అమ్మకం విషయంలో తన కార్పొరేట్ కార్యాలయం ప్లాట్ నం.68, 3వ అంతస్తు, సెక్టార్-44, గుర్‌గావ్, హర్యానా 122003 యందు గల M/s. C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధీకృత అధికారికి సహాయం చేస్తోంది. వెబ్‌సైట్ www.bankeauction.com ఆస్తి యొక్క పరిశీలనకు సంబంధించి ఎటువంటి సహాయం కోసమైనా లేదా బిడ్ డాక్యుమెంట్లను పొందేందుకైనా మరియు ఏదేని ఇతర సందేహ నివృత్తి లేదా రిజిస్ట్రేషన్ కొరకైనా, PNBHFL యొక్క అధీకృత అధికారి అయిన Mr. వల్లూరి ఉదయ్ భాస్కర్ / విజయ్ సుంద్రియాల్ / మాధవ్, మొబైల్ నంబర్: 9703801419/7428193765/9948562888, ఇ-మెయిల్: auction@pnbhousing.com లేదా www.pnbhousing.com సంప్రదించగలరు.

ప్రదేశము: గుంటూరు, తేది: 12.06.2025 సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

వార్త

నిరాశానిస్పృహలకు లోనుకాకుండా ప్రయత్నం కొనసాగిస్తే మనం ఏ పనైనా సాధించగలం.

-షేక్స్పియర్

# పారని పాచిక!

ఓటమి పరంపరలో ముచ్చటగా మూడోసారి భారత్‌ను ఎదురించి గెలవలేమని అర్థమయ్యాక పాకిస్థాన్ మరో పిచ్చి ప్రయత్నానికి తెర తీసింది. విషయం ఊహాజనితమనదే అయిన చైనాతో జతకట్టి వ్యూహాత్మకంగా ముందుకు కదిలేందుకు అడుగులేస్తోంది. సాధ్యాసాధ్యాల మాటలాఉన్నా ప్రయత్నమైతే చెయ్యాలిగా! అనే ధోరణిలో ఓ ఊహాజనిత ప్రణాళికకు రూపకల్పన చేసిందనిపిస్తుంది. సింధు ఒప్పందం రద్దుచేస్తూ భారత్ నిర్ణయించాక సింధునీటి హక్కులపై అంతర్జాతీయ కోర్టులో తేల్చుకుంటామని ఇస్లాంబాద్ నుంచి సవాల్ ఎదురైంది. సరికదా! ఆ విషయంలో ఒక అడుగు ముందు కదలలేదు. పాకిస్థాన్ మరో పక్కదారి వెతుక్కుంది. చైనా బాసటగా భారత్‌ను ఎదుర్కొనే ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగానే నిజానికి ఈ వ్యూహంలో చైనా అంగీకరిస్తేనే పాక్ పాచిక పారుతుంది. చైనా ఈ విషయంలో భారత్‌తో తెగబడేందుకు సిద్ధంగా లేదు. మిత్రదేశానికి కష్టనష్టాలు వాటిల్లితే సహాయంచేయాలనే ఆలోచన మంచిదే. కానీ ఇతరుల ప్రయోజనాల కోసం తమ ప్రయోజనాలను తాకట్టుపెడితే ఏమి జరుగుతుందో చైనాకు తెలియనిది కాదు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ పాకిస్థాన్కు సింధు జలాలనుసరఫరా కాకుండా నిలిపి వేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంతో పాక్ అల్లాడుతోంది. అనలే నీటికొరతతో అల్లాడిపోతున్న పాకిస్థాన్కు భారత్ నిర్ణయంతో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. నీటి సరఫరా నిలిపి వేయడాన్ని పాకిస్థాన్ తీవ్రంగా తప్పుబట్టింది. నీటిని నిలిపివేయటం యుద్ధానికి కాలు దువ్వటమే అంటూ మండిపడింది. మొత్తానికి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించింది. అయితే, గత కొద్దిరోజుల నుంచి నీటి సరఫరా లేకపోవటంతో పాకిస్థాన్లోని చాలా ప్రాంతాల్లో కరువు పరిస్థితి ఏర్పడింది. తాగడానికి కూడా నీళ్ల లేకుండా అక్కడి జనం అల్లాడుతున్నారు. సింధు జలాల నిలిపివేత నిర్ణయం పాక్‌లోతీవ్ర నీటి సంక్షోభానికి ఎదుర్కొంటుందని వార్తలు వస్తున్నాయి. సింధూ నదీలో నీరు ప్రవహించకపోతే పాక్ ప్రత్యర్థుల రక్తం పారుతుందంటూ పాక్ విపక్ష నేతబిలావల్ నోరు పారేసుకున్నారు. సింధూ నాగరికత పరిరక్షకులం తామే అంటూ భారత్కు హెచ్చరికలు జారీ చేశారు. సింధూనది మాదే. ఎప్పటికీ మాదే. నదిలో నీరైనా పారుతుంది లేదా వారి రక్తమైనా పారుతుంది. వేల ఏళ్ల నాటి సింధూ నాగరికతకు తాము వారసులమని మోదీ అంటున్నా, మేమే ఈ సంస్కృతీ పరిరక్షణకు వారసులమని ప్రకటించుకున్నారు. కానీ ఈ సంస్కృతికి పరిరక్షకులము మేమే. ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని అంటూ ఓర్యాలీలో ప్రగల్భాలు పలికారు. భారత్ ఉదిక్తతలు మరింత ముదిరేలా బాధ్యతారహిత వ్యాఖ్యలు చేశారు. అంతకు మునుపు, పాక్ రక్షణ శాఖ మంత్రి కూడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్, పాక్ మధ్య సింధూ, దాని ఉపనదుల జలాల పంపిణీ కోసం 1960లో ఈ ఒప్పందం కుదిరింది. సింధు జలాల ఒప్పందం రద్దుని యుద్ధ చర్యగా పాకిస్థాన్ అభివర్ణించింది. పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత పాకిస్థాన్ లోలోపల భయపడుతూనే, భారత ప్రతీకారాన్ని ఎదుర్కోవడానికి సిద్ధమవుతోంది. భారతదేశంతో సరాసరి ఎదుర్కొలేక సమయం వచ్చినప్పుడల్లా, పాకిస్థాన్ తరచుగా తన మిత్రదేశాల మద్దతు కోరుతూ లేదా బెదిరింపుల ముసుగు వెనుక దాక్కుంటూ కనిపిస్తుంది. ఒకరిపై ఒకరు చర్చలు జరిపే నైతిక హక్కు లేకపోవడంతో, అది తరచుగా టర్కీ లేదా చైనా వంటి దేశాలపై ఆధారపడుతోంది. మరోసారి, ఇస్లామాబాద్ అదే వ్యూహాన్ని ఆశ్రయించింది. పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ సలహాదారు రాణా ఎహ్సాన్ అఫ్జల్ ఇటీవల భారతదేశం సింధు జలాలను అడ్డుకుంటే, బ్రహ్మపుత్ర నది విషయంలో కూడా చైనా అదే విధంగా ప్రతీకారం తీర్చుకోగలదని హెచ్చరించారు. అలాంటి పరిస్థితులు ప్రపంచ యుద్ధానికిదారి తీస్తాయంటూ పరోక్షంగా ఆయన అన్నారు. దీనిపై అస్సాం ముఖ్య మంత్రి హిమంత బిస్వాశర్మ గట్టిగా స్పందిస్తూ, పాక్ వాదనను తిప్పికొట్టారు, బ్రహ్మపుత్ర నీటి ప్రవాహంపై చైనా నియంత్రణ వాస్తవ పరిమితులను బహిర్గతం చేశారు. ముఖ్యంగా, చైనా అలాంటి ప్రకటన చేయడానికి సాహసించలేదు. భారత్‌లోకి రాకుండా బ్రహ్మపుత్ర ప్రవాహాన్ని చైనా ఏమాత్రం ఆపలేదు. బ్రహ్మపుత్ర నదీ పరీవా హక ప్రాంతంలో నీటి ప్రవాహంలో 20 శాతం నుంచి30 శాతం మాత్రమే చైనా టిబెటన్ ప్రాంతం నుండివస్తుంది. ఈశాన్య భారతమే బ్రహ్మపుత్రను బలోపేతం చేస్తుంది. అందుకే ఇక్కడ ప్రవాహవడి వేగంగా ఉంటుంది. దాదాపు చైనాకు సమానం, అయినప్పటికీ నదిలో 6.7శాతం మాత్రమే దానిభూభాగం గుండా ప్రవహిస్తుంది. నది భౌగోళిక విస్తీర్ణంలో భారత దేశం 34.2 శాతం వాటా కలిగి ఉన్నా, దాని నీటిలో 39 శాతం ఆధిపత్యాన్ని కలిగిఉంది. మన దేశంలోకి ప్రవేశించే ముందు నదీ ప్రవాహం కేవలం 14శాతం మాత్రమే. అత్యధిక వర్షపాతంతో ఈశాన్యాన్ని దాటిన తర్వాత ఇది 86శాతానికి పెరుగుతుంది. భారతదేశంలోకి బ్రహ్మపుత్ర నది ప్రవాహాన్ని నిరోధించడం ద్వారా చైనా ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉందని హెచ్చరించిన తర్వాత పలు విశ్లేషణలు వెలువడ్డాయి. అన్నిటి సారాంశం ఒకటే. ఏ పరిస్థితుల్లోనూ బ్రహ్మపుత్ర నీటిని చైనా నిరోధింప జాలదు. దౌత్యపరంగా సానుకూల వాతావరణంలో పరిష్కరించుకోవలసిన వ్యవహారాలను బెదిరింపుల ద్వారానో, ఇతరత్రా పొరుగు దేశాలను రెచ్చగొట్టడం ద్వారానో ఫలితం సాధించాలనుకునే వారికి పర్యవసానం ఎలా ఉంటుందో రాబోయే రోజులే సమాధానమిస్తాయి.

ఒక ఎదురుదెబ్బ తగిలినంత మాత్రాన సాధించదలచుకున్న ప్రయోజనం నుంచి వెనుకంజ వేయవద్దు.



అబ్రహాంలింకన్

చాతుర్యం వల్ల కష్టాలను అధిగమించవచ్చు. సోమరితనం కష్టాలను కొని తెస్తుంది.



ఐ.జాన్సన్

# డిజిటల్ మోసాలపై నియంత్రణ ఏదీ?

**కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ టెక్నాలజీ వంటి రంగాలలో, మోసపూరిత పద్ధతులకు కొత్త మార్గాలను సృష్టిస్తాయి. దీనికి అనుగుణంగా నిబంధనలను నిరంతరం మార్చుకోవాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ లావాదేవీల సంక్లిష్టతలు నియంత్రణకు అదనపు కష్టాన్ని కలిగిస్తాయి. చివరగా నిబంధనలు ఉన్నప్పటికీ, వినియోగదారులలో విస్తృత అవగాహన పెంపొందించడం చాలా ముఖ్యం. తమ హక్కుల గురించి, మోసపూరిత పద్ధతులను ఎలా గుర్తించాలో తెలుసుకోవడం ద్వారా ప్రజలు సాధికారత పొందుతారు. వినియోగదారులు ఆన్‌లైన్ క్లెయిమ్‌లను విమర్శనాత్మకంగా అంచనా వేయడం, సమీక్షలను నిశితంగా పరిశీలించడం, తొందరపాటు నిర్ణయాలకు ఒత్తిడి చేసే పద్ధతుల పట్ల అప్రమత్తంగా ఉండటం నేర్చుకోవాలి.**

డి జె మోహన రావు

అరచేతిలో ఇమిడిపోయిన డిజిటల్ ప్రపంచం అపారమైన సౌలభ్యాన్ని అందిస్తుంది. ఇంటిపట్టునే కూర్చుని, వర్చువల్ దుకాణాలను పలకరించవచ్చు, ధరలు పోల్చవచ్చు, వస్తువులు క్షణాల్లో గుమ్మం ముందుకు వచ్చి వాలిపోతాయి. ఈకామర్స్ మన జీవితాలను ఊహించనంతగా మార్చేసింది. అయితే, ఈ తక్షణ సంతృప్తి, అనంతమైన ఎంపికల వెనుక ఒక క్లిష్టమైన కథనం దాగి ఉంది. ఇక్కడ నిజమైన విలువకు, మోసపూరిత వంచనకు మధ్య తేడా అస్పష్టంగా మారుతుంది. ఈ సవాలును దృష్టిలో ఉంచుకునే సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌లు మూడు నెలల్లోపు తమ ప్రకటనలను, వెబ్‌సైట్ డిజైన్‌లను స్వయంగా తనిఖీ చేసుకుని, అందులో ఉన్న మోసపూరిత 'డార్క్ ప్యాటర్న్‌లను' తొలగించాలని స్పష్టంగా సూచించింది. మన డిజిటల్ కొనుగోలు అనుభవంలో పారదర్శకత, విశ్వసనీయత ఎంత అవసరమో ఈ చర్య కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. మన తెరలపై మెరిసే వ్యక్తిగతీకరించిన ప్రకటనలు మొదట చూసినప్పుడు ఏదో మాయలా అనిపిస్తాయి. 'నేను ఇప్పుడే కొత్త గ్యాడ్జెట్ గురించి ఆలోచిస్తున్నానని వీళ్లకెలా తెలిసింది?' అనిపిస్తుంది. ఈ కచ్చితత్వం వెనుక, మన బ్రౌజింగ్ అలవాట్లను, కొనుగోళ్లను, కనీసం మనం వెతికిన పదాలను కూడా నిశితంగా విశ్లేషించే అధునాతన అల్గారిథమ్‌ల శ్రమదాగి ఉంది. ఈ వ్యక్తిగతీకరణ నిజంగా పారదర్శకంగా, నైతికంగా జరిగినప్పుడు, ఇది మన కొనుగోలు అనుభవాన్ని మెరుగుపరుస్తుంది, మనకు కావాల్సిన వస్తువులను మన ముందుకు తీసుకువచ్చి, సమయాన్ని ఆదా చేస్తుంది. ఇది డిజిటల్ యుగం అందించిన నిజమైన సౌలభ్యం. అంతేకాదు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ధరలను పోల్చడం సులభతరం చేస్తాయి. ఆకర్షణీయమైన ఆఫర్‌లు, డిస్కౌంట్‌లు అందిస్తాయి. ఇవి నిజంగా వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటాయి. అయితే, ఈ అల్గారిథమ్‌ల నృత్యం ఒక్కోసారి మోసపూరిత వ్యూహాల లోతులకు నెట్టివేయగలదు. ఉదాహరణకు, మనం చూసే 'పరిమిత కాల ఆఫర్‌లు' ఎప్పటికీ ముగియవు, లేదా ఐదు నక్షత్రాల రేటింగ్‌లతో మెరిసిపోయే వస్తువులు సహజత్వం లేకుండా కనిపిస్తాయి. ఇక్కడే డిజిటల్ దుకాణ వీధి తన మోసపూరిత కోణాన్ని బయటపెడుతుంది. నిపుణులు 'డార్క్ ప్యాటర్న్‌లు' అని పిలిచే సూక్ష్మమైన, తరచుగా నమ్మశక్యం కాని డిజైన్ ఎంపికలను ఉపయోగించి మనకు తెలియకుండానే కొన్ని చర్యలు తీసుకునేలా ప్రోత్సహిస్తాయి. డిజిటల్ ప్రపంచం ఎంత గొప్పదైనప్పటికీ, అది అబద్ధాలకు, మోసపూరిత పద్ధతులకు నిలయం. ఇవి తరచుగా 'డార్క్ ప్యాటర్న్‌లు' లేదా తప్పుదోవ పట్టించే ప్రకటనల రూపంలో వస్తుంటాయి. ఉదాహరణకు, మీరు చూడకుండానే కార్ట్‌లో అదనపు వస్తువులు చేర్చడం (బాస్కెట్ స్నీకింగ్), లేదా మీ నిర్ణయాన్ని మార్చడానికి అపరాధ భావంతో కూడినభాషను ఉపయోగించడం (కన్ఫర్మ్‌షేమింగ్) వంటివి సర్వసాధారణం. ఉత్పత్తుల లక్షణాలను అతిశయోక్తి చేయడం లేదా మార్చబడిన చిత్రాలను ఉపయోగించి తప్పుదోవ పట్టించే ఉత్పత్తి క్లెయిమ్‌లు కూడా మనం తరచుగా చూస్తుంటాం. అలాగే, కృత్రిమంగా సానుకూల అభిప్రాయాలను సృష్టించి, నకిలీ సమీక్షలు, టెస్టిమోనియల్స్ ద్వారా కొనుగోలుదారులను మోసగించడం జరుగుతుంది. మరో సాధారణ పద్ధతి దాగి ఉన్న రుసుములు లేదా డ్రిప్ ప్రైసింగ్, ఇక్కడ ప్రారంభ ధర తక్కువగా చూపించి చెల్లింపు దశలో షిప్పింగ్ లేదా ప్రాసెసింగ్ ఛార్జీలు వంటి అదనపు రుసుములు జోడిస్తారు. 'చివరికి 2 వస్తువులు మాత్రమే!'



లేదా 'పరిమిత కాల ఆఫర్!' వంటి ప్రకటనలతో తప్పుడు ఆవశ్యకత లేదా కొరతను సృష్టించి వినియోగదారులను తొందరపాటు కొనుగోళ్లకు ప్రేరేపిస్తారు. సబ్‌స్క్రిప్షన్ ట్రాప్‌లు కూడా ఒక పెద్ద సమస్య. ఇక్కడ ఉచిత ట్రయల్ తర్వాత సబ్‌స్క్రిప్షన్‌లను రద్దు చేయడం కష్టం. కొన్నిసార్లు తక్కువ ధర వస్తువును ప్రకటించి అది అందుబాటులో లేదని చెప్పి ఖరీదైన ప్రత్యామ్నాయాన్ని అంటగట్టే బైట్‌అండ్‌స్విచ్ పద్ధతులు కూడా ఉన్నాయి. చివరగా డబ్బు తీసుకుని చేసే ప్రమోషన్లను నిజమైన సిఫార్సులుగా చూపించే ప్రకటించని ఎండార్స్‌మెంట్లు కూడా వినియోగదారుల నమ్మకాన్ని దెబ్బ తీస్తాయి. ఈ పెరుగుతున్న ఆందోళనలను గుర్తించి, భారత దేశంలో నియంత్రణ సంస్థలు తప్పుదోవ పట్టించే ఈ కామర్స్ ప్రకటనలను, డార్క్ ప్యాటర్న్‌లను అరికట్టడానికి తమ ప్రయత్నాలను తీవ్రతరం చేశాయి. ఈ దిశగా అనేక చట్టాలు, మార్గదర్శకాలు అమలులో ఉన్నాయి. కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్, 2019ని సిసిపిఎ రూపొందించింది. ఇది వినియోగదారుల హక్కులకు ప్రధాన రక్షకునిగా నిలుస్తుంది. సిసిపిఎ 'డార్క్ ప్యాటర్న్‌ల నివారణ నియంత్రణకు మార్గదర్శకాలు, 2023' వంటి చారిత్రాత్మక ఆదేశాలను జారీ చేసి 13 నిర్దిష్ట డార్క్ ప్యాటర్న్‌లను నిషేధించింది. ముఖ్యంగా, జూన్ 2025లో సిసిపిఎ జారీ చేసిన సలహా ప్రకారం, ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు మూడు నెలల్లోపు స్వీయఆడిట్‌లు నిర్వహించి, మోసపూరిత పద్ధతులను తొలగించాలని ఆదేశించారు. ఇది ప్లాట్‌ఫామ్‌లు తమ డిజిటల్ స్టోర్‌లను శుభ్రపరచుకోవడానికి బాధ్యత వహించేలా చేస్తుంది. సిసిపిఎ తన చర్యలను, అంచనాలను క్రమం తప్పకుండా వివరిస్తూ నివేదికలు, సలహాలు, పత్రికా ప్రకటనలను జారీ చేస్తుంది. కన్స్యూమర్ ప్రొటెక్షన్ (ఈకామర్స్) రూల్స్, 2020 ప్రత్యేకంగా ఈకామర్స్ సంస్థలు, విక్రేతలను పాలిస్తాయి. ఈ నియమాలు, ప్రకటనలు వాస్తవ ఉత్పత్తి లక్షణాలు, అందుబాటు, వినియోగానికి అనుగుణంగా ఉండాలని నిర్దేశిస్తాయి. ఉత్పత్తి ధర, వాపసు విధానాలు, ఫిర్యాదుల పరిష్కార విధానాలలో పారదర్శకతను నిర్ధారిస్తాయి. నకిలీ సమీక్షలను, తప్పుదోవ పట్టించే ప్రకటనలను స్పష్టంగా నిషేధిస్తాయి. ముఖ్యంగా, కొనుగోళ్ల కోసం వినియోగదారుల స్పష్టమైన సమ్మతిని ఇవి తప్పనిసరి చేస్తాయి. ప్రభుత్వసంస్థ కానప్పటికీ, అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కీలకమైన స్వీయ నియంత్రణ పాత్రను పోషిస్తుంది. ఇది ప్రకటనదారుల కోసం ఒక నియమావళిని అమలు చేస్తుంది. తప్పుదోవ పట్టించే ప్రకటనలపై వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరిస్తుంది. దీని మార్గదర్శకాలు తరచుగా ప్రకటనల పద్ధతులను ప్రభావితం చేస్తాయి. ఈ అన్నిటికీ మూలంగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్, 2000 ఆన్‌లైన్ లావాదేవీలు సైబర్ సెక్యూరిటీని నియంత్రిస్తుంది. అలాగే, నూతనమైన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023చాలా కీలకమైనది. ఇది వ్యక్తిగత డేటా సేకరణ, ప్రాసెసింగ్ నిల్వను నియంత్రించే ఒక చారిత్రాత్మక చట్టం. ప్రకటనల ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను ఉపయోగించే ముందు స్పష్టమైన డేటా విధానాలు, ఖచ్చితమైన సమ్మతిని ఇది నిర్దేశిస్తుంది. ఈ పటిష్టమైన నియంత్రణలు ఉన్నప్పటికీ సవాళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. లెక్కలేనన్ని ప్లాట్‌ఫామ్‌లు, విక్రేతలతో కూడిన డిజిటల్ ప్రపంచం అపారమైన పరిధి, వేగం, నియంత్రణా సంస్థలకు అమలు ఒక నిరంతర పోరాటంగా మారుస్తుంది. సాంకేతిక పరిజ్ఞానంలో వేగవంతమైన పురోగతులు, ముఖ్యంగా కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ టెక్నాలజీ వంటి రంగాలలో, మోసపూరిత పద్ధతులకు కొత్త మార్గాలను సృష్టిస్తాయి. దీనికి అనుగుణంగా నిబంధనలను నిరంతరం మార్చుకోవాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ లావాదేవీల సంక్లిష్టతలు నియంత్రణకు అదనపు కష్టాన్ని కలిగిస్తాయి. చివరగా నిబంధనలు ఉన్నప్పటికీ, వినియోగదారులలో విస్తృత అవగాహన పెంపొందించడం చాలా ముఖ్యం. తమ హక్కుల గురించి, మోసపూరిత పద్ధతులను ఎలా గుర్తించాలో తెలుసుకోవడం ద్వారా ప్రజలు సాధికారత పొందుతారు. వినియోగదారులు ఆన్‌లైన్ క్లెయిమ్‌లను విమర్శనాత్మకంగా అంచనా వేయడం, సమీక్షలను నిశితంగా పరిశీలించడం, తొందరపాటు నిర్ణయాలకు ఒత్తిడి చేసే పద్ధతుల పట్ల అప్రమత్తంగా ఉండటం నేర్చుకోవాలి. •

# భారత్, కెనడా సంబంధాలు తిరిగి చిగురించేనా?


డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్

కెనడా రాజధాని ఒట్టావాలో చాలా రోజుల ఊహాగానాల తర్వాత, కెనడా ప్రధాని మార్క్ కార్నీ రాబోయే జీ7 సదస్సుకు మోదీని ఆహ్వానించారు. భారత్ ప్రపంచ సరఫరా గొలుసులో ఇతర ముఖ్యమైన భౌగోళిక రాజకీయ విషయాలలో కీలకపాత్ర పోషిస్తుందని కార్నీ చెప్పారు. ట్రూడో హయాంలో అస్తవ్యస్తంగా ఉన్న భారత్, కెనడా సంబంధాలు ఇప్పుడైనా సరైన దారిలోకి వస్తాయని అనిపిస్తోంది. అయితే, ఒట్టావా సమావేశంలో సభ్యదేశాలు నిజాలు తెలుసుకోవాలి. ఖలిస్థానీ సమూహాలు భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్న విషయం తెలిసిందే. కనీసం ఈ సందర్భంలోనైనా వాస్తవాలు గ్రహించి తగిన చర్యలు తీసుకుంటేనే ఈ సంబంధాలు పూర్తిగా సుహృద్భావంగా మారతాయి. గతంలో భారత్ ఎన్ని వివరణలు ఇచ్చినా ట్రూడో ఈ సమస్యను గుర్తించడానికి నిరాకరించాడు. దీనికి ప్రధాన కారణం అతని కూటమి భాగస్వామి. ఖలిస్థాన్ అనుకూల జగ్‌మీత్ సింగ్, హర్దీప్ సింగ్ నిజ్జర్ మరణానికి భారత ప్రభుత్వ ఏజెంట్లు కారణం అంటూ కెనడా పార్లమెంటులో ఎలాంటి ఆధారం చూపకుండా ట్రూడో చేసిన అసంబద్ధ ఆరోపణలు భారత్, కెనడా సంబంధాలను దిగజార్చాయి. అదృష్టవశాత్తూ, కార్నీ ఇప్పుడు రెండు దేశాల మధ్య సంభాషణలు తిరిగి ప్రారంభమయ్యాయని చెప్పారు. ఇది మంచి పరిణామం. కానీ, కెనడాలో ఖలిస్థానీలు రెండు ప్రధాన రాజకీయ పార్టీలపై ప్రభావం చూపుతున్నందున, భారత్ న్యాయమైన ఆందోళనలపై సునిశిత లోపించే ప్రమాదం ఉంది. పహల్గామ్ ఉగ్రదాడి అలాగే ఆపరేషన్‌సిందూర్ తర్వాత, భారత్ ఉగ్రవాదంపై కఠినమైన వైఖరిని స్పష్టం



చేసింది. ఇది చర్చకు తావులేని విషయం. ఖలిస్థానీ సమూహాలు పాకిస్థాన్‌కు మద్దతు ఇచ్చే ఉగ్రవాద సంస్థలతో సమన్వయం చేస్తున్నాయని తగిన ఆధారాలున్నాయి. 2021లో హడ్సన్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం, పాకిస్థాన్ నుండి నిధులు, మద్దతు, సైనిక శిక్షణ పొందే ఖలిస్థానీ కాశ్మీరీ సమూహాల సంబంధాన్ని హైలైట్ చేసింది. కాబట్టి, భారత భద్రతకు సంబంధించిన తీవ్రమైన ఆందోళనలు ఇప్పటికీ తాజాగా అలాగే ఉన్నాయి. కెనడాకు, ట్రూడో పరిపాలన వాషింగ్టన్ ఒట్టావా సంబంధాలను అస్తవ్యస్తం చేసిన నేపథ్యంలో, భారత్‌తో పరస్పర ప్రయోజనకరమైన సంబంధాలు ఇప్పుడు ముఖ్యం. ట్రంప్ సుంకాలను ఆయుధంగా ఉపయోగించే ధోరణి కూడా ఈ సహకారానికి కారణం. కెనడా సహజ వనరుల శక్తి కేంద్రం. భారత్‌కు ఆ వనరులు అవసరం. అలాగే, ఆర్కిటిక్‌లో వనరుల కోసం వ్యూహాత్మక పోటీ జరుగుతున్న నేపథ్యంలో రెండు దేశాలు కీలకపాత్ర పోషించగలవు. జీ7 అధ్యక్ష దేశంగా, కెనడా తన స్వప్రయోజనాల కోసం మోడీని 2019 నుండి ఆహ్వానిస్తోంది. భారతీయ దయాస్పోరా కారణంగా రెండు దేశాల మధ్య ప్రజల సంబంధం ఇప్పటికే బలంగా ఉంది. ఇప్పుడు వ్యూహాత్మక సంబంధాన్ని సరిచేయడానికి సమయం ఆసన్నమైంది. భారత విద్యార్థులకు రక్షణ, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను కెనడా పునరుద్ధరణ చేయాలి. తిరిగి అపోహలు, అపార్థాలు తొలగి అన్ని విషయాలలోనూ పరస్పర నమ్మకం, సహకారం పునరుద్ధరణ పూర్తిస్థాయిలో జరగాలి. పూర్వం వలే ఇరు దేశాల మధ్య సంబంధాలు సజావుగా సాగేందుకు ప్రస్తుత కెనడా నూతన ప్రధాని మార్క్‌కార్నీ అన్ని విధాలా చర్యలు తీసుకోవాలి. భారత్ ఖలిస్థానీ ఉగ్రవాద చర్యలను ఎప్పుడూ క్షమించదు. ఇంకా కెనడా వారితో సంబంధాలు తెగతెంపు లు చేసుకోకపోతే భారత ప్రభుత్వ ప్రతిస్పందన కఠువుగానే ఉంటుంది. •

# ప్రజావాక్కు



## ఇప్పటికైనా రెగ్యులర్ రైళ్లను పెంచండి

సామాన్య ప్రయాణికులకు అందుబాటులేని టికెట్స్ ధరలతో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు, బుల్లెట్ రైళ్ల పేరుతో హడావుడి చేయడం మినహా సాధారణ ప్రయాణికుల రద్దీకితగినట్టుగా రెగ్యులర్ రైళ్లను నడపకపోవడం, కొన్ని పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేయడం పలువురి ప్రాణాలను బలిగొంటోంది. దీనికి ఉదాహరణగా ముంబైలోని ముంబ్రా సమీపంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్ కు వెళుతున్న కిక్కిరిసిన రైలు నుంచి జారిపడి నలుగురు ప్రయాణికులు ప్రాణాలను కోల్పోగా తొమ్మిది మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. ఇలాంటి ఘటనలు ముందు ముందు జరగకుండా రైల్వే శాఖ వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## సన్న బియ్యంతో బడి భోజనం

నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడనున్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కిందవిద్యార్థులకు పాఠశాలల్లోనే మధ్యాహ్నభోజనం అందిస్తున్నారు. ఈ పథకం కింద సరఫరా చేసే బియ్యంతో వండిన అన్నం ముద్దగా ఉండడంతో కొందరు ఇళ్లనుంచి తెచ్చుకుని తినేవారు. మరికొందరుతిన్నామంటే తిన్నామని చిరుతిండ్లతో కడుపు నింపుకునేవారు. ఏపిప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం సరఫరా చేస్తుంది. దీంతో పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్య భారీగా పెరగనుంది.

- చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

ఆంధ్రప్రదేశ్లో స్కూళ్లు ప్రారంభంఅయ్యాయి. ఈ సందర్భంగా ప్రతిఒక్క విద్యార్థి కూడా కొత్త విద్యాసంవత్సరంలో వేళుతున్నారు. కనుక ఒక మొక్క నాటినట్లయితే వాళ్ల విద్యా సంస్థలతో పాటు ఆ మొక్క కూడా పెరుగుతుంది. సంవత్సరంలోఆ మొక్క ఎంత పెరిగింది, ఎలా కాపాడుకోవాలని విద్యార్థి కూడా తాపత్రయపడి ఆ మొక్కను పెంచుతాడు. కనుక ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలి.

- కె.రాఘువేంద్ర బాబు, ఆంధ్రప్రదేశ్

## ఉచిత వైద్యం కల్పించాలి

కేంద్రప్రభుత్వం సుమారు ఏడాది క్రితం ఘనంగా ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ కార్డులు తెలంగాణా రాష్ట్రంలో అయితే ఇంతవరకు జారీ కాలేదు. మీ సేవ వారికి కూడా ఏ విధమైన సమాచారం లేదు. ఆధార్ కార్డు ద్వారా కె.వై.సి. తీసుకుంటే హాస్పిటల్ వాళ్లు దానిని వైద్యానికి ఒప్పుకుంటారని అంటున్నారు. ఇంతవరకు ఆపత్రాలను చూపించివైద్యం చేయించుకున్న వాళ్లెవరు తారస పడలేదు. మరొక విషయ మేమంటే ఈఆరోగ్యపథకం ఎమర్జెన్సీలో హాస్పిటల్‌లో చేర్చుకున్న వారికే వర్తిస్తుందట. అవుట్ పేషంట్లకు ఈ పథకం పనికి రాదట. 70 సంవత్సరాలు నిండిన కోట్ల మందిలో ఎంతమందికి ఈ పథకం సహాయ పడుతుంది? ఆపైన ఈ 5లక్షల పథకం ఏడాదికి భార్యాభర్తలకు కలిపి ఉంటుందట. కేవలం ఆధార్ కార్డు ద్వారా 70 ఏళ్లు దాటిన వారందరికి ఏ అడ్డంకులు లేకుండా సూచించిన వైద్యశాలల్లో ఉచిత వైద్యం కల్పిస్తే ఏ గందరగోళం ఉండదు కదా! ఏమిటో ప్రస్తుత పథకం పూర్తిగా ఎవరికి అర్థం కావడం లేదు. ఉచిత వైద్యం అందిరికి లభించేలా ఉండాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## నైతిక విద్యను బోధించాలి

నేడు విద్యారంగం వేగంగా మారుతూ విద్యార్థులను సాంకేతికంగా, అకడమిక్‌గా ముందుకు తీసుకెళ్తున్నప్పటికీ, మానవీయవిలువల బోధనలో పెద్దఎత్తున లోటు కనిపిస్తోంది. మంచి మార్కులు, ప్రవేశ పరీక్షల ఫలితాలు, ఉద్యోగ అవకాశాలు వంటి వాటికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల, విద్యార్థుల్లో నైతికత, సమాజంపట్ల బాధ్యత, మంచిప్రవర్తన వంటి గుణాలు నెమ్మదిగా నశిస్తున్నాయి. ఇది ఆందోళన కలిగించే విషయం. చదువుతోపాటు విద్యార్థులు మంచితనం, నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యత వంటి నైతిక విలువలతో పెరుగుతుంటేనే సమాజానికి వారు ఆస్తిగా మారగలుగుతారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పరిశోధన సీట్లు పెంచాలి

తెలంగాణ రాష్ట్రంలోఉన్న వివిధ యూనివర్సిటీలలో పరిశోధన చేయడానికిగాను మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ ( ఏంఫిల్ )డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పిహెచ్‌డి)పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ (పిడిఎఫ్) ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యూనివర్సిటీ గ్రాంట్‌కమిషన్(యుజిసి)పరిశోధనలను పెంచడానికి యూనివర్సిటీలను ప్రోత్సహించాలి. సీట్ల సంఖ్యపెంచాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# న్యాయవ్యవస్థపై నమ్మకం పెరగాలంటే..

భాస్కర్ యలకంటి

గత మార్చి నెలలో ఢిల్లీ న్యాయమూర్తి జస్టిస్‌యశ్వంత్ వర్మ అధికార నివాసంలో భారీ స్థాయిలో కాలిపోయిన నోట్ల కట్టల ఉదంతం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ దృశ్యాలన్నీ ప్రముఖ టీవీఛానల్లలో ప్రసారమవ్వడమే కాకుండా అన్ని పత్రికలు పతాకశీర్షికన ఆ వార్తను ప్రచురించడంతో న్యాయవ్యవస్థ విశ్వసనీయతపై నీలినీడలు కమ్ముకున్నాయని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతేకాక అపనమ్మకం కలిగించే ఇలాంటి సంఘటనల గురించి ప్రజలు పలు విధాలుగా చర్చించుకునేందుకు తావివ్వడంతో పాటు ఇలాంటి సంఘటనలు అన్ని వ్యవస్థల్ని అసంతృప్తికి గురిచేస్తాయని వారు వాపోతున్నారు. సగటు పౌరుని అనుమానాన్ని నివృత్తిచేయడం ద్వారా న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం దిద్దుబాటు చర్యలకు పూనుకుంటోంది. దానికోసం వడివడిగా అడుగులు వేస్తోంది. అందుబాటులో ఉన్న అన్నిఅస్త్రాలను సంధించి జస్టిస్ వర్మను సాగనంపడానికి సిద్ధపడుతోంది. జస్టిస్ వర్మ ఇంట్లోకి ఆ నోట్లకట్టలు ఎలా వచ్చాయి? ఎవరిచ్చారు? అనే దానిపై విచారణ చేపట్టడానికి కోర్టులు అనుమతించలేదు. ఎఫ్ఐఆర్ చేయడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. సుప్రీంకోర్టు ఎలాంటి బహిరంగ ప్రకటన చేయనప్పటికీ సుప్రీంకోర్టే చొరవ తీసుకుని ఇన్‌హౌస్ కమిటీని వేసి విచారణ చేపట్టి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. వర్మకు కీలక సూచనలు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు జస్టిస్ వర్మను ఢిల్లీ నుండి అలహాబాద్ కోర్టుకు బదిలీ చేసింది. ఆయన అలహాబాద్‌కు వస్తే బహిష్కరిస్తామని అక్కడి బార్‌కౌన్సిల్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఆయన రావడం రిపోర్టు చేయడం జరిగిపోయినప్పటికీ కేసులు అసైన్ చేయలేదు. అలా చేయడం న్యాయవ్యవస్థపై ప్రజల మనసులలో తొలుస్తున్న అనుమానాలకు సమాధానం కాదని పలువురు న్యాయకోవిదులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే అంశంపై ఉపరాష్ట్రపతి జగదీప్ దన్ ఖడ్ కూడా రెండోసారి వ్యాఖ్యానించడం ఈ సంఘటన ఎంత ప్రాధాన్యతను సంతరించుకున్నదో అవగతం అవుతున్నది. వ్యవస్థలను ప్రజలకు జవాబుదారీగా ఉంచాలనే ఉద్దేశంతోనే అభిశంసన తీర్మానమనేది రాజ్యాంగ ప్రక్రియ. ఈ అభిశంసన అనేది హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పారదర్శకతపై అనుమానాలు, విమర్శలు, ఆరోపణలు తలెత్తినప్పుడు వారిని తొలగించేందుకు చేపట్టే ప్రక్రియ. ఇది చట్టపరంగా పార్లమెంటుకు ఉన్న ప్రత్యేకమైన వెసులుబాటు. ఈ ప్రక్రియను జడ్జెస్‌ఎంక్వయిరీ యాక్ట్ 1968 ద్వారా చేపడతారు. లోక్‌సభలో అయితే కనీసం 100 మంది, రాజ్యసభ అయితే 50 మంది సభ్యులు ఈ తీర్మానం మీద సంతకం చేయాలి. రాజ్యసభ చైర్మన్ లేదా లోక్‌సభ స్పీకర్ చేత నియమించబడ్డ విచారణ కమిటీ



ద్వారా నివేదిక ఇవ్వబడుతుంది. ఆ నివేదిక ద్వారా న్యాయమూర్తి దోషిగా తేలితే దానిని పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టబడి మూడింట రెండో వంతు మెజారిటీతో ఆమోదించబడితే రాష్ట్రపతి సదరు న్యాయమూర్తిని తొలగిస్తారు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ఆ మెజారిటీ సాధించడం అధికార పక్షానికి పెద్ద కష్టమేమీకాదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. విపక్షాలపై ఆధారపడకుండానే అభిశంసన ప్రక్రియను పూర్తిచేసే అవకాశం ఉన్నప్పటికీ వర్మ తీరును విపక్షాలు సైతం తప్పుపడుతుండడంతో అభిశంసనకు మరింత బలం చేకూరడం తథ్యమని విమర్శకులు సైతం విశ్లేషిస్తున్నారు. యశ్వంత్ వర్మ కేసు విషయంలో సుప్రీంకోర్టు నియమించిన ఇన్‌హౌస్ కమిటీ నివేదికలో భారీ మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టల ఆధారాన్ని బలంగా పేర్కొనడంతో అభిశంసనకు మరింత మద్దతు పెరగడం ఖాయమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు అభిశంసన ప్రక్రియలు చాలా అరుదుగానే జరిగాయి. 1991లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నజస్టిస్ వి.రామస్వామిపై ఆర్థిక అవకతవకల ఆరోపణలతో లోక్‌సభలో 108 మంది సభ్యులచే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టబడినప్పటికీ కాంగ్రెస్ గైర్హాజరు కావడంతో ఈ తీర్మానం వీగిపోయింది. ఆయన పూర్తికాలం కొనసాగినప్పటికీ ఆయనకు కేసులు మాత్రం అసైన్ చేయలేదు. ఇక 2011లో కోల్‌కత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్రా సేన్ పై ఆర్థిక అవకతవకలపై రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టబడి ఆమోదించబడింది. లోక్‌సభలో ఓటింగ్‌కు ముందే ఆయన రాజీనామా చేయడంతో ఆవివాదంఅంతటితో ముగిసిపోయింది. 2017లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి నాగార్జున్ రెడ్డిపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టబడినప్పటికీ కొంతమంది ఎంపీలు తమ సంతకాలను ఉపసంహరించడంతో అది కూడా వీగిపోయింది. 2018లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై రాజ్యసభలో విపక్షాలన్నీ ఏకమై రాజకీయపరమైన అభిప్రాయాలతో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ రాజ్యసభ చైర్మన్ దాన్ని ప్రాథమిక దశలోని తిరస్కరించడంతో తీర్మానం ముందుకు పోలేదు. ఇలా వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని మాత్రమేనని చీకట్లో ఇంకా ఎన్ని ఉన్నాయోనని ప్రజాస్వామికవాదులు అభిప్రాయపడుతున్నారు. రాజ్యాంగ పరమైన అంశాలపై ఇటీవల దాఖలైన పలు పిటిషన్లను నామమాత్రమైనా పరిశీలించకుండానే ఆదిలోనే కొట్టివేయడాన్ని ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా నిలిచే పార్లమెంటును సైతం న్యాయమూర్తుల నియామకంలో భాగస్వామ్యం చేయకపోవడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. మరోపక్క స్వయం ప్రతిపత్తి అనే పేరున న్యాయవ్యవస్థలో న్యాయమూర్తుల నియామకాన్ని న్యాయమూర్తులే చేపట్టడంవల్ల పారదర్శకత లోపిస్తున్నదని, జవాబుదారీతనం అడుగంటుతుండడమేకాక 'అంకుల్ జడ్జ్ సిండ్రోమ్' వల్ల తమ అనుయాయులకే పెద్ద పీట వేసే అవకాశంఉన్నదని న్యాయ కోవిదులు అభిప్రాయ పడుతున్నారు. దీన్ని అధిగమించడానికి 99వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకువచ్చిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌తరహాలో సరికొత్త కమిషన్‌ను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉన్నదని రాజ్యాంగ నిపుణులు సైతం కోరుతున్నారు. మొత్తం మీద పూర్తిస్థాయిలో వ్యవస్థనుప్రక్షాళనచేసి సగటు భారతీయునిలో న్యాయవ్యవస్థ పట్ల గౌరవాన్ని పెంపొందించేవిధంగా అడుగులుపడతాయని ఆశిద్దాం! •

## విద్యార్థుల బంగారు భవితకు బాటలు :ఎమ్మెల్యే

**గుంటూరు తూర్పు, జూన్ 12 ప్రభాతవార్త :** విద్యార్థులకు భవితకు బంగారు బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం తొలి నుంచే ప్రోత్సాహకం అందిస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని రైలు పేట నాంచారమ్మ బాలికల పాఠశాలలో విద్యార్థులకు గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుత యువ నాయకులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపులకు ప్రత్యేక కృషి చేపట్టినట్లు తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 953కోట్లు ఖర్చు హెచ్చిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూ.175కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.778కోట్లు ఖర్చు కేటాయించిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 35,94,774మంది పిల్లలకు కిట్లను అందించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.2500ఖర్చు చేస్తున్నామని, ఈ కిట్లలో నోట్‌బుక్స్, బ్యాగ్స్, టెక్స్‌బుక్స్, షూస్, రెండు జతల సాక్స్, మూడు జతల యూనిఫాం, బెల్ట్ మరియు ఆరో తరగతి విద్యార్థులకు డిక్షనరీ కూడా ఉన్నాయని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో 90ప్రభుత్వ పాఠశాలల్లో11,500మందికి రూ.3కోట్ల విలువైన ఈ కిట్లను అందించామని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ద్వారా పది వేల మంది విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. పదో తరగతి ఫలితాల్లో 500మార్కులు దాటిన గుంటూరులోని విద్యార్థులకు షైనింగ్ స్టార్ కార్యక్రమం ద్వారా ఒక్కొక్కరికి రూ.20వేలు ప్రోత్సాహమిచ్చామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వాష్‌రూమ్స్, డ్రింకింగ్ వాటర్ విద్యుత్, పర్నిచర్ కంప్యూటర్లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మేజర్ డ్రైన్ల కల్వర్ట్‌ల వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేయాలి

– కమీషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు తూర్పు, జూన్ 12 ప్రభాతవార్త :** నగర పాలక సంస్థ పరిధిలోని మేజర్ అవుట్ పాల్ డ్రైన్లపై ఉన్న కల్వర్ట్‌ల వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేసి వ్యర్థాలను ఎక్కడిక్కడ అడ్డుకొని తొలగించాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం కమీషనర్ పండరీపురం, కృష్ణనగర్, బ్రాడీపేట, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పారిశుద్ధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు డ్రైన్లలోకి రాకుండా మేజర్ డ్రైన్ల కల్వర్ట్‌ల వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేయడం ద్వారా అడ్డుకోవాలని, తద్వారా డ్రైన్లు పొంగి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడవచ్చన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున చెత్త రోడ్ల మీద డంప్ కాకుండా ప్రతి ఇంటి నుండి ప్రజారోగ్య కార్మికులు వ్యర్థాలు సేకరించాలన్నారు. వార్డ్, సచివాలయాల పరిధిలో పారిశుద్ధ్యం పక్కాగా ఉండేలా శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు చెల్లింపు జరగదని స్పష్టం చేశారు. పూడికతీత పనులను నూరు శాతం నాణ్యతా ప్రమాణాలు పాటించేలా డిఈఈలు, ఈఈలు పరిశీలించాలని ఆదేశించారు. పర్యటనలో ఏసిపి రెహ్మాన్, డిఈఈ రమేష్‌బాబు, ఎస్ఎస్ ఎన్వీఎస్ ప్రసాద్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# కూటమి సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకుళ్ళండి..

– గత ప్రభుత్వ వైఫల్యాలను దాటుకుని పని చేస్తున్నాం..
– వైసీపీ హఠావో..గుంటూరు బచావో..

**గుంటూరు తూర్పు, జూన్ 12 (ప్రభాతవార్త) :** గడిచిన ఐదేళ్ళ పాలనకు, కూటమి పాలనకు తేడాను ప్రజలు గమనించాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. గురువారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో నసీర్ ఆధ్వర్యంలో ఏడాది పాలన విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మేయర్ కోవెలమూడి నాని, ఏపీ ఇండస్ట్రియల్ ఛైర్మన్ డేగల ప్రభాకర్‌లు పాల్గొన్న కార్యక్రమంలో పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ దొంగ బిల్లులు పెట్టి కేంద్ర ప్రభుత్వాన్ని మభ్యపెట్టి రూ.250కోట్లను వైసీపీ ప్రభుత్వం వసూలు చేసుకుందన్నారు. జగన్ పాలనలో అభివృద్ధి నిర్వీర్యం అయ్యింది తప్ప ఎక్కడా ప్రజా సంక్షేమం జరగలేదని, సంక్షేమం పేరుతో పొద్దునే డబ్బులు ఇచ్చి సాయంత్రానికి వసూలు చేసుకున్నారని విమర్శించారు. 2014-2019 సమయంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా 500పనుల చేస్తామని టిడిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించిందని, అందులో 55పనులను కూడా పూర్తి చేసిందని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అదనంగా మరో 80పనులను కూడా పూర్తి చేశామని కేంద్రానికి బిల్లులు సమర్పించిందని, అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆడిట్ నిర్వహించగా పనులు చేయకుండానే నకిలీ బిల్లులను సమర్పించినట్లు తేలిందని వివరించారు. మైనార్టీ సోదరులు జగన్ చేసిన మోసాన్ని గమనించాలన్నారు. గడిచిన ఐదేళ్ళలో ఒటన్ నొక్కుడు కార్యక్రమం కాకుండా ముస్లింలకు ఏం చేశారు, ఒక స్కూల్ కట్టించారా, ఒక రోడ్డు వేయించారి, ముస్లిములకు కనీసం ఏదైనా సంక్షేమం అందించారా అన్నారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఇక మన సిద్దాంతం వైసీపీ హఠావో గుంటూరు బచావో నినాదామని అన్నారు. కార్యకర్తలందరూ ఇకపై ప్రజల్లోనే ఉండాలని, అప్పుడే గుర్తింపు లభిస్తుందని తెలిపారు. మన ప్రాంత ప్రజలు సమస్యల పరిష్కారానికి వేరే వారి దగ్గరకు వెళితే అది మన అసమర్ధతకు నిదర్శనమని చెప్పారు. ఏడాది కాలంలోనే అన్ని రంగాల్లో అభివృది సాధించామని వెల్లడించారు. తూర్పు నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. అందరం ఒకే కుటుంబాలా కలిసి పని చేద్దామని, ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో బీసీ సంక్షేమ హాస్టల్‌ను గాలికొదిలేశారని, తాము అధికారంలోకి వచ్చాక సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్ళి రూ.5కోట్లతో పూర్తి చేయించానని తెలిపారు. రోడ్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సీసీ డ్రైయిన్లు, అంగన్‌వాడీ సెంటర్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టామని వెల్లడించారు.





## ప్రశంసించిన కమీషనర్ ధ్యానచంద్ర

: క్యాంటీన్‌ను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయించాలని ఆదేశాలు
: రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్న వైనం



**విజయవాడ కార్పొరేషన్, జూన్ 12, ప్రభాతవార్త**

అన్నా క్యాంటీన్ నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా,అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయించి,క్యాంటీన్‌ను చక్కగా చూస్తున్నందుకు నిర్వాహకులను మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర మెచ్చుకున్నారు. గురువారం ఆయన గాంధీనగర్, ఈట్‌స్ట్రీట్, ఏలూరు రోడ్ జంక్షన్,బిఆర్టీఎస్ రోడ్,ఎంజి రోడ్ ప్రాంతాలను పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ధర్నా చౌక్‌లోని అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. నోడల్ ఆఫీసరుల అందరూ అన్నా క్యాంటీన్ల నిర్వహణ ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలన్నారు. ఈట్‌స్ట్రీట్ రోడ్,ఏలూరు రోడ్ జంక్షన్,ఎంజీ రోడ్డు ప్రాంతాలను పర్యటించిన ఆయన పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలను తొలగించాలని, శాఖల సమన్వయంతో ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా వ్యర్థాలు తొలగించాలని, నిర్మాణ వ్యర్థాలైన,చెట్టు వ్యర్థాలైన శాఖలలో ఒకరికొకరు సమన్వయంతో పనిచేయాలన్నారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**నాదెండ్ల, జూన్12, ప్రభాతవార్త:** రక్తదానంపై రెడ్‌క్రాస్ సభ్యులు యువతకు అవగాహన కల్పించాలని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం మండలంలోని నాదెండ్ల యంపిడిఓ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సంస్థ ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రత్తిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానాన్ని జీవితంలో ఖచ్చితంగా చేపట్టాల్సిన ఒక మంచి కార్యక్రమంగా నేటి యువత భావించేలా వారిలో చైతన్యం తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు ప్రశంసా పత్రాలు, పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ స్వరూపరాణి, తహసిల్దార్ ఎవి రమణ, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్‌మోహన్, నల్లమోతు హరిబాబు, గంగా శ్రీనివాసరావు, కందుల రమణ, గుర్రం నాగపూర్ణచంద్రరావు, వజ్జా సింగయ్య, గట్టినేని విజయసాయి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు కష్టంతోనే కూటమి విజయం

– పట్టణంలో భారీ ర్యాలీ

**నరసరావుపేట, జూన్ 12 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కష్టం...కార్యకర్తల కృషితోనే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. గురువారం కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విజయోత్సవ ర్యాలీలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ పల్నాడురోడ్డులోని చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు జరిగింది. ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు స్వయంగా ట్రాక్టర్ నడిపి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నరసరావుపేటలో ఎన్ని కుట్రలు, కుతంత్రాలు జరిగినా ధైర్యం, నిజాయితీతో ముందుకు వెళ్ళానని, తనకు కార్యకర్తలు, మహిళలు అండగా నిలిచారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సిఎం చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. తల్లికి వందనం పథకంలో తల్లుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఉచిత బస్సు పథకం ఆగస్టు నుండి ప్రారంభిస్తామన్నారు. చదువుకున్న ప్రతి యువతకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. రైతులకు రైతు భరోసా అందిస్తామన్నారు. 20 ఏళ్ళ తర్వాత నియోజకవర్గంలో పార్టీ పతాకాన్ని ఎగురవేశామని, మరో 20 ఏళ్ళు తెలుగుదేశం నియోజకవర్గంలో అధికారంలో ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, నియోజకవర్గ పరిశీలకులు మన్నవ మోహనకృష్ణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మార్కెట్‌యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## రామచంద్రాపురం వద్ద నిరసన ఆందోళన

: ఎన్‌హెచ్-30పై దశాబ్దకాలంగా ప్రమాదాలు వాహన చోదకుల సర్కస్ ఫీట్లు.. వైసిపి రాష్ట్ర నేత వీరారెడ్డి శివారెడ్డి

**ఎకొండూరు, జూన్ 12, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం మైలవరం తిరువూరు జాతీయ రహదారి-30పై ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో గత 10 సంవత్సరాలుగా నిలిచిపోయిన రహదారి విస్తరణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రమాదాల నివారణకు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వెంటనే చర్యలు తీసుకుని ఈ ప్రాంత ప్రజలను ప్రయాణీకులను ఆదుకోవాలని వైసిపి రాష్ట్ర నాయకుడు నరెడ్ల వీరారెడ్డి ఎ కొండూరు వైస్ ఎంపిపి గుంటక శివారెడ్డి గురువారం రహదారిపై నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వీరారెడ్డి శివారెడ్డి మాట్లాడుతూ రహదారి విస్తరణ పనులు పూర్తి చేయడానికి ఎన్‌హెచ్-30 ఉన్నతాదికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని దీనివల్ల గత దశాబ్దకాలంగా రహదారి విస్తరణ పనులు పూర్తికాకపోవడంతో ఈ రహదారిపై సర్కస్ ఫీట్లు చేస్తున్నారని పక్కన నివాసం ఉంటున్న ప్రజలు వాహనాల దుమ్ముధూళి వల్ల పొల్యూషన్, కాలుష్యం వల్ల శ్వాసకోశ గుండె సంబధిత లివర్ క్యాన్సర్ లాంటి జబ్బులు సోకుతున్నాయని అలాగే రాత్రి సమయాల్లో ఈ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహన చోదకులు పలువురు రహదారి ప్రమాదం వల్ల మృతి చెందారని ఇకనైనా ఈ జాతీయరహదారి-30పై వెంటనే ఈ గ్రామంలో రహదారి విస్తరణ పనులను వెంటనే చేపట్టి వర్షాలు ప్రారంభం కాకముందే పూర్తి చేసి ప్రమాదాల నివారణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వీరారెడ్డి శివారెడ్డి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## భావి తరాలకు స్ఫూర్తి డాక్టర్ వెలగా వెంకటప్పయ్య సేవలు

–మంత్రి నాదెండ్ల మనోహర్

**తెనాలి, జూన్ 12 (ప్రభాతవార్త) :** గ్రంధాలయ గాంధి డాక్టర్ వెలగా వెంకటప్పయ్య గ్రంధాలయాలకు, సాహితీ రంగానికి చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తినిస్తాయని పౌర సరఫరాలు, ఆహారం మరియు వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. డాక్టర్ వెలగా జయంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తెనాలి బండ్‌పై ఏర్పాటు చేసిన డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కాంస్య విగ్రహాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఉదయం ఆవిష్కరించి అనంతరం ప్రసంగిస్తూ తెనాలి పురపాలక సంఘం శతాబ్ది ఉత్సవాల సమయంలో రూపొందిన సావనీర్ ముద్రణలో డాక్టర్ వెలగా కీలక పాత్ర పోషించారని గుర్తు చేసి ప్రశంసించారు. గ్రంధాలయాల సంక్షేమానికి నిరంతరం కృషి చేసిన మహనీయుడు డాక్టర్ వెలగా అన్నారు. గ్రందాలయాలు, సాహితీ రంగాలలో డాక్టర్ వెలగా అనుభవాలు నేటి యువతకు స్ఫూర్తినిస్తాయన్నారు. తెలుగు భాషాభివృద్ధికి దోహదపడేలా భావి తరాల వారికి ఉపయోగపడేలా అనేక పుస్తకాలను రచించి ఎందరో రచయితలు సాహిత్యంలో ముందుకుపోయే విధంగా ప్రోత్సహించారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ నడిచే జ్ఞాన సర్వస్వం డాక్టర్ వెలగా వెంకటప్పయ్య అన్నారు. గ్రంధాలయ ఉద్యమానికి ఊపిరి పోసిన డాక్టర్ వెలగా బాలసాహిత్యంలో సైతం ఎనలేని కృషి చేసి చిన్నారులకు అర్థమయ్యే రీతిలో సరళమైన భాషలో అనేక పుస్తకాలు రాయడంతో పాటు ఎందరో రచయితలు, బాలసాహితీవేత్తలుగా ఎదిగేలా తమ వంతు ప్రోత్సాహాన్ని అందించిన సహృదయుడు డాక్టర్ వెలగా అని మండలి బుద్ధ ప్రసాద్ కొనియాడారు. మహిళా కమీషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ నడిచే గ్రంధాలయం డాక్టర్ వెలగా వెంకటప్పయ్య అన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకున్నా విగ్రహ రూపంలో మన మధ్యనే ఉంటూ తరతరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ గ్రంధాలయ సంస్థలకు సాహిత్యానికి డాక్టర్ వెలగా చేసిన సేవలను ప్రశంసించారు. డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కాంస్య విగ్రహాన్ని తయారు చేసిన శిల్పులు కాటూరి వెంకటేశ్వరావు, రవిచంద్రలను కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెలగా కుమారులు సర్వోత్తమరావు, నాగార్జున, వెంకట్రావు, మానవేంద్రతో పాటు లంకా సూర్యనారాయణ, ఈదర పూర్ణచంద్, వెలగా వీరయ్య, మాదిరాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు బాధ్యతగా మెలగాలి

: ట్రాఫిక్ సి.ఐ. లోక్‌నాథం

**నరసరావుపేట క్రైం, జూన్ 12 ప్రభాతవార్త :** వాహనదారులు బాధ్యతగా మెలగాలని ట్రాఫిక్ సి.ఐ. లోక్‌నాథం అన్నారు. స్థానిక కోట సెంటర్‌లో గురువారం రాత్రి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను అనధికారిక స్థలాల్లో పార్కింగ్ చేస్తే వాటిని వ్యాన్ ద్వారా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సి.ఐ. లోక్‌నాథం మాట్లాడుతూ వాహనాలను పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే నిలుపుదల చేయాలన్నారు. రోడ్డుకు అడ్డుగా వాహనాలను నిలిపితే ఖచ్చితంగా చలానాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కోర్టుకు వెళ్ళి వాహనాలను తీసుకునే పరిస్థితి కలుగుతుందన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, మైనర్‌లు వాహనాలను నడపడం, హెల్మెట్, వాహనపత్రాలు లేకపోవడం చట్ట వ్యతిరేకమన్నారు. ఖచ్చితంగా ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని సి.ఐ. లోక్‌నాథం సూచించారు.



## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

– ఎంపీడీఓ విజయలక్ష్మీ



**కొల్లిపర, జూన్ 12 ప్రభాతవార్త:** సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ అన్నారు. బుధవారం మండలంలోని తూములూరు సచివాలయాన్ని ఆమె తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళా సింగర్ మంగ్లీపై కుట్రలు ఆపకుంటే.. తీవ్ర పరిణామాలు



**విజయవాడ, జూన్ 12, ప్రభాతవార్త :** ప్రజల్లో ఆదరణ చూరగొన్న గిరిజన మహిళా సింగర్ మంగ్లీపై కుట్రలు చేస్తున్న వారు వెంటనే ఆపాలని లేకుంటే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డా పోతుల నాగరాజు, ఉపాధ్యక్షులు చింతల రామ్మోహన్‌రావు, యువత రాష్ట్రాధ్యక్షుడు శంకర్ గౌడ్‌లు తీవ్రంగా హెచ్చరించారు. పాటకు కులం లేదన్నారు. గురువారం విజయవాడలో వారు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఒక వ్యక్తిగత విందుకు హాజరైన మంగ్లీపై రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు చేసినవారు భారతరాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వాలకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు మద్యంపేరుతో ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేయడాన్ని ఖండించాల్సింది పోయి సాంస్కృతిక విలువల పేరిట గిరిజన మహిళా సింగర్ మంగ్లీపై ఆరోపణలు చేయడం దుర్మార్గచర్యగా అభివర్ణిస్తూ ఇటువంటి ద్వంద్వ నైతిక విలువలతో కుట్రలు చేస్తున్న వారికి వ్యతిరేకంగా, మంగ్లీకి మద్దతుగా గిరిజన, దళిత, బలహీనవర్గాల ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, విలువలున్న మీడియా అండగా నిలిచి కుట్రదారుల చౌకబారు ఆరోపణలు తిప్పికొట్టాలన్నారు.

# చంద్రబాబు నాయకత్వమే రాష్ట్ర ప్రగతికి ఇంధనం : మాజీమంత్రి, శాసనసభ్యుడు ప్రత్తిపాటి

**పార్టీ కార్యాలయంలో పట్టణంలో పలు చోట్ల కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా వేడుకలు**

**చిలకలూరిపేట, జూన్12, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రజలు గుండెలపై చేయి వేసుకొని ప్రశాంతంగా జీవిస్తున్నారని, అందుకు కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వమేనని, అదే రాష్ట్ర ప్రగతికి ఇంధనమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తిఅయిన సందర్భంగా పట్టణ వ్యాప్తంగా జరిగిన మూడు పార్టీల విజయోత్సవ వేడుకలలో టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో కలసి ప్రత్తిపాటి పాల్గొన్నారు. తొలుత పార్టీ కార్యాలయంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్‌ను పార్టీ మహిళా నాయకులు, నాయకులతో కలసి కట్‌చేసి శ్రేణులకు తినిపించారు. పట్టణంలో పొట్టి శ్రీరాములు వీధిలో టిడిపి నాయకులు కనమర్లపూడి రమేష్, కనమర్లపూడి లక్ష్మీతిరుమలలు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ప్రత్తిపాటి కట్‌చేసి పార్టీ శ్రేణులకు తినిపించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ చొరవ వల్లే రాష్ట్రానికి రూ9.70లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని అన్నారు. ఒక్క సంవత్సరంలో ఏ ముఖ్యమంత్రి ఇంత భారీస్థాయిలో పెట్టుబడులు ఆకర్షించలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని జనసేన, బిజెపి శ్రేణుల తోడ్పాటుతో చంద్రబాబు రాష్ట్ర ప్రగతికోసం ఎంతో కృషి చేస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. తల్లికి వందనం అమలుకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి 67,27,164 మంది విద్యార్థులకు మేలు చేసేలా నిర్ణయం తీసుకున్నారని ప్రత్తిపాటి



పేర్కొన్నారు. ఈ పథకంలో బాగంగా తమ బిడ్డల చదువుల కోసం తల్లుల ఖాతాలకు ఈ తేదిన రూ 8745 కోట్లు జమ చేయటం జరిగిందని అన్నారు. ఇప్పటికే సామాజిక ఫించన్ల పెంపు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, అన్నక్యాంటిన్ల ఏర్పాటు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు, మెగా డిఎస్సీ సహ అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు. ఈనెల 21నుంచి అన్నదాత సుఖీభవ కింద అర్హులైన ప్రతి రైతు ఖాతాకు తొలివిడతగా రూ 7వేలు ఆర్థిక సహాయం అందించనున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ఆగష్టు 15నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్ ప్రయాణాన్ని కూడా ప్రవేశపెట్టడానికి ముఖ్యమంత్రి అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేస్తుందని, ప్రభుత్వ పనితీరు చూసి తట్టుకోలేని కొందరు స్వార్ధపరులు చేసే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ప్రత్తిపాటి సూచింరారు. జగన్ భూతం రాష్ట్ర ప్రగతిని, ప్రజల సంతోషాన్ని జీర్ణించుకోలేక పోతుందని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భూతం విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు వైసిపి కుయుక్తులను, కుట్రలను తిప్పికొట్టాలని, లేకుంటే రాష్ట్రం మరలా దారుణమైన పరిస్థితులలోకి వెళుతుందని ప్రత్తిపాటి సూచించారు. చంద్రబాబు ఆలోచనలను, దూరదృష్టిని ప్రపంచమే కొనియాడుతుందని, ప్రధాని మోడీ కూడా చంద్రబాబును అభినందించడం ఆయన పనితీరుకు నిదర్శనమని ప్రత్తిపాటి కొనియాడారు. దేశంలోని అత్యంత అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రులలో మన నాయకుడు ఒకరని, 75 ఏళ్ల వయసులో ఆయన అవిశ్రాంతంగా రాష్ట్ర ప్రజల కోసం పనిచేస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల కలయిక, వారి నాయకత్వం రాష్ట్రానికి ఎంతో అవసరమని అన్నారు. దేశంలోనే రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ఆగ్రస్థానాలలో నిలపటమే చంద్రబాబు ఏకైక లక్ష్యమని ప్రత్తిపాటి చెప్పారు. మరో 15 ఏళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండాలన్న గట్టి పట్టుదలతో ప్రజలు ప్రజాప్రభుత్వానికి తమ మద్దతు తెలియచేయాలని ప్రత్తిపాటి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటితో పాటు, టిడిపి, బిజెపి, జనసేన పార్టీల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, వార్డు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక అతావుల్లా బాబా దర్బార్ అండ్ దర్గా..

**– అతావుల్లా బాబా అన్నం మెతుకుతో దీర్ఘవ్యాధులు మటుమాయం**
**– బాబా వారసుడు పీఠాధిపతి కుటుంబ సేవల్లో సమిదలు**



**ఎ కొండూరు, జూన్ 12, ప్రభాతవార్త :**
ఆషికే రసూల్ నఖీబుల్ ఔలియా హజరత్ సూఫీ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాబా వారి మహాదివ్య అన్న సమారాధన కార్యక్రమాలకు మంగళ బుధవారాలు వారసుడు పీఠాధిపతి పీర్‌జాదా ఎండి ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ బాబా ఆధ్వర్యంలో కులమతాలకతీతంగా వేలాది మంది బాబా వారి భక్తులకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాబా భక్తులు పాల్గొని దర్బార్ అండ్ దర్గ వద్ద మీడియాతో మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే అతావుల్లా బాబా దర్బార్ గత 63ఏళ్లుగా అలుపెరుగని అన్నదాత హజరత్ అతావుల్లా బాబా అన్నం మెతుకు తన దివ్య శక్తితో తిన్న వారికి ఎన్నో దీర్ఘకాలిక జబ్బులు తగ్గాయని ఈ అతావుల్లా బాబా మెతుకు స్వీకరణ వల్ల అనేక మంది కులమతాల కతీతంగా గత 63ఏళ్లుగా దర్బార్‌కు వెళ్లి మానసిక ప్రశాంతత వారి దివ్య ఆశీస్సులతో ఒక అతీతమైన అతావుల్లా బాబా శక్తితో ప్రతి ఒక్కరు ధార్మిక ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత పొందుతున్నామని పలువురు భక్తులు తమ భక్తి భావనతో అభిప్రాయాలు వెల్లడించారు. అతావుల్లా బాబా పరమపదించిన తర్వాత బాబా ఆధ్యాత్మిక వారసుడు ఖాజా బాబా వారి తనయులు జాఫర్ సాదిక్ తాజ్ ఖాదర్ బాబా తనయ బొగ్దాది భక్తులకు ఎన్నో సేవలందిస్తూ అన్నదాన క్రతువులో పాల్గొని సమిదలై స్వయంగా వండి వడ్డించి భక్తులకు ప్రసాద వితరణ విసుగు విరామం లేకుండా నిరతాన్నదానం పేదలకు ఆకలిగొన్న వారికి అన్నం పెడుతూ వారి క్షుద్బాధ తీరుస్తూ అన్ని దానాల్లో కంటే అన్నదానం మిన్న అన్న ఆర్యోక్తిని తూచా తప్పకుండా 63ఏళ్ళుగా పాటిస్తూ దర్బార్‌లో సేవలందించడం మానవసేవే మాధవసేవకు ప్రతిరూపంగా వీరు సేవలందించడం విశేషం.

## భారత్‌లో వృద్ధికి స్కోడా ఆటో ఫ్రేంవర్క్

**విజయవాడ, జూన్ 12, ప్రభాతవార్త :**
ఈ ఏడాది 130ఏళ్ళ గొప్ప చరిత్రను, 25ఉత్తేజకర ఏడాదులను వేడుకగ నిర్వహిస్తున్నట్లు స్కోడా ఆటో ఇంఇయా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్‌గుప్తా తెలిపారు. ఐరోపా వెలుపల భారతమార్కెట్ తమకు కీలకమైన వృద్ధి మార్కెట్ అని భారత్‌లో వృద్ధికి తగిన ఫ్రేంవర్క్ రూపొందించామన్నారు.

## శాంసంగ్ భాగస్వామ్యంతో బెంగుళూరులో వి 5జి వాణిజ్య సేవలు

**విజయవాడ, జూన్ 12, ప్రభాతవార్త :**
సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా బెంగుళూరులో 5జి సేవలందించేందుకు శాంసంగ్ భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు టెలికం ఆపరేటర్ వోడాఫోన్ ఇండియా (వి) ప్రతినిథులు తెలిపారు. 2024 నుండి కంపెనీలు న్యూజనరేషన్, 5జి నెట్వర్క్‌ను అమలు చేయడానికి, బీహార్, కర్నాటక, పంజాబ్‌తో సహ భారత్‌లో ప్రధాన టెలికం సర్కిళ్లలో శాంసంగ్ పరిశ్రమ ప్రముఖ పరిష్కారాలతో వి యొక్క లెగసి 2జి, 4జి నెట్వర్క్‌లను ఆధునీకరించడానికి కలిసి పనిచేస్తున్నాయన్నారు.

## విశాఖలో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ కేర్‌బ్లాక్

**విజయవాడ, జూన్ 12, ప్రభాతవార్త :**
టాటా మెమోరియల్ సెంటర్తో కలిసి విశాకపట్నంలో హోమీ బాబా క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో కొత్త భవంతి నిర్మాణపనులను ప్రారంభించినట్లు ఐసిఐసిఐ బ్యాంక్ ప్రతినిథులు తెలిపారు. 3.9లక్షల చ.అ విస్తీర్ణంతో, అత్యుత్తమ మెడికల్ టెక్నాలజీతో రు.550 కోట్లతో ఎనిమిది అంతస్తుల భవనానికి తాము నిధులందిస్తున్నామన్నారు. 3వేలకు పైగా పేషంట్లుకు సేవలందించేలా 215పడకలుండే ఈ హాస్పటల్ తమ ఐసిఐసిఐఫౌండేషన్ ఫర్ ఇన్‌క్లూజివ్ గ్రోత్ పర్యవేక్షిస్తుందన్నారు.

## పేదల జీవనం మెరుగుకు ఉపాధి హామీ పనులు..

**– గ్రామ సభలో తెదేపా అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి వెల్లడి**

**ఎ కొండూరు, జూన్ 12, ప్రభాతవార్త :**
2024-25 ఆర్థిక సంవత్సరానికి ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ సామాజిక తనిఖీ గ్రామ సచివాలయం వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించడం, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక ఉపాధి లేక ఇబ్బందులు పడే పేద ప్రజల కోసం ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుందని కృష్ణారెడ్డి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులను ఈ సందర్భంగా బహిర్గతం చేశారు. అలాగే ఈ పనుల పారదర్శకపై ఎంఎన్‌ఆర్‌ఇజిఎస్ సంతృప్తి వ్యక్తం చేశారని కృష్ణారెడ్డి తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎపి ఎం. అనురాధ, గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎం.సీతయ్య సెక్రటరీ మరీదు నాగబాబు సచివాలయ సిబ్బంది సూరెడ్డి పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## నాగభైరవవారిపాలెంలో సీసీ రోడ్లు నిర్మాణంకు శంకుస్థాపన.

**పెదనందిపాడు జూన్ 12 (ప్రభాతవార్త). :** పెదనందిపాడు మండలంలోని నాగభైరవ వారి పాలెం లో జాతీయ ఉపాధి హామీ నిధులు పది లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్లు మరియు డ్రైన్ నిర్మాణముకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి లక్షీ మ్రదేవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి గ్రామాల అభివృద్ధికి చేయూతనివ్వటం శుభ సూచకమన్నారు.ఈ కార్యక్రమంలో ఏ ఈ పి ఆర్ రవికుమార్ .జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జంపని హనుమంతరావు. సర్పంచ్ దండా శివకుమారి. పార్టీ ప్రముఖులు యాగంటి బొల్లారావు. నువ్వుల ధనంజయరావు. సాంబశివరావు. కొల్లా రామారావు. సెక్రటరీ శ్రీనివాసు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెదనందిపాడు తహసిల్దార్ గా ఎస్. హేనా ప్రియ బాధ్యతలు స్వీకరణ.



**పెదనందిపాడు జూన్ 12 (ప్రభాతవార్త)** పెదనందిపాడు నూతన తహసిల్దార్ గా ఎస్.హేనా ప్రియ. పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు వారు గుంటూరు ఆర్డీవో ఆఫీస్ లో పనిచేసేవారు ప్రమోషన్ పై పెదనందిపాడు తహసీల్దారుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరిస్తామన్నారు. వారి వెంట డిప్యూటీ తహసిల్దార్ షేక్ కరిముల్లా. సీనియర్ అసిస్టెంట్ సాహితీ మోహన్. కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## న్యాయం కోసం పోరాటంలో బాధితులకు అండగా ఉంటాం

**అన్న దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్.**

**పెదనందిపాడు జూన్ 12. (ప్రభాతవార్త)** పెదనందిపాడులో త్రిబుల్ ఆర్ సంస్థ బారినపడి నష్టపోయిన బాధితులను గురువారం దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ పత్రికల వారితో మాట్లాడుతూ బాధితులు పెదనందిపాడు పోలీస్ స్టేషన్లోనూ. గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ లోనూ. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదులు చేసినప్పటికీ నామమాత్రపు సెక్షన్లతో కేసులు నమోదు చేసి కాలయాపనతో బాధితులను ఇబ్బందులకు గురి చేయడం విచారకరమన్నారు. ఈ నేపథ్యంలో బాధితులు ఈ విషయాన్ని ప్రజా దర్బార్ లో ఫిర్యాదు చేయగా ఎస్పీ సతీష్ కుమార్. త్రిబుల్ ఆర్ సంస్థ వారిని అదుపులోకి తీసుకొని వారి ఆస్తులు సీజ్ చేయమని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంతవరకు ఆ సంస్థ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ త్రిబుల్ ఆర్ సంస్థ బాధితులకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని వినయ్ కుమార్ తెలిపారు. త్వరలో అన్ని పార్టీల వారితో సమావేశం ఏర్పాటు చేసి ప్రణాళిక రూపొందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. గుంటూరు తో పాటు పెదనందిపాడు. కాకుమాను మండలాల కు చెందిన సుమారు 300 మంది బాధితులు వద్ద త్రిబుల్ ఆర్ సంస్థ వారు3.60 కోట్ల రూపాయలు సేకరించి అందులో కొంతమందికి 1.20. కోట్లు తిరిగి చెల్లించారని బాధితులు పేర్కొన్నారు. ఇంకా ఆ సంస్థ నుండి తమకు 2.40. కోట్లు తిరిగి రావాల్సి ఉందన్నారు. కొరివి వినయ్ కుమార్ ను కలిసిన వారిలో కొమ్మినేని నాగ గోపి. సిహెచ్ సతీష్. ఎస్.కె బారు సైదా. ఎన్ వి ఎస్ నాగేశ్వరరావు. ఎన్ లక్షీ మ్రదేవి. సిహెచ్ సుధాకర్. తదితరులు ఉన్నారు.

## హర్షిత్‌కు వేద పండితులు ఆశీర్వచనం



**సత్తెనపల్లి, జూన్ 12 ప్రభాతవార్త :**
అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్ పరీక్షలో 352వ ర్యాంక్ సాధించిన కురివెల్ల హర్షిత్‌కు అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఇటీవల జాతీయస్థాయి పరీక్షలో పట్టణానికి చెందిన హర్షిత్ ర్యాంక్ సాధించడం పట్ల ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో పాటు పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ హర్షిత్ రాణించాలని వేద పండితులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆకాంక్షించారు.

## సాయిబాబా ఆలయ అధ్యక్షులు రత్తయ్యకు సత్కారం



**సత్తెనపల్లి, జూన్ 12 ప్రభాతవార్త :**
పట్టణంలోని షిర్డిసాయిబాబా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చల్లా రత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఏపిపి నరసింహారావు ఆధ్వర్యంలో ఆయనకు సత్కారం చేశారు. ఆధ్యాత్మిక సేవా రంగాలలో వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దివ్వెల శ్రీనివాసరావు, దేవాలయ కార్యదర్శి సాంబిరెడ్డి, ఆలయ పెద్దలు ఏవివిఎస్ఆర్ ఆంజనేయులు, చిలకల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ చేపట్టిన ఆర్టీవో సురేష్‌బాబు



**పెదకూరపాడు, జూన్ 12 ప్రభాతవార్త :**
ఆర్టీవో సురేష్‌బాబు గురువారం మధ్యాహ్నం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆటో డ్రైవర్లకు ఓవర్ లోడ్ వలన జరిగే ప్రమాదాలను వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఓవర్ లోడ్‌తో వస్తున్న ఇసుక లారీలను ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఏఎస్ఐ రాంజీ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా వేడుకలు



**సత్తెనపల్లి, జూన్ 12 ప్రభాతవార్త :** పట్టణంలోని రఘురాంనగర్‌లో గల ప్రజావేదిక నందు గురువారం టిడిపి నాయకులు కేక్ కట్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ నాయకులు పాల్గొని మాట్లాడారు. వైకాపా పాలన మొత్తం అరాచకం అన్నారు. ఎన్నికల్లో ప్రజలు వై.ఎస్.జగన్‌కు బుద్ధి చెప్పారన్నారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు రావడంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. ఒక్క ఛాన్స్ అని వచ్చి గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని తెలియజేశారు.

## శ్రీవారి దేవస్థానంలో జ్యేష్ఠాభిషేకం

**సత్తెనపల్లి, జూన్ 12 ప్రభాతవార్త :**



పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఉన్న శ్రీవారి దేవస్థానంలో గురువారం జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారికి స్నపన, కురువేరు, తెల్లపట్టు, ఎండు ఫలాలు, ఒట్టివేరు, పసుపు రోజా మాలలతో శ్రీవారిని అలంకరించారు. ఆలయ అర్చకులు శ్యాము, రామానుజస్వామి స్లోక్లాలను పఠించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## వ్యవసాయ అధికారిగా బి. సుబ్బారెడ్డి

**సత్తెనపల్లి, జూన్ 12 ప్రభాతవార్త :**



సాధారణ బదిలీల్లో భాగంగా సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారిగా బి.సుబ్బారెడ్డి ఉద్యోగ బాధ్యతలను గురువారం స్వీకరించారు. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న ఎస్.శ్రీధర్‌రెడ్డి ముప్పాళ్ళ మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయంలో వ్యవసాయ అధికారిగా ఉన్న సుబ్బారెడ్డి సత్తెనపల్లికి వచ్చారు.

## కార్మికశాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం



**నరసరావుపేట, జూన్ 12 ప్రభాతవార్త :**
కార్మికశాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని గురువారం పట్టణంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కార్మికశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ యోగాంధ్ర – 2025 కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ప్రధాన వీధుల్లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, యువత ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో యోగా దోహదపడుతుందన్నారు. నిత్యం విధుల్లో ఒత్తిడికి లోనయ్యే సిబ్బందికి ఈ కార్యక్రమం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని అందించవచ్చని కార్మికశాఖ అధికారులు తెలిపారు.

## యోగానంద లక్ష్మినరసింహస్వామి దేవస్థానానికి విరాళం



**నరసరావుపేట, జూన్ 12 ప్రభాతవార్త :**
పట్టణంలోని కోట సెంటర్ పులుపులవారి వీధిలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మినరసింహస్వామి దేవస్థానం ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళం అందజేశారు. వివరాలను గురువారం కమిటీ సభ్యులు తెలియజేశారు. పట్టణానికి చెందిన చిలకల పూర్ణ, వెంకట మాధవరావులు రూ.1,00,116లను అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ సభ్యులు స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న భక్తులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అమలు

**బాపట్ల, జూన్12,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించి అనంతరం కేక్ ను కట్ చేసి సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో ఏడాది కాలంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. మహిళలలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కుట్టు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వెదుళ్లపల్లి బాధితుల పాఠశాల అభివృద్ధికి రూ 16 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పిఎమ్ కిసాన్ పథకం కింద రూ 3.15 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందించామన్నారు. 12.880 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించమని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నీ విభాగాలకు నిపుణులైన వైద్యులను నియమించామని అదేవిధంగా 300 పడకలకు ప్రతిపాదనలు పంపించామన్నారు. సూర్యలంక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు 97.52 లక్షలు మంజూరు చేశారని రెండు నెలలో పనులు ప్రారంభిస్తామన్నారు. 11 ప్రాంతాలకు బస్సులు అడగడం జరిగింది త్వరలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 1,50,000 టన్నులు ధాన్యం సేకరించామన్నారు. పంచాయితీ రోడ్లు వేశామని నిరుద్యోగులకు డిఎస్సి విడుదల చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా ల్యాండ్ టైటిల్ రద్దు చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా 12కోట్లు వెచ్చించి రోడ్ల మరమ్మతులు చేశామన్నారు. రైతుల వద్ద ధాన్యం సేకరించిన 48 గంటలలో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్నీ నియోజక వర్గాలలో అభివృద్ధి చేయడమే చంద్రబాబు నాయుడు ఉద్దేశం అన్నారు. కూటమి ప్రభుత్వం 150కార్యక్రమాలను చేపట్టడంతోపాటు వైసీపీ రద్దు చేసిన 15 రకాల పథకాలను అమలుచేస్తున్నామని గుర్తు చేశారు. మంచి మంత్రివర్గం ఉందనీ, నిజాయితీకి నిలువెత్తున కష్టపడే నాయకుడు చంద్రబాబు మనకు అండగా ఉన్నారన్నారు. ప్రతి ఎమ్మెల్యేకి నియోజకవర్గంలో ఒక కార్యాలయం నిర్మాణం జరుగుతుందన్నారు. దోమల బెడద నుండి రక్షించేవరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం జరిగిందన్నారు. మెడికల్ కళాశాల పెట్టడమే కాదని ప్రవేట్ పబ్లిక్ భాగస్వామ్యంతో నిర్మించడం జరుగుతుందన్నారు బాపట్ల మెడికల్ కళాశాల సెకండ్ ఫేజ్ లో ఉందని మూడవ ఫేజ్ లో ఉన్నదానిని రెండవ ఫేజ్ కి మార్చడం జరిగిందన్నారు. టీడీపీ లో ప్రారంభించిన పథకాలను వైసీపీ ప్రభుత్వం అమలు చేయకుండా నిర్వీర్యం చేశారని వారికి లాగ కాకుండా కూటమి ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎం శివ, పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మండపాటి ఆంథ్రేయ, మున్సిపల్ మాజీ చైర్మన్ జిట్టా ప్రమీల రాణి. మాజీ ఎంపీపీ మానం విజేత, పల్లం సరోజినీ మాజీ ఎంపీటీసీ భూషణ కుమారి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సకాలంలో బాపట్ల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు సంక్షేమ పథకాల వివరములు 1. యన్.టి.ఆర్. భరోసా పింఛను పథకం: బాపట్ల నియోజకవర్గంలో ఉన్నటువంటి మొత్తం 30,498 పింఛను దారులకు ప్రతినెలా 13కోట్ల 28వేల 500లు అందించడం జరుగుతుంది. ఇది కూటమి ప్రభుత్వం అర్హులైన లబ్దిదారులకు ఆసరాగా అందిస్తున్నటువంటి అద్భుతమైన పథకం. బాపట్ల మండలంలో లబ్దిదారులు 10,341 పంపిణీచేస్తున్న నగదు రూ.4కోట్ల 40లక్షల 21వేలు. బాపట్ల మున్సిపాలిటీలో లబ్దిదారులు 6,402 పంపిణీచేస్తున్న నగదు రూ.2కోట్ల 79లక్షల 61వేల 500. కర్లపాలెం మండలంలో లబ్దిదారులు 7859 పంపిణీచేస్తున్న నగదు రూ.3కోట్ల 36లక్షల 29వేల 500. పిట్టలవానిపాలెం మండలంలో లబ్దిదారులు 5887 పంపిణీచేస్తున్న నగదు రూ.2కోట్ల 44లక్షల 16వేల 500. 2. నిరుపేదల ఆకలి తీర్చడానికి బాపట్ల పట్టణంలో అన్నాక్యాంటీన్ ఏర్పాటుచేయడం జరిగింది. 3. సి.ఎం.ఆర్.ఎఫ్: సీఎం సహాయనిధి ద్వారా ఇప్పటి వరకు బాపట్ల నియోజకవర్గంలో 254 మంది అర్హులైన లబ్దిదారులకు రూ.2కోట్ల 45 లక్షల 54వేల 150లు వైద్య ఖర్చులనిమిత్తం అందజేయడం జరిగింది. 4. దీపం పథకం 2.0 : దీపం పథకం 2.0 కింద బాపట్ల నియోజకవర్గంలో 47,739 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి రూ.872ల చొప్పున మొదటి ఇన్ స్టాల్ మెంట్ అనగా డిసెంబరు 2024మార్చి 2025 వరకు మొత్తం రూ.4కోట్ల 16లక్ష ల28వేల 408లు లబ్దిదారుల ఖాతాల్లో జమచేయడం జరిగింది. దీపం 2.0 పథకం కింద బాపట్ల నియోజకవర్గంలో సంవత్సరానికి రూ. 12కోట్ల 48లక్షల 85వేల 224లు లబ్దిదారుల ఖాతాల్లో జమచేయడం జరుగుతుంది. 5. మత్స్యకారులు వేట నిషేధ భృతి: బాపట్ల నియోజకవర్గంలో ఈ సంవత్సరం వేట నిషేధకాలం అనగా ఏప్రిల్ 15 నుండి జూన్ 14వరకు 1441 మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.20వేలు చొప్పున మొత్తం రూ.2కోట్ల 88లక్షలు పంపిణీచేయడం జరిగింది. 6. బీసీ కార్పొరేషన్ : బాపట్ల నియోజకవర్గంలో ఓబీయంయంయస్ పథకం కింద 37మంది లబ్దిదారులను గుర్తించి రూ.74లక్షలు బ్యాంకు రుణాలు మంజూరుచేయడం జరిగింది. వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు మరియు కాపు కులానికి సంబంధించి 579మంది మహిళలకు కుట్టుమిషన్లకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. వీరికి రూ. 1కోటి44లక్షల75వేల విలువ కలిగిన కుట్టుమిషన్లను ఆగస్టు 15న అందజేయడం జరుగుతుంది. 7. వెదుళ్లపల్లి గ్రామంలోని చెవిటిమూగ కళాశాలలోని విద్యార్థినుల వసతిగృహాల మరామత్తులకు సంబంధించి రూ.16లక్షలు కేటాయించడం జరిగింది. 8. వ్యవసాయ శాఖ: 1) బాపట్ల నియోజకవర్గంలో పి.యం. కిసాన్ సహాయక పథకం కింద 15,870 లబ్దిదారులకు 19వ వాయిదా కింద ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున మొత్తం రూ.3కోట్ల 17లక్షలు రైతుల ఖాతాల్లో జమచేయడం జరిగింది. 2) బాపట్ల నియోజకవర్గంలో గత ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలమూలంగా పంటలు నష్టపోయిన 12,880 మంది రైతులకు రూ.4కోట్ల 35 లక్షలు ఇన్పుట్ సబ్సీడీ కింద రైతుల ఖాతాలో జమచేయడం జరిగింది. 3) రైతులకు వ్యవసాయ పనిముట్లు కొనుగోలుకు సంబంధించి 50శాతం సబ్సీడీ పథకం కింద 144 మంది రైతులకు రూ.23లక్షలు రైతుల ఖాతాల్లో సబ్సీడీ జమచేయడం జరిగింది. 9. ప్రభుత్వ ఏరియా వైద్యశాల: 1) గత ప్రభుత్వం ప్రజలకు అందించాల్సినటువంటి వైద్యంలో నిర్లక్ష్యం వహించగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బాపట్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని విభాగాలకు సంబంధించిన నిపుణులైన వైద్యులను నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుంది. 2) ప్రస్తుతం ఉన్న 100 పడకల ఆస్పత్రి నుంచి 300 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. 10. టూరిజం : బాపట్లలోని సూర్యలంక మరియు ఇతర బీచ్ల అభివృద్ధికి రూ.97.52 కోట్లు కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరుచేయించడం జరిగింది. 11. ఏపి . ఐ . ఐ . సి . కొండుభొట్లవారిపాలెం గ్రామం నందు ఏపి.ఐ.ఐ.సి. వారి ద్వారా గొడౌన్ల నిర్మాణానికి రూ.12కోట్ల నిదులు కేటాయించి శంఖుస్థాపన చేయడం జరిగింది. 12. అడవిపల్లెపాలెం గ్రామం నందు మత్స్యకారుల కోసం జెట్టి నిర్మాణం కొరకు రూ.1.2 కోట్ల నిధులు మంజూరుచేయడం జరిగింది. 13. బాపట్ల నియోజకవర్గ ప్రజల అవసరార్థం 11 కొత్త బస్సుల మంజూరుకు ప్రతిపాదనలు పంపగా 2 కొత్త బస్సులు మంజూరుచేయడం జరిగింది. మిగిలిన బస్సులు జులై నెలాఖరులోపు మంజూరుచేయడం జరుగుతుంది. 14. బాపట్ల నియోజకవర్గంలో రైతుల వద్ద నుండి 15993 మెట్రిక్ టన్నుల ధాన్య సేకరణ జరిగింది. అభివృద్ధి కార్యక్రమాలు: రహదారులు మరియు భవనాల శాఖ: 1) గత ప్రభుత్వం రహదారుల నిర్వహణ విషయంలో పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం వహించిన విషయం మనందరికి తెలిసిందే. దాని వలన అనేకమంది ప్రమాదాల బారిన పడటం జరిగింది. 2) కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రహదారులు పునర్నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహించడం జరిగింది. బాపట్ల నియోజకవర్గంలో 87కి మీ రహదారులను రూ.5 కోట్లతో మరమత్తులు చేయడం జరిగింది. 3) జిల్లా కలెక్టర్ వారి కార్యాలయ ప్రాంగణంలో నూతన రోడ్లు నిర్మించడం జరిగింది. 4) బాపట్ల పాండురంగాపురం రోడ్డు నిర్మాణం కొరకు రూ.13కోట్ల 70లక్షల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. 5) వెదుళ్లపల్లి కావూరివారిపాలెం రోడ్డులోని కుందేరువాగు పై గల శిధిలావస్థలో ఉన్న బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణం కొరకు రూ.4కోట్ల 77 లక్షల నిధుల మంజూరుకు పంచాయితిరాజ్ శాఖ: 1) బాపట్ల నియోజకవర్గంలో పంచాయితిరాజ్ ఇంజినీరింగ్ శాఖా ఆధ్వర్యంలో 100శాతం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 86 సీసీ రోడ్లను రూ.9కోట్ల 32లక్షలతో నిర్మించడం జరుగుతుంది. వీటిలో 66 రోడ్లు పూర్తిచేయడం జరిగింది. మిగిలినవి కూడా అతి తొందరలో పూర్తిచేయడం జరుగుతుంది. 2) బాపట్ల మండలం అడవిపల్లెపాలెం గ్రామంలో ఈపురుపాలెం (ఓ్యు్యు ద్దు ద్దు్యు) డ్రైన్ మీద వంతెన నిర్మాణానికి రూ.8కోట్ల నిధులతో శంఖుస్థాపనచేయడం. 3) బాపట్ల నియోజకవర్గంలో పంచాయితిరాజ్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నాబార్డు పథకం కింద రూ.2 కోట్ల 60లక్షలతో బీటీ రోడ్లు నిర్మించడానికి చర్యలు తీసుకోవడం జరిగింది. 4) బాపట్ల నియోజకవర్గంలో నల్లమడ డ్రెయిన్ మీద రూ.14కోట్ల 10లక్షలతో హైలెవల్ బ్రిడ్జి నిర్మించుటకు శంఖుస్థాపన చేయడం జరిగింది. 5) బాపట్ల నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెం మండలంలో తుంగభద్ర డ్రెయిన్ మీద రూ.9కోట్ల 13లక్షలతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంఖుస్థాపన చేయడం 6) బాపట్ల నియోజకవర్గ పరిధిలో గొర్రెలు, గేదెలు, కోళ్ళ షెడ్లు నిర్మాణం కొరకు రూ.2.28 కోట్ల నిధులు మంజూరుచేయడం జరిగింది. డ్రైనేజ్ మరియు నీటిపారుదల శాఖ: 1) బాపట్ల నియోజకవర్గంలో రూ.7కోట్ల నిధులతో 161 ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ పనులు చేయడం జరుగుతుంది. 2) బాపట్ల నియోజకవర్గంలో నల్లమడ డ్రెయిన్ ఆధునీకరణ కొరకు రూ.310కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగింది. గ్రామీణ నీటి పారుదల శాఖ : 1) బాపట్ల నియోజకవర్గంలో 6187 ఇంటింటికి సురక్షిత త్రాగునీటి కుళాయి కనెక్షన్ పథకం కింద రూ.22కోట్ల నిధులతో పూర్తిచేయడం జరుగుతుంది. 2) బాపట్ల నియోజకవర్గంలో సామూహిక మరుగుదొడ్ల పథకం కింద రూ. 1కోటి 71లక్షలతో 57 యూనిట్లను 3 నెలల్లో నిర్మించడం జరుగుతుంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ : 1) బాపట్ల పట్టణంలోని తూర్పుసత్రం నందు పురాణ కాలక్షేపం మండపం నిర్మాణం కొరకు కోటిరూపాయల నిధులు మంజూరుచేయడం జరిగింది. 2) బాపట్ల పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత క్షీరభావన్నారాయణస్వామి వారి దివ్య రథాన్ని నిర్మించడానికి గతంలో కేటాయించిన రూ. 1కోటికి అదనంగా మరో 50లక్షలు మంజూరుచేయించి మొత్తము రూ.1కోటి 50లక్షలతో రథాన్ని పూర్తిచేయడం జరిగింది. 3) బాపట్ల పట్టణంలో రూ.1కోటి 10లక్షలతో శివాలయ పునర్నిర్మాణ పనులు జరుగుచున్నవి. 4) బాపట్ల పట్టణంలో కోటి రూపాయలతో సుందరవల్లి సమేత ప్రసన్న ఆంజనేయ స్వామివారి దేవాలయ పునర్నిర్మాణ పనులు జరుగుచున్నవి. 5) పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో రూ. 1కోటి 4లక్షలతో లింగోద్భవస్వామి వారి దేవస్థానంలో పురాణ కాలక్షేపం మండపం మరియు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం జరిగింది. 6) చందోలు గ్రామంలో లింగోద్భవ స్వామివారి దేవస్థానంలో రూ.70లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నవి. 7) చందోలు గ్రామంలోని చెన్నకేశవస్వామివారి దేవస్థానములో రూ. 40లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నవి. బాపట్ల మున్సిపాలిటి : 1) బాపట్ల మున్సిపాలిటీలో రూ. 45లక్షలతో సెంట్రల్ డివైడర్ సుందరీకరణ పనులు చేపట్టడం జరిగింది. 2) బాపట్ల మున్సిపల్ పరిధిలో రూ.25లక్షలతో 5 పార్కులు సుందరీకరణ పనులు చేపట్టడం జరిగింది. 4) బాపట్ల మున్సిపాలిటీలో రూ. 5 కోట్ల నిధులతో మురుగునీటి శుద్ధీకరణ ప్లాంటు ఏర్పాటుచేయడం జరుగుతున్నది. 5) బాపట్ల మున్సిపాలిటీలో ఉన్న డంపింగ్యార్డును రూ.3కోట్ల 20లక్షల నిధులతో శుభ్రపరచి నూతనంగా ఒక సుందరమైన పార్కును ఏర్పాటుచేయుటకు చర్యలు చేపట్టడం జరిగింది. 6) బాపట్ల మున్సిపల్ హైస్కూలు నందు రూ. 1కోటి 40లక్షలతో నూతన భవన నిర్మాణ పనులు జూన్ నెలాఖరుకు పూర్తిచేయడం జరుగును.




## వెల్దుర్తిలో తెలుగు తమ్ముళ్ల విజయోత్సవ ర్యాలీ

**మాచర్ల, జూన్ 12 ప్రభాతవార్త:** వెల్దుర్తి మండల కూటమి నేతలు కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మాచర్ల నియోజకవర్గంలో సాధించిన ప్రగతిని గుర్తు చేసుకుంటూ విజయోత్సవ సంబరాలను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా భారీ కేక్ కట్ చేసి, పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ వరకు సాగిన ర్యాలీ అనంతరం అక్కడే మహిళల సమక్షంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా భారీ కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం విజయోత్సవాలను గుర్తు చేసుకుంటూ కూటమి పెద్దలకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, వజ్రనాయక్, వెల్దుర్తి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

**మాచర్ల, జూన్ 12 ప్రభాతవార్త:**

విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా మాచర్లలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాచర్లకు చెందిన ఓర్సు నీలం రాజు (44) పట్టణంలోని నెహ్రూనగర్ వీవీఎన్ గార్డెన్స్‌లో డెకరేషన్ పనులు చేస్తూ ఉంటాడు. అయితే గురువారం మండపానికి సమీపంలో ఉన్న విద్యుత్తు డెకరేషన్ సామగ్రిని మినీ లారీలో లోడ్ చేసుకుని కల్యాణ మండపానికి వస్తుండగా ప్రమాదవశాత్తు లారీపై ఉన్న విద్యుత్తు తీగలకు ఇనుప గొట్టాలు 11కేవీ లైన్‌కు తగిలాయి. దీంతో లారీలో ఉన్న ముగ్గురు కార్మికులలో ఇద్దరిని బయటకు లాగగా, అప్పటికే సమయం మించడంతో మూడో వ్యక్తి నీలంరాజు ప్రాణాలు విడిచాడు. మృతుడు నీలంరాజుకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

## విధ్వంసం నుంచి వికాసం వైపు పరుగులు : ఎమ్మెల్యే జూలకంటి

**మాచర్ల, జూన్ 12 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పరుగులు పెడుతుందని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా సంవత్సర కాలంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తు చేసుకుంటూ అంబేద్కర్ సెంటర్లో తెదేపా ఆధ్వర్యంలో భారీ కేకు కట్ చేసి, తెదేపా శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దాదాపు ఏడాది కాలంలో 1583 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అలాగే 241 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి వైపు పయనిస్తుంటే సైకో జగన్‌రెడ్డి విషప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా, చంద్రబాబు నేతృత్వంలో అమరావతి, పోలవరం, నదుల అనుసంధానం, నూతన పరిశ్రమల స్థాపన, విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటివి మరెన్నో అభివృద్ధి ప నులు శరవేగంగా ముందుకు సాగుతాయని ఆయన పేర్కొన్నారు.

## మాచర్ల రోటరీక్లబ్ సేవలు ఎనలేనివి

**మాచర్ల, జూన్ 12 ప్రభాతవార్త:** మాచర్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పీడబ్ల్యూడీ కాలనీ, గొర్రెల మండిలో నివాసం ఉంటూ, అంగవైకల్యంతో ఇబ్బంది పడుతూ, కనీసం తమ గృహంలో సొంత కార్యక్రమాలు కూడా చేసుకోలేని ఇద్దరు వ్యక్తులను గుర్తించి వీల్‌చైర్స్ అందజేశారు. రోటరీ డిప్యూటీ గవర్నర్ కొండవీడి రామకోటయ్య, రోటరీ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖలు మాట్లాడుతూ అంగవైకల్యంతో బాధపడున్న ఇలాంటి వారి వివరాలను తెలియజేస్తే రోటరీక్లబ్ ద్వారా మరిన్ని సేవలు అందించడానికి ఎప్పుడూ ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఇక్కుర్తి శంకర్, పఠాన్ నాగూర్‌వలి, అబ్దుల్‌కలాం సేవా సమితి అధ్యక్షులు పాషావలి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి కూటమితోనే సాధ్యం:

**: మాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్**

**విజయపురిసౌత్, జూన్ 12 ప్రభాతవార్త:** రాష్ట్ర అభివృద్ధి కూటమి తోనే సాధ్యమని మాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామియాదవ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయపురిసౌత్‌లోని అంబేద్కర్ సెంటర్లో కేక్ కట్ చేశారు. వీరాస్వామి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయపురిసౌత్ తెదేపా అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఆడెపు కోటయ్య, బొబ్బిలి చంద్రశేఖర్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, కట్టా రాజు, పురాణం శ్రీను, బాషా తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ డీఈగా ఆదం షఫి

**పిడుగురాళ్ల, జూన్ 12 ప్రభాతవార్త:** పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయ డీఈగా షేక్ ఆదం షఫి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆదం షఫి మార్కాపురం నుంచి బదిలీపై పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ డీఈగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు మార్కాపురంకు బదిలీపై వెళ్లారు. షఫి గతంలో పిడుగురాళ్ల మున్సిపల్ ఏఈగా విధులు నిర్వహించారు. పురప్రజలకు సుపరిచితుడు కావడంతో మున్సిపాలిటీ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానన్నారు.

## కూటమి నేతలు సంబరాలు

**పిడుగురాళ్ల, జూన్ 12 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి యేడాది కాలం పూర్తవడంతో పట్టణంలోని టీడీపీ కార్యాలయలో కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పిలుపుమేరకు కూటమి నేతలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబంలో ఎంత మంది చదువుకునే పిల్లలు ఉన్నా తల్లికి వందనం పథకం వర్తిస్తుందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం – 2 పథకాలు అమలు చేసి ప్రజల మన్ననలు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

## ఏవోగా సంధ్యారాణి

**పిడుగురాళ్ల, జూన్ 12 ప్రభాతవార్త:** పిడుగురాళ్ల ఏవోగా ఎం సంధ్యారాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా గురజాల నుంచి పిడుగురాళ్లకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన నందిపాటి శ్రీనివాసరావు కొల్లిపర మండలం తెనాలి డివిజన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఏవో సంధ్యారాణి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు అందిస్తానన్నారు. నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, రైతులకు అందుబాటులో ఉంచేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

## చిరు వ్యాపారాలకు తోపుడు బండ్లు అందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

**చిలకలూరిపేట, జూన్12, ప్రభాతవార్త:** ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ అసిస్ట్ సంస్థ, హైదరాబాద్ ఎకోరింగ్ కంపెనీ సహకారంతో పంగులూరు మండలం ముప్పవరం గ్రామంలో 16మంది చిరువ్యాపారులకు ఒక్కొక్కటి రూ 15వేలు విలువచేసే తోపుడు బండ్లను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ చిరువ్యాపారులు జీవనోపాదికి తోడ్పడాలనే లక్ష్యంతో ఈ తోపుడు బండ్లను అసిస్ట్ సహకారంతో అందచేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మరింత మంది లబ్దిదారులకు చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరక్టర్ జాష్టి కృష్ణ హరీష్, స్థానిక నాయకులు, మేలుకొలుపు బృందం పాల్గొన్నారు. తమ జీవనోపాధికి ఉచితంగా తోపుడు బండ్లు అందించడంతో చిరు వ్యాపారుల ముఖాలలో ఆనందం వెల్లివిరిసింది.

## జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు చైతన్య లిటిల్స్ విద్యార్థులు ఎంపిక

**చిలకలూరిపేట, జూన్12, ప్రభాతవార్త:** పట్టణంలోని గాంధీపేటలో ఉన్న చైతన్యలిటిల్స్ విద్యార్థులు ఈనెల 9 నుంచి 11వ తేదీవరకు అనంతరపురం తాడిపత్రిలో న్యూఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొన్నారు. చైతన్యలిటిల్స్‌కు చెందిన 14మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొని 6 వెండిపతకాలు, 4 కాంస్యపతకాలు సాధించారు. 6 వెండి పతకాలు సాధించిన చైతన్య లిటిల్స్ విద్యార్థులు త్వరలో జరగబోయే జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొననున్నారు. దీనిని పురస్కరించుకొని గురువారం పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ఆ విద్యార్థులను పాఠశాల డైరక్టర్ ఈదర వెంకటగిరీష్‌బాబు, ప్రిన్సిపల్ బివి లక్ష్మి, కోచ్ ఎస్ అనురాధయ్యలను అభినందించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి పోటీలలో పాల్గొనడం వలన సెల్ఫ్‌డిఫెన్స్‌తో పాటు స్పోర్టివ్ స్పిరిట్ ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు ఆత్మరక్షణ విద్యలలో కూడా నైపుణ్యం సాధించడం అవసరమని తెలియచేశారు.

## టీడీపీ నేతలు సంబరాలు

**గురజాల, జూన్ 12 ప్రభాతవార్త:**

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి యేడాది కాలం పూర్తయిన సందర్భగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. కేకులు కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైకో పాలన నుంచి విముక్తి చెంది ప్రజలకు రామరాజ్యం వచ్చి ఏడాదైందని, ఏడాది కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్ రద్దు చేస్తే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అన్నా క్యాంటీన్ పున: ప్రారంభించారన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ పంపిణీ, తల్లికి వందనంకు శ్రీకారం చుట్టారన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం వైపు బాటలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ అడపా శ్రీనివాసరావు, పదో వార్డు కౌన్సిలర్ బొల్లయ్య, నవులూరి శ్రీరామ్మూర్తి, శరమాల హనుమంతురావు, షేక్ నజీమూన్, ఆకుల పిచ్చయ్య గుప్త, పెరుమాళ్ల ప్రభాకరరావు, చీతిరాళ్ల సుబ్బారావు, జక్కా దుర్గారావు, నాగేంద్రబాబు, కనకం శివ తదితరులు పాల్గొన్నారు.

## కదం తొక్కిన తెలుగు తమ్ముళ్లు!


**– అట్టహాసంగా విజయోత్సవ సంబరాలు**



**కారంపూడి, జూన్ 12 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు తొలి అడుగు పడి నేటికి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా కారంపూడిలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి మండలం అభివృద్ధి పథంలో సాగుతుందని, రోడ్డు భవనాల శాఖ ద్వారా మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లన్నీ సుమారు అయిదు కోట్లతో రోడ్లన్నీ పూర్తి చేశారు. కాలువల పూడికతీతకు రూ.నాలుగు కోట్లు వెచ్చించారు. ఇరవై లక్షలు వెచ్చించి 140 మంది మహిళలకు స్వయం ఉపాధి చేకూర్చే విధంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ప్రజలదాహార్తి తీర్చడానికి బోర్లకు 12 లక్షలు వెచ్చించారు. వంట గ్యాస్ లేని 2100 కుటుంబాలకు ఉచితంగా నూతన కనెక్షన్లు ఇచ్చారన్నారు. తెదేపా నాయకులు సైదారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని ఉచితంగా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి అమ్మఒడి వర్తింపజేసి, గత పాలకులు అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని నెడితే సమన్వయంతో సంక్షేమాన్ని అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. ఉప ఎంపీపీ గాడిపత్రి రమాదేవి పూర్ణయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం రాజధాని లేని రాష్ట్రంగా చేసి పెట్టుబడులను రానివ్వకుండా అడ్డుకుంటే, కూటమి ప్రభుత్వం ప్రపంచంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని అహర్నిశలు శ్రమిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చప్పిడి రాము, బొల్లినేడి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు బొమ్మిన శేషగిరిరావు, కారంపూడి సర్పంచ్ సరస్వతిబాలునాయక్, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ, కాటంరెడ్డి నాగలక్ష్మి రెడ్డి, బాల వెంకటేశ్వర్లు, చప్పిడి రాము, ఉన్నం లక్ష్మీనారాయణ, పాలెపోగు బాబు, కాల్వ పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించండి మహాప్రభో!

**– రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము**



**కారంపూడి, జూన్ 12 ప్రభాతవార్త:** పల్నాడు జిల్లాలో ఉన్న అన్ని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను వెంటనే రిపేర్లు చేయించి రైతులకు సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము అన్నారు. పల్నాడు జిల్లాలో 155 లిఫ్టు ఇరిగేషన్ పథకాలు ఉన్నాయి. గత అయిదేళ్లుగా ఈ లిఫ్టు ఇరిగేషన్లు పట్టించుకునే నాథుడే లేడన్నారు. కొన్ని మరమ్మతులకు గురై, కొన్ని వరదల్లో కొట్టుకుపోయాయన్నారు. ఈ ఇరిగేషన్ల కింద లక్షలాది ఎకరాల ఆయకట్టు ఉ ందన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా సమితి ఆధ్వర్యంలో రైతులతో కలిసి అప్పటి కలెక్టర్లకు ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చినా ఏమాత్రం కూడా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుల పట్ల పెద్దమనసు చేసుకొని వెంటనే పల్నాడు జిల్లాలో ఉన్న ఎత్తిపోతల పథకాలను బాగు చేయించి రైతులకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## తోటమ్మతల్లి దేవాలయం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

**– రూ.1.50లక్షలు హుండీ ఆదాయం**

**– కార్యనిర్వహణాధికారి ఎన్‌వీఎన్ మల్లేశ్వరి**

**పొన్నూరు, జూన్ 12, ప్రభాతవార్త:** పట్టణంలో వేంచేసియున్న శ్రీ తోటమ్మతల్లి దేవాలయం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కార్యనిర్వహణాధికారి ఎన్‌వీఎన్ మల్లేశ్వరి కోరారు. స్థానిక దేవాలయంలో గురువారం భక్తులు అమ్మవారికి సమర్పించిన కానులకను లెక్కించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మల్లేశ్వరి మాట్లాడుతూ దేవాదాయశాఖతో పాటు దాతలు కూడా ముందుకు వచ్చినప్పుడే దేవాలయాలు మనుగడ సాగించగలుగుతాయన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు దాతలు ముందుకు వస్తే వారిని స్వాగతిస్తామన్నారు. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.1,50,815ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమాన్ని బాపట్ల దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ గోపి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ గోపిశెట్టి వెంకటేశ్వరరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు

**– అర్బన్ సిఐ లావూరి వీరా నాయక్**

పొన్నూరు, జూన్ 12, ప్రభాతవార్త: పేద ప్రజలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గం పట్టిస్తే చూస్తూ ఊరకోబోమని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ హెచ్చరించారు. పట్టణంలోని 29వ వార్డులో ఓ ఇంట్లో రేషన్ బియ్యం ఉన్నట్లు స్థానికంగా ఉన్నటువంటి వారు సమాచారం ఇవ్వడంతో అర్బన్ పోలీసులు సదరు ఇంటిపై దాడి చేశారు. దీంతో అక్కడ పెద్ద ఎత్తున బియ్యం మూటలు ఉండడాన్ని గుర్తించారు. 29వ వార్డుకు చెందిన ఓ వ్యక్తి కార్డు దారుల వద్ద నుంచి బియ్యాన్ని చాలా చౌకగా కొనుగోలు చేసి వేరే ప్రాంతానికి తరలిస్తున్నట్లు తెలిసింది. కార్డుదారుల వద్ద ఉన్న బియ్యాన్ని కారు చౌకగా కొని అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సందర్భంగా సిఐ వీరానాయక్ మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ చేయడం, ఆ తర్వాత రహస్యంగా వేరే ప్రాంతాలకు తరలించడం అనేవి చట్ట వ్యతిరేకమైన చర్యలని చెప్పారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల నిఘా ఉందన్నారు. ఎక్కడైనా అర్బన్ ప్రాంతంలో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు స్థానికులు గుర్తిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సుమారు 60బస్తాల రేషన్ ఉన్నట్లు తెలిసింది.

## జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్షా సమావేశం

**గురజాల, జూన్ 12 ప్రభాతవార్త:** మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ప్రియదర్శిని అధ్యక్షతన గురువారం న్యాయవాదులు, పోలీసులకు జూలై 5వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని, పోలీసు అధికారులు సదరు కేసులలో కక్షిదారులకు ఈ అవకాశం సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించి రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించాలని సూచించారు. దీని ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య, కోట శ్రీనివాసరావు, పీపీ సూరిరాజు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**న్యాయ అవగాహన సదస్సు:** బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన కిరణా దుకాణాల యజమానులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రియదర్శిని మాట్లాడుతూ చాలా మంది పిల్లలు ఇప్పటికి కూడా బాల కార్మికులకు టీషాపులలో, దుకాణాల్లో పని చేయడం దారుణమన్నారు. 18 యేళ్లలోపు పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రం ఆధార్‌కార్డు సృష్టించడానికి రాష్ట్ర న్యాయ సేవ ఆథారిటీ ఆధ్వర్యాన సర్వే నిర్వహించబడుతుందన్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటా శ్రీనివాసరావు, మందపాటి శ్రీనివాసరెడ్డి, షేక్ జానీబాషా, జక్కా చెన్నకేశవరావు, ఎం ప్రసాదరావు, కత్తి చలమరాజు, కర్రా చిన కోటేశ్వరరావు, చాగంటి సురేష్, వై నరసింహారెడ్డి, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

# కళానిలయం అధ్యక్షులు ప్రగడ రాజమోహన్ కన్నుమూత



**చిలకలూరిపేట, జూన్12, ప్రభాతవార్త:** చిలకలూరిపేటలో నాలుగు దశాబ్దాలుగా జాతీయస్థాయిలో నవరస శాస్త్రీయ, జానపద, సంగీత నాట్య కళారూపాల పోటీలు నిర్వహిస్తూ నృత్యవిభాగంలో చిలకలూరిపేట పేరు ప్రఖ్యాతులు దశదిశలా వ్యాపింపచేసిన పిఆర్ మోహన్ అనే ప్రగడ రాజమోహన్ (84) గురువారం ఉదయం చిలకలూరిపేటలో ఆయన నివసిస్తున్న వసతిగృహంలో కన్నుమూశారు. కళానిలయం పేరుతో జాతీయ స్థాయిలో నాట్యకళారూపాలు ప్రదర్శిస్తున్న పిఆర్ మోహన్ గత నెలలో చివరిసారిగా మే24,25,26 తేదీలలో పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో అత్యంత శ్రమతో 40వ కళానిలయం పోటీలను నిర్వహించారు. ఆ పోటీల సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి పోటీలు ఇదేనంటూ ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన ఆ పోటీలను తన సతీమణి చేతనే నటరాజపూజ చేయించిన పిఆర్ మోహన్ ఈ రోజు నటరాజులో ఐక్యం అయ్యారు. ఆయనకు ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమారుడు అందుబాటులో లేకపోయినా సుబ్బయ్యతోటలో ఉన్నది వసతిగృహం కావడం, మిత్రులు, సన్నిహితులు, కుటుంబసభ్యుల సహకారంతో గురువారమే పిఆర్ అంత్యక్రియలు ఏర్పాటు చేసినట్లు ఆయన మిత్రబృందం నాయుడు శివ, గంజి పోలయ్య, పొట్టి రత్నబాబులు తెలిపారు. 1941లో జన్మించిన పిఆర్ మోహన్ చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఎస్‌యం భాషా గారి ప్రోత్సాహంతో కళారంగా ప్రవేశం చేసి చైర్మన్, చిల్లరకొట్టు చిట్టెమ్మ, శిక్షార్హులు, రాణి సంయుక్త, జైజవాన్ లాంటి నాటికలలో నటించారు. జాతీయస్థాయిలో 25కు పైగా వ్యక్తిగత పురస్కారాలను ప్రగడ రాజమోహన్ అందుకున్నారు. తన చేతులమీదుగా కళానిలయం ద్వారా ఉభయ తెలుగురాష్ట్రాలలోని శాస్త్రీయ. జానపద, సంగీత కళాకారులు 160మందికి పురస్కారాలను అందచేశారు. వారిలో నృత్య దర్శకులు సంపత్, ఉమాసంపత్, కె విశ్వనాధ్, నేరెళ్ల వేణుమాధవ్, డాక్టర్ ఎస్‌పి బాల సుబ్రహ్మణ్యం, సినీనటి శారద లాంటి మహనుభావులు ఎందరో ఉన్నారు. తన సంస్థ పేరు కళానిలయం కానీ తనకు స్వంత నిలయం లేకోపోవటం విచారకరమని మిత్రులు వ్యక్తం చేశారు.

# గొలుసుదొంగను చాకచక్యంగా పట్టుకున్న మాచర్ల పోలీసులు



**- 128 గ్రాముల బంగారం స్వాధీనం**

**మాచర్ల, జూన్ 12 ప్రభాతవార్త:** పలువురు మహిళల మెడలో గొలుసులను లాక్కెళ్లిన దొంగను అరెస్టు చేసి, అతనివద్ద నుంచి 128 గ్రాముల బంగారపు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు గురజాల డీఎస్పీ జగదీష్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక రైల్వేస్టేషన్ వీధిలలోని ఒక గృహంలో ఒంటరిగా ఉన్న మహిల మెడలో గొలుసును గురజాలకు చెందిన షేక్ జానీ లాక్కుని పారిపోయాడు. సీసీ కెమెరాలో నిందితుడు జానీని గుర్తించి స్థానిక అంబేద్కర్ సెంటర్లో అరెస్టు చేసినట్లు వివరించారు. అపహరించిన బంగారం విలువ 10 లక్షల 24000 ఉంటుందని పేర్కొన్నారు. నిందితుడు జానీని విచారించగా 13వ వార్డు, పాతూరులో కూడా మహిళల మెడలో గొలుసులను లాక్కెళ్లినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు జానీని అరెస్టు చేసి బంగారపు వస్తువులను రికవరీ చేయడంలో చాకచక్యం ప్రదర్శించిన పట్టణ సీఐ ప్రభాకరరావు, ఎస్సైలు సంధ్యారాణి, టి.వెంకటరమణను డీఎస్పీ అభినందించారు. నిందితుడు జానీని మాచర్ల కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

## అన్నదమ్ముల అనుమానాస్పద మృతి

**: వివరాలు సేకరిస్తున్న పోలీసులు**

**బాపట్ల, జూన్12, ప్రభాతవార్త:** బాపట్ల పట్టణంలో అన్నదమ్ములు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గురువారం అలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల తెల్పిన వివరాల ప్రకారం బాపట్ల పట్టణంలోని శిఖరంవారి వీదిలో ఇక ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు, సమాచారం మేరకు పట్టణ సిఐ రాంబాబు, ఎస్ఐ విజయ్ కుమార్‌లు సంఘటనస్థలానికి చేరుకుని తలుపులను పగల కొట్టి ఇంటిలోకి వెల్లి చూడగా ఇద్దరు అన్నదమ్ములు బొడ్డుపల్లి బాల సుబ్రమణ్యం దంత వైద్యులు, తమ్ముడు వెంకట సుబ్బయ్యశాస్త్రీలు వేరు వేరు గదులలో మృతి చెంది ఉండటాన్ని గమనించారు. మృతులు సుమారు గత నాల్గు రోజుల క్రితం మృతి చెంది ఉంటారన్నారు.. ఈ మేరకు పట్టణ సిఐ రాంబాబు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాపట్ల జిల్లాకు చెందిన రైతుకు ప్రతిష్ఠాక పురస్కారం




**బాపట్ల, జూన్12, ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా కారంచేడు మండలం తెమిదితపాడు కు చెందిన అభ్యుదయ రైతు బోడావుల లక్ష్మీ నారాయణ వ్యవసాయం లో నూతన ఆలోచనలకూ మరియు ఆవిష్కరణలకు చేసిన కృషికి గాను డా. ఎం వి రెడ్డి ఉత్తమ రైతు పురస్కారం 2025 సంవత్సరానికి ఎన్నికైయ్యారు. ఈ సందర్భముగా ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం 62 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భముగా గురువారం విశ్వవిద్యాలయ ప్రాంగణం, లాం, గుంటూరు లో జరిగిన ఒక కార్యక్రమం లో అభ్యుదయ రైతు బోడావుల లక్ష్మీ నారాయణ ను 25 ,000 నగదు తో పాటు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానంతో పాటు జ్ఞాపిక పురస్కారాన్ని వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి గౌరవనీయులు శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భముగా బాపట్ల ఎరువాక కేంద్ర జిల్లా సమన్వయకర్త డా. ఆర్ బాల మురళీధర్ నాయక్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా కు చెందిన అభ్యుదయ రైతుకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్నందుకు అభినందనలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కులపతి మరియు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## హెచ్ఐవితో జీవించే వారికి మెరుగైన సేవలు

**నరసరావుపేట టౌన్, జూన్ 12 ప్రభాతవార్త :** హెచ్ఐవితో జీవించే వారికి మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.మంజుల అన్నారు. గురువారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో పని చేస్తున్న ఐసిటిసి కేంద్రాలు, ఏఆర్‌టి సెంటర్‌లు, స్వచ్ఛంధ సంస్థలతో సమీక్ష నిర్వహించారు. డాక్టర్ మంజుల మాట్లాడుతూ ఏఆర్‌టి సెంటర్‌లలో మందులు వాడే వారు ప్రతి రోజూ సమయానికి మందులు వాడాలన్నారు. వైరల్ లోడ్ పరీక్షల్లో 200 కన్నా తక్కువ కాపీలు వస్తే వారి ద్వారా ఇతరులకు హెచ్ఐవి వ్యాపించదన్నారు. క్షయ నివారణ అధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు సకాలంలో హెచ్ఐవి పరీక్షలు చేయాలన్నారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జానీబాషా మాట్లాడుతూ హైరిస్క్ గ్రూపుల వారు మందులు క్రమం తప్పకుండా కౌన్సిలింగ్ చేయాలన్నారు. సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, రత్నకుమార్, శశిధర్‌రెడ్డి, రీడ్స్, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థల ప్రతినిధులు, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విజయవంతమైన రక్తదాన శిబిరం

**నరసరావుపేట, జూన్ 12 ప్రభాతవార్త :** రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం నాదెండ్ల మండలంలో రక్తదాన శిబిరం నిర్వహించామని జిల్లా ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తెలియజేశారు. వారు మాట్లాడుతూ నాదెండ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారని తెలిపారు. తహశీల్దార్ ఏ.వి.రమణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు ప్రపంచ రక్తదాత దినోత్సవ వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. అత్యవసర సమయాలలో రక్తం ఆవశ్యకతను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామస్తుల సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ స్వరూపారాణి, ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**నరసరావుపేట, జూన్ 12 ప్రభాతవార్త :** క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి గురువారం తెలియజేశారు. కడపలో ఉన్న పాఠశాలలో 4,5 తరగతుల విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్‌ను విడుదల చేయడం జరిగిందన్నారు. 4వ తరగతిలో 40 సీట్లు, 5వ తరగతిలో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అభ్యర్థుల కాల్ లెటర్లు జూలై 24వతేదీ నుండి ప్రభుత్వం పంపడం జరుగుతుందని జిల్లా అధికారి నరసింహారెడ్డి తెలియజేశారు.

# టెక్నాలజీ అందరికీ అందుబాటులో ఉండాలి

**- ప్రొఫెసర్ సల్మాన్ అబ్దుల్ మోయిజ్**




**పొన్నూరు, జూన్ 12, ప్రభాతవార్త:** పేదవారికీ, గ్రామీణ ప్రాంతాల వారికి కూడా టెక్నాలజీ అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని, ఇది సామాజిక న్యాయానికి సంబంధించి కీలకమని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని సీఎస్ఈ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ సల్మాన్ అబ్దుల్ మోయిజ్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ అండ్ ఇన్ఫర్మాటిక్స్ విభాగంలోని డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సెకండ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నెట్‌వర్క్స్ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్ అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించిన అనంతరం కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ప్రొసీడింగ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ప్రొసీడింగ్స్ పుస్తకంలో దేశ విదేశాల నుంచి 130కి పైగా పరిశోధన పేపర్లను పొందుపరిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ సల్మాన్ అబ్దుల్ మోయిజ్ మాట్లాడుతూ వ్యక్తిగత డేటా ఎలా సురక్షితంగా నిల్వ చేయాలి? ఎలా ఉపయోగించాలి అనే దానిపై నైతిక నిర్ణయాలు అవసరమన్నారు. దీనిని హెల్త్‌కేర్, ఫైనాన్స్, సోషల్ మీడియా వంటి రంగాల్లో అన్వయించవచ్చునని పేర్కొన్నారు. మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అల్గోరిథమ్స్‌లో పక్షపాతం లేకుండా ఉండేలా చూడాలన్నారు. ఈ విధానం ఉద్యోగ నియామకం, క్రెడిట్ స్కోరింగ్, న్యాయవ్యవస్థలలో ఇది ముఖ్యమైందన్నారు. హ్యాకింగ్, డేటా మానిప్యులేషన్, డీప్‌ఫేక్స్ వంటి విపత్కర అంశాలను నియంత్రించేందుకు నైతిక దృక్కోణం అవసరమన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్‌లో నైతిక ప్రమాణాలు ఏర్పరచి, క్షమించరాని ప్రవర్తనలను నియంత్రించవచ్చు. పిల్లలు, యువతవాడే డిజిటల్ కంటెంట్‌లో బాధ్యతాయుతమైన నియంత్రణలు అవసరమన్నారు. బిట్‌కాయిన్ మైనింగ్, బాట్‌నెట్ల వంటివి పర్యావరణ హానికరంగా మారుతున్న తరుణంలో కంప్యూటింగ్ వనరుల వినియోగం గురించి బాధ్యతాయుత నిర్ణయాలు అవసరమని తెలియజేశారు. మరో అతిథి బాల ప్రసాద్ పెద్ది మాట్లాడుతూ ట్రాఫిక్ పరిస్థితులు, జీపీఎస్ సమాచారం, రోడ్డు భద్రతను విశ్లేషించి తగిన నిర్ణయాలు తీసుకోవడంలో ఏజెంటిక్ ఏఐ కీలకంగా పనిచేస్తుందన్నారు. జ్ఞాపకాలు గుర్తు చేయడం, షెడ్యూల్ ప్లానింగ్, ఈ మెయిళ్ళకు స్పందించడం వంటి పనుల్లో సిరి, అలెక్సా లాంటి సహాయకులు ఏజెంటిక్ ఏఐతో పనిచేస్తుంటారని పేర్కొన్నారు. రోగి ఆరోగ్య డేటా ఆధారంగా వ్యాధి పతనాన్ని అంచనా వేయడం, వైద్య సూచనలు ఇవ్వడం లాంటి సేవల్లో ఏజెంటిక్ ఏఐ ఉపయోగపడుతుందని వెల్లడించారు. మరో అతిథి సునీల్‌కుమార్ మాట్లాడుతూ హెచ్‌ఆర్, ఫైనాన్స్, సప్లై చైన్, కస్టమర్ సర్వీస్ సమన్వయంతో పని చేయాలన్నారు. ఇక్కడ మల్టీ ఏజెంట్ ఏఐ సిస్టమ్స్ కీలకమని తెలియజేశారు. అనిశ్చిత పరిస్థితులలోనూ సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఫజ్జీ లాజిక్ ఉపయోగపడుతుందన్నారు. న్యూరల్ నెట్‌వర్క్‌ల సహాయంతో ముందస్తు డేటా ఆధారంగా వ్యాపార ప్రవర్తనలను అంచనా వేయడం సులభమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ డి.విజయరాము, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## లిఫ్ట్‌ఇరిగేషన్‌లకు మరమ్మత్తులు చేపట్టాలి : రైతు సంఘం

**నరసరావుపేట టౌన్, జూన్ 12 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలో ఉన్న అన్ని లిఫ్ట్‌ఇరిగేషన్‌లకు మరమ్మత్తులు చేపట్టాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము అన్నారు. జిల్లాలో 155 లిఫ్ట్ ఇరిగేషన్‌లు ఉన్నాయన్నారు. వాటిని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. వీటి పరిధిలో లక్షలాది ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. దీనికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం ఎన్నోమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. కూటమి ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలన్నారు. నూజెండ్ల మండలంలో, కొండలరాయుడుపాలెంలలో లిఫ్ట్ ఇరిగేషన్‌లను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాముతో పాటు మాచర్ల నియోజకవర్గ కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి, కారంపూడి మండల కార్యదర్శి షేక్.సైదా పాల్గొన్నారు.

## ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన

**నరసరావుపేట, జూన్ 12 ప్రభాతవార్త :** విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకుందామని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. ఏఐటియుసి జాతీయ సమితి పిలుపు మేరకు బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ నుండి 2500 మంది కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ పరిశ్రమ పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. జిల్లా నాయకులు ఉప్పలపాటి రంగయ్య, కాసా రాంబాబు, సత్యనారాయణ రాజు, అంజిరెడ్డి, లక్ష్మారెడ్డి, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు పాలన ప్రజలకు పండుగ : నాగోతు శౌరయ్య



**నరసరావుపేట, జూన్ 12 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ పాలన ఏడాదిగా పండుగ రోజులను అన్ని వర్గాల ప్రజలకు అందించిందని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు శౌరయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సుపరిపాలన ప్రారంభమై ఏడాది అవుతుందన్నారు. ఈ శుభ సందర్భంలో తల్లికి వందనం పథకం ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. 1 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు రూ.15 వేలు వారి తల్లుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. ప్రతి ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. అదే విధంగా చదువుకున్న యువత కోసం ఉద్యోగాలను కల్పిస్తుందన్నారు. దీపం పథకంలో గ్యాస్ సిలెండర్లను ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. పింఛన్లను పెంచి ఇచ్చారన్నారు. 200లకు పైగా అన్న క్యాంటీన్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జూన్ నెలలో అన్నదాత పథకం ప్రారంభమవుతుందని, నిజమైన ప్రజా పాలన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ద్వారా సాధ్యమవుతుందని నాగోతు శౌరయ్య తెలిపారు.

## విద్యార్థి తిమోతికి ఎలక్ట్రిక్ బ్యాటరీ సైకిల్ అందజేత



**కొల్లిపర, జూన్ 12 ప్రభాతవార్త:** మండల కేంద్రం కొల్లిపర భవిత కేంద్రంలో గురువారం ప్రభుత్వం అందజేసిన ఎలక్ట్రిక్ బ్యాటరీ సైకిల్‌ను విదార్థి పెరికల తిమోతికి విద్యాశాఖాధికారులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంఈవో ఝాన్సిలత మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక అవసరాల పిల్లలను ఆదుకోవటం కోసం ఎలక్ట్రిక్ బ్యాటరీ సైకిల్‌ను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ, ఉపాధ్యాయులు మృత్యుంజయరావు, సురేష్, పాపయ్య, స్వర్ణకుమారి, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యా సంవత్సరంలో కొత్త బస్ పాసులు



**నరసరావుపేట టౌన్, జూన్ 12 ప్రభాతవార్త :** నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు కొత్త బస్ పాసులను జారీ చేస్తామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు గురువారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రంగు మార్చబడిన కొత్త బస్ పాసు, ఐడీ, టిక్కెట్ స్టాక్‌ను సిస్టంలో లోడ్ చేసేందుకు రెండు రోజులు సమయం పడుతుందన్నారు. ఇతర సాంకేతిక కారణాల వలన ఈ నెల 12,13 తేదీలలో బస్‌పాస్ కౌంటర్లు తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. 14వతేదీ నుండి పాసులను యధావిధిగా జారీ చేస్తామన్నారు. విద్యార్థులు తమ విలువైన సమయం కౌంటర్ వద్ద వృధా కాకుండా తమ వివరాలను ముందుగానే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. విద్యార్థులు పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో తెలుసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు సూచించారు.

## గ్రామాభివృద్ధి... ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

**-దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి**




**కొల్లిపర, జూన్ 12 ప్రభాతవార్త:** గ్రామాభివృద్ధి... ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తుందని దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర టీడీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరి సంవత్సర కాలం పూర్తి చేసుకున్న నేపధ్యంలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తల్లికి వందనం ద్వారా 67 లక్షల మందికి వారి ఖాతాల్లో నగదు జమ చేయటం జరిగిందన్నారు. పేద ప్రజలను ఆదుకోవాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు లంక కోటిరెడ్డి, ఆరిమండ కృష్ణారెడ్డి, ఆరిమండ శివనాగమల్లీశ్వరరెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, కంచర్ల అమృతరాజు, నక్కా సంసోన్, కొల్లిపర శ్రీనివాసరావు, షేక్ రఫీ, దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యాలయంలో ఏర్పాటు

**తెనాలి, జూన్ 12 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత వ్ం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేకును మాజీ మంత్రి ఎమ్మెల్సీ ఆలపాటి కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. రాష్ట్రంలో అనేక సంక్లిష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా..

**కొల్లూరు, జూన్ 12 (ప్రభాతవార్త) :** కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కేక్ కట్ చేసిన కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ మరియు కొల్లూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొందలపాటి చలమయ్య మరియు కూటమి సభ్యులు. మైనేని మురళీకృష్ణ మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంగా ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో భాగంగా మహిళా మణులకు కానుకగా నేటి నుంచి తల్లికి వందనం పథకం అమలుకు శ్రీకారం చుడుతున్నాం. చదువుకునే పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ తల్లికి వందనం ఇవ్వనున్నారు. రూ.67,27,164మంది విద్యార్థులకు ఈ పథకం కింద తల్లుల ఖాతాల్లో రూ.8745కోట్లు ప్రభుత్వం జమ చేయనుంది. 1 వరతగతిలో అడ్మిషన్ పొందే పిల్లలు ఇంటర్ ఫస్టియర్లో చేరే విద్యార్థులకు కూడా తల్లికి వందనం ఇవ్వనున్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పించన్ల పెంపు, అన్నా క్యాంటిన్, మెగా డిఎస్సీ, దీపం-2 పథకాలు అమలు చేసిన మా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలుతో ముఖ్యమైన మరో హామీ నెరవేర్చింది అని ఆనందాన్ని వ్యక్తం చేసి త్వరలోనే సూపర్ సిక్స్‌లో భాగంగా మిగిలిన పథకాలని అమలు పరుస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సాతులూరు గ్రామ టిడిపి నూతన కమిటి సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**నాదెండ్ల, జూన్12, ప్రభాతవార్త:** మండలంలోని సాతులూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షులుగా నార్నె కోటయ్యస్వామి, ప్రధాన కార్యదర్శిగా కోట మహేష్‌లు, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కాగా వీరందరూ గురువారం పట్టణంలోని ప్రత్తిపాటి నివాసానికి వచ్చి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ప్రత్తిపాటి సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, వలేటి హిమవంతరావు, బండారుపల్లి సత్యనారాయణ, నందిగం శివ కోటేశ్వరరావు, నార్నె శ్రీనివాసరావు, ఐనవోలు రాధ, జంపని వసంతరావు, కమ్మ శ్రీనివాసరావు, చెన్నబోయిన సుబ్బారావు, మండల, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మీ పుట్టినరోజున ఒక మొక్క నాటండి

**: కార్యక్రమాన్ని ప్రారంభించిన తహసిల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్**



**చిలకలూరిపేట, జూన్12, ప్రభాతవార్త:** అమ్మి ఫౌండేషన్ చేపట్టిన మీ పుట్టినరోజున ఒక మొక్క నాటండి ఉద్యమంలో బాగంగా పేట తహసిల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని తహసిల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్ మొక్కను నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రారంభించిన ఉద్యమాన్ని ఆయన అభినందించారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజలలో పర్యావరణంపై అవగాహన పెంచాలని ఆకాంక్షించారు. ప్రతి పౌరుడు మొక్కలు నాటటం అలవాటు చేసుకుంటే మన పట్టణాలు తిరిగి పచ్చగా మారతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమాలలో రోషన్, ఈశ్వర్, అమ్మి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అప్రోజ్, డిప్యూటి తహసిల్దార్, ఆర్ఐ రమీజా, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలు, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

**యడ్లపాడు, జూన్ 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అన్ని పాఠశాలలు పున:ప్రారంభమైనాయని, తొలి రోజు ప్రభుత్వం అందజేస్తున్న పుస్తకాల పంపిణీ మరియు బ్యాగ్గులు అందజేయటం జరిగిందని ఎమ్ఇవో వన్ నాగరత్నం తెలిపారు. ఇందులో భాగంగా యడ్లపాడు యూపి పాఠశాలలో అమె గురువారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్గులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అమె వివరిస్తూ మండల పరిధిలోని 11 మోడల్ ప్రైమరీ పాఠశాలలకు ఒకరి చోప్పున అదనంగా ఉపాధ్యాయులు రావటం జరిగిందని, ఒక యూపి పాఠశాలకు నలుగురు, ఒక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో అక్కడ హెచ్‌ఎమ్‌ను బదిలీ చేసి ఎమ్ఇవోకు ఇన్‌చార్జీ హెచ్‌ఎమ్‌గా బాధ్యతలు ఇవ్వటం జరిగిందని, ఇందులో నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా అన్ని పాఠశాలలో ఉపాధ్యాయుల భర్తీ పూర్తిగా ఉందన్నారు.

13-6Pg5.qxd:13-6Pg5.qxd 01/01/01 7:25 AM Page 1



# ఘోర విమాన ప్రమాదాలు ఎన్నెన్నో..

**న్యూఢిల్లీ,జూన్ 12:** విమానప్రమాదాలు తరచూ సాంకేతిక సమస్యలు, సకాలంలో ఓవర్‌హాలింగ్ జరక్కపోవడం వల్ల కొన్ని జరుగుతుంటే వాతావరణ పరిస్థితులు, గగనతలంలో ఎదురవుతున్న పరిణామాలకారణంగా కొన్ని జరుగుతున్నాయి. మరికొన్ని హటాత్తుగా వచ్చిన సాంకేతిక సమస్యలు కూడా ఒక కారణమే. ఈ ప్రమాదాలు ఒక్క భారత్‌కే పరిమితం కాదు. వివిధ దేశాల్లోకూడా ఘోరమైన ప్రమాదాలు జరిగాయి. 1977 మార్చి 27న స్పెయిన్‌లోని లాస్ రోడియోస్‌లో ఉన్న టెనెరైఫ్ నార్త్ ఎయిర్‌పోర్ట్ వద్ద హాలండ్‌కు చెందిన కేఎల్‌ఎం ఫ్లైట్ 4085, గ్రీస్‌కు చెందిన పాన్ ఏఎం ప్లేన్1736 ఢీకొన్నాయి. ఈ రెండు విమానాలనూ లాస్ రోడియోస్ ఎయిర్‌పోర్టుకు దారిమళ్లించారు. పాన్ ఏఎం ఫ్లైట్ 1736 విమానం లాస్ రోడియోస్ ఎయిర్‌పోర్టు వైపుగా వస్తోంది. ఇదే సమయంలో కేఎల్‌ఎం విమానం క్లియరెన్స్ తీసుకోకుండానే టేకాఫ్ తీసుకుంది. ఇవి రెండూ గగనతలంలో ఎదురుపడ్డాయి. దట్టమైన పొగమంచు వల్ల పైలట్లు ఎదురుగా ఏముందో గుర్తించలేకపోయారు. ఈ ప్రమాదంలో 583 మంది చనిపోయారు. ఇవి రెండూ బోయింగ్ 747 విమానాలే.1985 ఆగస్టు 12న జపాన్ ఎయిర్ లైన్స్ విమానం 123 టోక్యో నుంచి ఒసాకాకు బయలుదేరింది. ఈ ఘటనలో విమానంలోని 524 మందిలో 520 మంది చనిపోయారు. విమానం తోక భాగాన్ని బోయింగ్ టెక్నీషియన్లు సరిగ్గా రిపేర్ చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గుర్తించారు. 1974 మార్చి 3న ఇస్తాంబుల్ నుంచి లండన్‌కు బయలుదేరిన విమానం ఫ్రాన్స్‌లోని ప్యారిస్ శివార్లలో ఉన్న ఎర్మెనో విల్లే అడవుల్లో కూలింది. విమానంలోని 346 మంది చనిపోయారు.1980 ఆగస్టు 19న సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఉన్న ఎయిర్‌పోర్టు రన్‌వేపై లఖీద్ మార్టిన్ ఎల్1011 విమానం ఉంది. అయితే అకస్మాత్తుగా విమానంలో పొగలు వ్యాపించాయి. ఆ పొగను పీల్చుకొని విమానంలోని మొత్తం 301 మంది చనిపోయారు. 1979 మే 25న మధ్యాహ్నం డీసీ10 విమానం అమెరికాలోని చికాగోలో ఉన్న ఓహేర్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరింది. అయితే ఈ విమానంలోని ఎడమ ఇంజిన్,



రెక్క భాగం నుంచి తెగిపోయి కింద పడింది. దీంతో విమానం అదుపుతప్పి గింగిరాలు తిరిగింది. చివరకు రన్ వే నుంచి ఒక మైలు దూరంలో విమానం కూలిపోయింది. ఈ ఘటనలో 272 మంది చనిపోయారు.

2018 ఏప్రిల్ 11న అల్జీరియాలో రష్యాకు చెందిన ఇల్యూషిన్ రకం సైనిక రవాణా విమానం కూలింది. బౌఫారిక్ విమానాశ్రయానికి సమీపంలోని ఒక పొలంలో విమానం పడిపోయింది. ఈ ఘటనలో 257 మంది చనిపోయారు. మలేషియా ఎయిర్ లైన్స్ విమానం 2014 మార్చి 8న మలేషియాలోని కౌలలంపూర్ నుంచి చైనాలోని బీజింగ్‌కు బయలుదేరింది. అయితే ఈ విమానం రాడార్ తెర నుంచి మాయమైంది. బోయింగ్ 777 రకానికి చెందిన ఈ విమాన ప్రమాదంలో 239

## సాంకేతిక సమస్యలే ఎక్కువ కారణం..

## స్పెయిన్‌లో 1977 మార్చి 27న రెండు విమానాలు ఢీ, 583 మంది మృతి

## అడవుల్లో కూలిన విమానాలు కూడా అనేకం

మంది చనిపోయారని ప్రకటించారు. 1998 సెప్టెంబరు 2న స్విట్జర్లాండ్‌కు చెందిన స్విస్ ఎయిర్ ఫ్లైట్ 111 అమెరికాలోని న్యూయార్క్ నుంచి స్విట్జర్లాండ్‌లోని జెనీవాకు బయలుదేరింది. విమానం తోక భాగం నుంచి పొగ వాసన వస్తుండటాన్ని తొలుత గుర్తించారు. 65 మైళ్ల దూరంలో కెనడాలోని నోవా స్కాటియాలో ఉన్న హాలీ ఫ్యాక్స్‌కు విమానాన్ని తీసుకెళ్లి దింపాలని పైలట్లు భావించారు. పైలట్లు తీవ్రంగా శ్రమించి విమానాన్ని నోవా స్కాటియాకు 5 మైళ్ల దూరం వరకు తీసుకెళ్లారు. ఇంకొన్ని నిమిషాలైతే హాలీ ఫ్యాక్స్‌లో విమానాన్ని దింపొచ్చని భావించారు. అయితే అప్పటికే విమానంలో వేగంగా మంటలు వ్యాపించాయి. దీంతో మార్గం మధ్యలో అట్లాంటిక్ సముద్రంలో విమానం కూలిపోయింది. అందులోని 229 మంది ప్రాణాలు కోల్పోయారు. 2009 జూన్ 1న ఎయిర్ ఫ్రాన్స్ ఎయిర్‌లైన్స్ 447 బ్రెజిల్‌లోని రియో డీ జెనీరియో నుంచి ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌కు బయలుదేరింది. మార్గం మధ్యలో విమానానికి తీవ్ర పిడుగుపాట్లు ఎదురయ్యాయి. వాటి బారి నుంచి తప్పించుకునేందుకు పైలట్లు విమానాన్ని దాదాపు 38వేల అడుగుల ఎత్తుకు తీసుకెళ్లారు. మరీ అంత ఎత్తుకు చేరాక విమానంలోని ఏరో డైనమిక్ వ్యవస్థ దెబ్బతింది. చివరకు విమానం దక్షిణ అట్లాంటిక్ సముద్రంలో కూలింది. దీంతో అందులోని 228 మంది చనిపోయారు.



## బోయింగ్‌ప్రమాదంపై బ్రిటన్‌ప్రధాని దిగ్భ్రాంతి

**లండన్, జూన్ 12:** లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం అహ్మదాబాద్ నగరంలో కూలిపోయిన ఘటనపై బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటన గురించి తనకు ఎప్పట ికప్పుడు సమాచారం అందుతోందని ఆయన తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్నవారి కుటుం బాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాలకే ఈ విమానం కుప్పకూలింది. ఇందులో 242 మంది ఉండగా, వారిలో 53 మంది బ్రిటన్ పౌరులే. ఈఘటనపై కీర్ స్టార్మర్ 'ఎక్స్' ద్వారా స్పందించారు. అహ్మదాబాద్ నగరంలో, లండన్ బయల్దేరిన విమానం కూలిపోయిన దృశ్యాలు హృదయ విదారకంగాఉన్నాయి. ఆ విమానంలో అనేక మంది బ్రిటిష్ జాతీయులు కూడా ఉన్నారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు నాకు వివరిస్తున్నారు. ఈ తీవ్ర మనోవేదన కలిగించే సమయంలో ప్రయాణికులు మరియు వారి కుటుంబ సభ్యులకు నా ప్రార్థనలు అండగా ఉంటాయని తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## బోయింగ్ ప్రమాదంపై సినీ ప్రముఖుల సంతాపాలు

**అహ్మదాబాద్, జూన్ 12:** అహ్మదాబాద్ ఎయిర్ పోర్టునుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిం డియా విమానం టేకాఫ్ అయిన కొన్ని సెకన్ల లోనే కుప్పకూలింది. ఈ ఘటనపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, రాఘవ్‌ఛద్దా, సోనూ సూద్, ఖుష్బూతోపాటు పలువురురాజకీయ సినీప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తంచేసారు. ఈఘటన తమను ఎంతగానో కలిచివేస్తోందని సోషల్‌మీడియా వేదికగా పోస్టులుపెట్టారు. ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్‌లీగ్ ఈవెంట్‌ను బాలివుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ రద్దుచేసుకు న్నారు. అహ్మదాబాద్‌నుంచి లండన్‌కు బయలు దేరిన ఎయిర్‌ఇండియా విమానం ప్రమాదానికి గురికావడం అత్యంత విషాదకరం. బాధి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. మరింత సమాచారం సత్వరమే అందచేస్తామని ఎయిరిం డియా ఛైర్మన్ చంద్రశేఖరన్ తెలిపారు. బాలివుడ్‌నటి జాన్వీకపూర్, అక్షయ్‌కుమార్, అనుపమ్‌ఖేర్, టాలివుడ్ నటులు ఎన్టీఆర్, మంచువిష్ణు, అల్లు అర్జున్, నటి దిశాపటాని తదితరులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

## భారత్‌లోనూ విమాన దుర్ఘటనలు ఎక్కువే..!



**న్యూఢిల్లీ, జూన్ 12:** గుజరాత్ అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టునుంచి గురువారం లండన్ బయలుదేరిన విమానం నెంబరు ఎఐ171 ఘోరప్రమాదానికి గురయింది. విమానంలో 242 మందిప్రయాణికులు, ఇద్దరు పైలెట్లు, సిబ్బంది ఉన్నారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గత ఐదేళ్లలో భారత్‌లో జరిగిన విమానప్రమాదాలో ఇది భారీస్థాయి ప్రమాదం అని నిపుణులు చెపుతున్నారు. 2020 కరోనా మహమ్మారి సమయంలో విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లోభాగంగా బోయింగ్ 737-800విమానం దుబాయ్‌నుంచి కేరళలోని కోయ్‌కోడ్‌కు బయలుదేరింది. అదే సమయంలో భారీ వర్షం వల్ల ప్రమాదంజరగడంతో 30 అడుగుల లోయలోపడి విమానం రెండుగా చీలిపోయింది. ఈప్రమాదంలో ఇద్దరుపైలట్లతోసహా 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 100 మందికిపైగా గాయపడ్డారు. 2010మేలో కూడా మంగుళూరు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఐఎక్స్ 812 కుప్పకూలింది. అత్యంత భారీ ప్రమాదం.166మంది ప్రవాసభారతీయులు ఉన్న ఈవిమానం దుబాయ్‌నుంచి మంగళూరుకు వచ్చింది. సకాలంలో రన్‌వేపై ఆగలేకపోయింది. రన్‌వేదాటి లోయలోకి వెళ్లింది. మంటలు చెలరేగి 158 మంది మృతిచెందారు. వీరిలో 8 మంది మాత్రమే ప్రాణాలతో మిగిలారు. 1998జులైలో అలయన్స్ ఎయిర్ విమానం బోయింగ్ 737-2ఎ8 విమానం ల్యాండింగ్ సమయంలో అదుపు తప్పింది. జనాలు ఉన్న ప్రాంతంలోకి దూసుకుపోయింది. బీహార్‌లోని పాట్నా ఎయిర్‌పోర్టు సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో 55 మంది ప్రయాణీకులు మరణించగా మరో ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయారు.

హరియానాలో కూడా మరోప్రమాదం జరిగింది. సౌదీ అరేబియా ఎయిర్‌లైన్స్ విమానం 763 కజకిస్థాన్ ఎయిర్‌లైన్స్ విమానం 1907లు ఢీకొన్నాయి. సమాచార లోపం కారణంగా ఈప్రమాదం జరిగింది. రెండు విమానాల్లో 340కిపైగా ప్రయాణీకులు సిబ్బంది మృతిచెందారు. 1993 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ఎయిర్‌పోర్టునుంచి బయలుదేరని ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టేకాఫ్ సమయంలో ప్రమాదా నికి గురయింది. రన్‌వేపైకివచ్చిన ట్రక్కును ఢీ కొట్టింది. దీనితో విమానంలో మంటలు చెలరేగాయి. ఈప్రమాదంలో 118 మంది ప్రయాణీకులు 55 మంది సిబ్బందితోకలిసి చనిపోయారు. బెంగళూరు ఎయిర్ పోర్టులో ఇండి యన్ ఎయిర్‌లైన్స్ విమానం 605 కుప్పకూలింది. రన్‌వేను తీవ్రస్థాయిలో తాకడంతో ఈప్రమాదం జరిగింది. ఈ ఘటన 1990లో జరిగితే ఈ ప్రమాదంలో 146 మంది ప్రయాణీకులు 92 మంది సిబ్బందిచనిపోయారు. 1972 జూన్‌నెలలోజపాన్ ఎయిర్‌లైన్స్ డిసి-8 విమానం ఢిల్లీలో పాలం ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతుండగా మంటల్లో చిక్కుకుంది. విమానంలోని మొత్తం 89 మందిలో 83 మంది చనిపోయారు.

## కుమార్తె కోసం లండన్ బయల్దేరిన రూపానీ.. ప్రమాదానికి బలి



**అహ్మదాబాద్, జూన్ 12:** గుజరాత్‌లోని అహ్మదా బాద్‌లోజరిగిన ఘోరవిమాన ప్రమాదంలో విజయ్‌రూపానీ కూడా చిక్కుకున్నారు. లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిక్షణాలకే కుప్పకూలింది. ఇదే విమా నంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. విమానప్రమాదం మంటల్లో చిక్కుకుని దుర్మరణం పాలయ్యారు. ఈ విమానంలో ఆయనపేరుతో ఒక టికెట్ తొలుత నెట్టింట వైరల్ అయింది. అందులో బోర్డింగ్ సమయం 12.10గంటలుగా ఉంది. ఆయన విమానం ఎక్కినట్లు నిర్ధారించిన ప్యాసింజర్ జాబితాలోనూ రూపానీ పేరు ఉంది. లండన్‌లో ఉంటున్న తన కుమార్తెను చూసేందుకు విజయ్‌రూపానీ ఈ విమానంలో ప్రయాణానికి బుక్‌చేసుకున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. చివరకు కుప్పకూలిన విమానం మంటల్లో చిక్కుకో వడంతో విజయ్‌రూపానీ కూడా మృతిచెందారు. బిజెపికి చెందిన విజయ్‌రామ్‌నిక్‌లాల్‌భాయ్ రూపానీ 2016 నుంచి 2021వరకూ రెండుసార్లు గుజరాత్ సిఎంగా పనిచేసారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తెకాగా చిన్న కుమారుడు పూజిత్ ఒక ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు.

అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టునుంచి గురువారం మధ్యాహ్నం 1.30 గంటలప్రాంతంలో లండన్ బయలుదేరి ఎయిరిండియా ఎఐ171 విమానం కాసేపటికే కూలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో 242 మందిప్రయాణీకులు సిబ్బంది ఉన్నారు.

## ముందు చెట్టును ఢీకొని ఆపై భవనంపై కూలిన విమానం

**అహ్మదాబాద్,జూన్ 12:** నగరంలోని పటేల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టునుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా ఎఐ171 విమానం టేకాఫ్ అయిన కొద్దిక్షణాలకే కుప్పకూలి పోయింది. అక్కడికి సెకన్ల వ్యవధిలోనే చెట్టును ఢీకొట్టి ఒక భవనంపై కూలిపోయింది. సాంకేతిక సమస్య తలెత్తిన సమయానికి విమానం 825 అడుగుల ఎత్తునఉంది. ఫ్లైట్‌రాడార్ 24ప్రకారం 625 అడుగుల ఎత్తులో ఉండగా సిగ్నల్స్ కోల్పోయింది. క్రమంగా కిందికి కూలుతూ చెట్టును ఢీకొట్టింది. సమాచారం అందుకున్న విమానాశ్రయ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి వెళ్లి సహాయక చర్యలుచేపట్టారు. ప్రమాదానికి గురైన విమానంలో 242 మందిప్రయాణీకులుంటే వారిలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్‌పౌరులు, ఏడు గురు పోర్చుగీస్ జాతీయులతోపాటు ఒక కెనడా వాసి కూడా ఉన్నారు. బాధిత కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు వీలుగా హాట్‌లైన్‌నంబరు 1800-5691-444ను ఏర్పాటుచేసారు.

## దేశంలోనే తొలిసారి చెన్నైలో 8 అంతస్థుల భవనంలో మెట్రో రైలు

**చెన్నై, జూన్ 12:** దేశంలోనే మొట్టమొదటిసారిగా తొమ్మిది అంతస్థుల భవన సముదాయంలో నిర్మించే రైలు పట్టాలపై మెట్రోరైలు పరుగులు తీయనుంది. ఈ అద్భుత దృశ్యం తిరుమంగళం మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఆవిష్కృతం కాబోతోంది. రాజధాని నగరం చెన్నైలో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టులో భాగంగా తిరుమంగళం వద్ద షాపింగ్‌మాల్స్‌తో కూడిన బహుళ అంతస్థుల భవన సముదాయం మధ్య నుంచి వెళ్లేలా మెట్రోరైలు మార్గాన్ని నిర్మిస్తున్నారు. ఈ కొత్త రైలు మార్గానికి సంబంధించిన తొమ్మిది అంతస్థుల భవన సముదాయం, టవర్ల ఊహాచిత్రాలను చెన్నై మెట్రో రైల్వే (సిఎంఆర్ఎల్) బుధవారం విడుదల చేసింది. నగరంలో రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టును 116.1 కి.మీ. వరకు మూడు మార్గాల్లో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వీటిలో మాధవరం-షోళింగనల్లూరు మార్గంలోని తిరుమంగళం జంక్షన్ వద్ద మెట్రో రైల్వేస్టేషన్‌తోపాటు షాపింగ్‌మాల్స్‌తో 9 అంతస్థులతో ఎ, బి, సి పేర్లతో మూడు భవనాలు నిర్మించనున్నారు.



ఈ భవన సముదాయంలో రెండంతస్థుల రైల్వే స్టేషన్ కూడా నిర్మితమవుతుంది. ఈ భవన సముదాయాలతో కూడిన మెట్రో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులకు సంబంధించి త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నారు. కొత్తగా నిర్మించబోయే ఈ భవనంలో పలు కార్యాలయాలు, చిల్లర దుకాణాలు, మూడు సొరంగమార్గాల పార్కింగ్ స్థలాలుంటాయి. భారత దేశంలోనే వాణిజ్య సముదాయాలు కలిగిన భవనంలో ప్రయాణించేలా మెట్రో రైలు మార్గాన్ని నిర్మించడం ఇదే ప్రప్రథమనని మెట్రో రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ప్రస్తుతం జపాన్, చైనా దేశాల్లోనే భవన సముదాయాల మధ్య నుంచి రెళ్లు వెళుతున్నాయని, ఆ రీతిలోనే నగరంలోనూ బహుళ అంతస్థుల భవన సముదాయంలోకి మెట్రో రైళ్లు దూసుకెళతాయని తెలిపారు. ఈ భవన సముదాయంలోని నాలుగో అంతస్థులో మెట్రో రైళ్లు ప్రయాణిస్తాయని, మూడో అంతస్థులో ప్రయాణికుల వెయిటింగ్ హాల్స్ ఉంటాయని పేర్కొన్నారు.

## గుడ్‌బై టు ఇండియా..


### కన్నీళ్లు పెట్టిస్తున్న ఇద్దరు బ్రిటిషర్ల సెల్ఫీ

**అహ్మదాబాద్,జూన్ 12:** అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుసమీపంలో జరిగిన ఘోరవిమానప్రమాదంలో ఇద్దరు బ్రిటిషర్లు తీసుకున్న సెల్ఫీ కన్నీళ్లుపెట్టిస్తోంది. ఎలా బయటకు వచ్చిందో కానీ వారు చెపుతున్న మాటలుకూడా వైరల్ అయ్యాయి. విమానం ఎక్కేముందే వీరు సెల్ఫీతీసుకున్నట్లుతెలుస్తోంది. ఇండియా నుంచి ఇంగ్లండ్ వెళ్లిపోతున్నాం. మరికొద్దిసేపట్లో విమానంఎక్కేస్తాం. గుడ్‌బైటు ఇండియా చాలా సంతోషంగా ఉంది ఇంగ్లండ్ తిరిగి వెళుతున్నందుకు అంటూవీరు చెప్పిన విడియో ఇపుడు వైరల్ అయంది. దురదృష్టం కొద్దీ వారి సంతోషం కొద్దిసేపటికే గాలిలో కలిసిపోయింది. ఈ ఇద్దరూ కూడా ప్రమాదంలో మరణించారు. అంతకు కొద్దినిమిషాలముందు ఎంతో సంతోషంగా ఉన్న వీరిద్దరూ అంతలోనే అగ్నికి ఆహుతి కావడం వైరల్ అవుతున్న వీరిద్దరి విడియోనుచూసి నెటిజన్లు ఉద్వేగభరితం అయ్యారు.

**భర్తను కలుస్తానన్న సంతోషం ఆవిరైపోయింది...!**

లండన్ వెళుతున్న ఎయిరిండియా ఎఐ171 విమానంలో కుష్బూరాజ్‌పురోహిత్ అనే కొత్త పెళ్లికూతురు కూడా ప్రయాణిస్తోంది. ఇటీవలే వారికి పెళ్లికావడం ఆపై ఇదే విమానంలో ఆమె లండన్‌లో తన భర్తను కలిసేందుకు విమానం ఎక్కడం. అంతలోనే ప్రాణాలు వదిలేయడం వంటి ఘటన చూస్తే అందరికీ కన్నీటి పర్యంతం అయింది. రాజస్థాన్‌లోని బాలోతారా జిల్లాలోని అరబా గ్రామానికిచెందిన కుష్బూ మన్‌ఫూల్‌సింగ్‌ను ఈ ఏడాదిజనవరిలోనే పెళ్లాడింది. తనభర్త లండన్‌లో విద్యార్థికాగా ఆతడిని కలిసేందుకు మొదటిసారి ఆమె లండన్‌కు బయలుదేరింది. తల్లితండ్రులు మదన్‌సింగ్‌రాజ్‌పురోహిత్ దంపతులు ఎంతో సంతోషంగా కుమార్తెను సాగనంపారు. అంతలోనే తమ కుమార్తె మరణ వార్త వినాల్సి వచ్చింది. కుష్బూ తన భర్తను కలుస్తానన్న సంతోషం కూడా విమానప్రమాదంలో మంటల్లో ఆవిరైపోయింది. ఇదే విమానంలో కుష్బూతోపాటు మొత్తం 11 మంది రాజస్థానీయులు మరణించినట్లు తెలుస్తోంది. వీరిలో ఇద్దరు యుకెలో చెఫ్‌లుగా వెళుతున్నారు.

# లింగసమానత్వంలో భారత్‌కు 131వ ర్యాంకు



## ఐస్‌ల్యాండ్ ఫస్ట్, న్యూజిలాండ్ టాప్ 5

**న్యూఢిల్లీ,జూన్ 12:** మహిళ, పురుష సమానత్వం విషయంలో భారత్ అట్టడుగున 131వ స్థానంలో నిలిచింది. ప్రపంచంలోని 148 దేశాల్లో లింగ సమానత్వ స్థితిగతుల సమాచారంతో 'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2025'ను ప్రపంచ ఆర్థికవేదిక (డబ్ల్యూఇఎఫ్) గురువారం విడుదల చేసింది. 2024తో పోలిస్తే ఈ ఏడాదిలో భారత ర్యాంకింగ్ రెండు స్థానాలు దిగజారింది. గతేడాది 129వ స్థానంలో నిలిచిన భారత్ ఈసారి 131వ ర్యాంకుకు చేరింది. మహిళ, పురుషుల జనసంఖ్యకు సంబంధించిన 'ప్యారిటీ స్కోర్' విషయంలోనూ భారత్ అట్టడుగున ఉండిపోయింది. భారత్‌కు 64.1 శాతం 'సమానత్వస్కోర్' వచ్చిందని డబ్ల్యూఇఎఫ్ వెల్లడించింది. వరుసగా 16వ సారి ఈ జాబితాలో తొలి స్థానంలో ఐస్‌లాండ్ నిలిచింది. 2వ స్థానంలో ఫిన్‌లాండ్, 3వస్థానంలో నార్వే, 4వ స్థానంలో యూకే, 5వ స్థానంలో న్యూజిలాండ్ నిలిచాయి.


భారతదేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు మునుపటి కంటే బాగా మెరుగుపడింది. దీంతో ఆర్థిక వ్యవహారాల విభాగంలో అదనంగా 0.3 పాయింట్లను భారత్ సాధించింది. మహిళ, పురుషుల ఆర్థిక భాగస్వామ్యం పెరగడంతో అదనంగా 0.9 పాయింట్లతో 'ఆర్థిక భాగస్వామ్యం అవకాశాల' కేటగిరీలో మొత్తం 40.7 శాతం ప్యారిటీ స్కోర్‌ను సాధించింది. భారత్‌లోని మహిళ, పురుషుల ఆదాయ అంచనాల తేడా స్కోర్ 28.6 శాతం నుంచి 29.9 శాతానికి పెరిగింది. భారత్‌లోని వివిధ ఉపాధి కార్యకలాపాల్లో మహిళ, పురుష కార్మికుల భాగస్వామ్యం అనేది గతేడాది స్థాయిలోనే 45.9 శాతంగా కొనసాగుతోంది. అయితే విద్యాపరమైన కేటగిరీలో భారత్‌కు అత్యధికంగా 97.1 శాతం సమానత్వ స్కోర్ వచ్చింది. దేశంలోని మహిళ, పురుష జనాభా నిష్పత్తి, మహిళ, పురుషుల ఆరోగ్యకర ఆయుర్దాయాల్లో పెరుగుదల ఏటా జన్మిస్తున్న ఆడ, మగ పిల్లలు వంటి విభాగాల్లో భారత్ సమానత్వస్కోరు మెరుగుపడింది. రాజకీయ సాధికారతపరంగా భారత పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యం అనేది 14.7 శాతం నుంచి 13.8 శాతానికి తగ్గింది. 2023 నాటి స్థాయితో పోలిస్తే గత రెండేళ్లుగా ఈవిభాగంలో భారతదేశ ప్యారిటీ స్కోరు తగ్గుతూనే ఉంది. భారత ప్రభుత్వంలోని మంత్రి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం 6.5 శాతం నుంచి 5.6 శాతానికి డౌన్ అయింది. ఈ విభాగంలో ప్యారిటీ స్కోర్ 5.9 శాతంగా నమోదైంది. 2019లో ఈ విభాగంలో భారత్ అత్యధికంగా 30 శాతం ప్యారిటీ స్కోర్‌ను సాధించింది.

**24వ ర్యాంకుకు బంగ్లాదేశ్ ఒకేసారి 75 ర్యాంకులు జంప్**

'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2025'లో అనూహ్యంగా బంగ్లాదేశ్ ర్యాంకింగ్ మెరుగుపడింది. రాజకీయ సాధికారత, ఆర్థిక భాగస్వామ్యం వంటి విభాగాల్లో దక్షిణాసియాలోనే అత్యంత మెరుగ్గా బంగ్లాదేశ్ రాణించింది. ఒకేసారి ఏకంగా 75 ర్యాంకులు జంప్ చేసి ప్రపంచంలో 24వ ర్యాంకుకు చేరింది. భారత్ పొరుగుదేశాలైన పాకిస్థాన్ 148, మాల్దీవులు 138, శ్రీలంక 130, నేపాల్ 125, భూటాన్ 119 స్థానాల్లో నిలిచాయి.

## మంగళసూత్రమే సోనమ్‌ను పట్టించింది

### మేఘాలయ డిజిపి



**షిల్లాంగ్,జూన్ 12:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసు కీలక విషయాలు వెలుగులో వస్తున్నాయి. హోమ్‌స్టేలోని సూట్‌కేస్‌లో దొరికిన మంగళసూత్రమే సోనమ్‌ను పట్టించిందని మేఘాలయ డిజిపి వెల్లడించారు. రాజా రఘువంశీసోనమ్ దంపతులు ఉన్న హోటల్ రూమ్‌లో పోలీసులు సోదా చేస్తుండగా అక్కడ సూట్‌కేస్ దొరికింది. అందులో మంగళసూత్రం, ఒక ఉంగరం ఉన్నాయి. అయితే కొత్తగా పెళ్లి అయిన మహిళ రూమ్‌లోనే తాళిని, సూట్‌కేస్‌లో ఉంగరాన్ని పెట్టి వెళ్లడం మాకు కొత్త అనుమానాలను కలిగించింది. హిందూ సంప్రదాయంలో మంగళసూత్రాన్ని స్త్రీ వైవాహిక జీవితానికి పవిత్ర చిహ్నంగా భావిస్తారు. ముఖ్యంగా కొత్తగా పెళ్లయిన వారు దానిని దాదాపుగా తీయరు. ఈ కోణంలోనే దర్యాప్తును ముమ్మరం చేశారు. అప్పుడే నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరాన్ని అంగీకరించారని డిజిపి వెల్లడించారు. హనీమూన్ కోసం మేఘాలయకు వచ్చిన సోనమ్, రఘువంశీ మే 22న సోహ్రాలో ఓ హోమ్‌స్టేకు వెళ్లారు. అయితే అక్కడ గది అందుబాటులో లేకపోవడం వల్ల తమ సూట్‌కేస్‌ను అక్కడే ఉంచి, నాంగ్రియాట్ గ్రామానికి ట్రెక్కింగ్‌కు వెళ్లారు.

ఆ రాత్రి నాంగ్రియాట్‌లోని మరో హోమ్‌స్టేలో బస చేసి, మే 23న ఉదయాన్నే అక్కడి నుంచి బయలుదేరారు. అనంతరం సోహ్రాకు తిరిగివచ్చి, తమ స్కూటర్‌ను తీసుకుని వీసాడాంగ్ జలపాతం వైపు వెళ్లారు. అక్కడే రాజా రఘువంశీ హత్యకు గురయ్యాడని పోలీసులు తెలిపారు. ఇక ఈ కేసులో రాజా రఘువంశీని తానే హత్య చేసినట్లు సోనమ్ ఒప్పుకున్నట్లు మేఘాలయ పోలీసులు తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహా సమక్షంలో సోనమ్‌ను ప్రశ్నించగా, తన భర్త హత్యకు చేసిన కుట్రలో తన ప్రమేయం ఉన్నట్లు ఆమె అంగీకరించిందని పోలీసులు తెలిపారు. మరోవైపు తన చెల్లెలు ఆమె భర్తను చంపించిందని వందశాతం నమ్ముతున్నట్టు సోనమ్ సోదరుడు గోవింద్ స్పష్టం చేశారు. నేరం రుజువైతే ఆమెను ఉరి తీయాలని ఆయన అన్నారు.

13-06Pg6exHMNWJQE.qxd:13-06Pg6exHMNWJQE.qxd 01/01/01 7:52 AM Page 1



# పట్టణంలో రూ.5 కోట్లతో పలు అభివృద్ధి పనులు

## నూజివీడును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా :మంత్రి కొలుసు పార్థసారధి

**ఏలూరు ప్రభాతవార్త** నూజివీడు పట్టణంలో రూ,5 కోట్ల తో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గురువారం భూమి పూజ చేశారు. పట్టణ 26 వార్డు లో సి, సి. రోడ్డు,మరికొన్ని రోడ్లకు శంకుస్థాపన చేశారు.,అనంతరం పెద్ద గాంధీ సెంటర్లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకొని సంబరాలు జరిపారు. తెలుగుదేశం కుటుంబ సభ్యులు విశేషంగా పాల్గొన్నారు ,అనంతరం మంత్రి మాట్లాడుతూ ఏడాది పాలనలోనే ఎన్నో విజయాలు సాధించామని పార్థసారధి అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వ హయాంలో రోడ్ల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చామన్నారు. నూజివీడు నియోజకవర్గంలో జెడ్పి పరిధిలో రూ. 3.55 కోట్ల తో రహదారులు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా రూ. 30 కోట్లతో గుంతలు పూడ్చేందుకు ఖర్చుచేశామన్నారు. పంచాయితీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ. 5 కోట్లు కేటాయించామన్నారు. సంక్షేమంలో భాగంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్దమొత్తంలో పెన్షన్లు ఇస్తున్నామన్నారు. నూజివీడు నియోజవర్గం లో ఏడాది కాలంలో రూ.170 కోట్లు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి పేదల ఆకలి తీర్చిన ఖ్యాతి కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నేటి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా తల్లికి వందనం అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వం పై నమ్మకం తో ప్రపంచ దిగ్గజ సంస్థలు మన రాష్ట్రంలో ఇప్పటికే రూ 10 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాయని తద్వారా యువతకు సుమారు 5 లక్షల ఉద్యోగ కల్పన జరుగుతుందన్నారు, మహిళకు ఉచిత బసు, ఉచిత గ్యాస్,తల్లికి వందనం, ద్వారా చదువుకుంటున్న ప్రతీ విద్యార్థికి రూ,15 వేలు ఈ రోజు అందించమన్నారు, పేద వాడికి అన్నం పెట్టే అన్నా క్యాంటీన్, పింఛన్లు రూ,4 వేలు పెంపు, వికలాంగులకు రూ,6 వేలు,అందిస్తున్నామన్నారు, రైతులకు త్వరలో రైతు భరోసా రూ,20 వేలు అందిస్తామన్నారు గత ప్రభుత్వం అందించిన పథకాలు అన్నీ కలిసి కూటమి ప్రభుత్వం అందించే పింఛన్ తో సమానం అన్నారు, గత ప్రభుత్వం 5 సంవత్సరాల్లో అందించే సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం ఏడాది లో అందించిందన్నారు.

ఎప్పటినుంచో పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తిలో భాగంగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి పరీక్షలు కూడా నిర్వహించడం జరుగుతున్నదన్నారు.

కార్యక్రమంలో పలువురు అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



# పేదలసేవ నుండి తల్లికివందనం వరకు కూటమి యేడాది పాలన

## - తిరుపతిలో నేతల సంబరాలు

**తిరుపతి,జూన 12ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తూ ఏడాదికాలం పూర్తిచేసుకుందని రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ తెలిపారు. ఏడాదిపాలన పూర్తయిన సందర్భంగా గురువారం ఉదయం తిరుపతిలోని టౌన్‌క్లబ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి అభిషేకాలుచేసి,పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 365రోజులు ప్రాంతీయంగా ని విజయోత్సవ కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రంలో ఏడాదిపాలన విజయవంతంగా పూర్తిచేసుకుని, సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనతో రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలను నెర వేర్చడం కోసం ప్రతి రోజూ శక్తివంచనలేకుండా సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు. ఏడాదికాలంలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి ,తిరుపతికి ఆర్థికంగా చేయూత వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు సూరా సుధాకర్‌రెడ్డి, వి.పుష్పావతి యాదవ్, దంపూరి భాస్కర్, డాక్టర్ సంజయ్, టిడిపి రాష్ట్రమీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, తిరుపతి నగర అధ్యక్షుడు వట్టికుంట శంకరనారాయణ; డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, అన్నా సంధ్యాయాదవ్, నాయకులు ఊట్ల సురేంద్రనాయుడు, మన్నెం శ్రీనివాసులు, బిజి కృష్ణయాదవ్ ఉన్నారు.

# రూ. 125 కోట్లతో రామచంద్రపురం అభివృద్ధి

## కూటమి యేడాది పాలనపై మంత్రి సుభాష్ సంతృప్తి

**కోనసీమ బ్యూరో, జూన్ 12( ప్రభాతవార్త):** గడచిన ఏడాది కాలంలో రామచంద్రపురం నియోజవర్గాన్ని రూ.125 కోట్లతో పలు అభివృద్ధి చేసామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని రామచంద్రపురంలో విజయోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది కూటమిపాలన అభివృద్ధి, సంక్షేమం దిశగా సాగిందన్నారు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకొని కూటమి ప్రభుత్వం జన రంజక పాలన అందిస్తుందన్నారు. ప్రజలందరి ఆకాంక్షల మేరకు పని చేస్తూ ప్రజా ప్రభుత్వంగా, మంచి ప్రభుత్వంగా మన్ననలు పొందుకున్నామని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజవర్గాన్ని ప్రత్యేకంగా తీసుకుని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నా న్నారు.రూ. 125 కోట్ల రూపాయల నిధులు నియోజకవర్గానికి మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ద్రాక్షారామంలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణం కోసం 11.5 కోట్లు, వెల్ల గ్రామం వద్ద సబ్ స్టేషన్ నిర్మాణానికి 3.3 కోట్లు, రామచంద్రపురం డిగ్రీ కళాశాలకు 5 కోట్లు, నాబార్డు ద్వారా మేజర్ కనెక్టింగ్ రోడ్లు 9 కోట్లు, ఆర్ అండ్ బి ద్వారా గుంతల రోడ్డు నిర్మాణానికి 8 కోట్లు, గొల్లపాలెం కుయ్యేరు రోడ్డుకు 32 కోట్లు, రామచంద్రపురం పురపాలక సంఘం ద్వారా అభివృద్ధి పనులు 16.19 కోట్లు, ఎంపీ లాడ్స్ ద్వారా 60 లక్షలు, ఆర్డబ్ల్యూఎస్ ద్వారా 19.35 కోట్లు, సిసి రోడ్లు, డ్రైలు నిర్మాణానికి 17.22 కోట్లు, పిఎం కిసాన్ ద్వారా 3 కోట్లు, అంగన్వాడి నిధులు 4 కోట్లు, ఇరిగేషన్ పనుల కోసం 8 కోట్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 90 లక్షలు, పశుసంవర్ధక ద్వారా 2.5 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేపట్టమన్నారు. ప్రభుత్వ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా మహిళలకు, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. 30 జాబ్ మేళాలు నిర్వహించి 2 వేలకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా రామచంద్రపురంలో ఒక ఆసుపత్రి నిర్మించి అన్ని రకాల వైద్య సేవలు, భవనం నిర్మించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే 4 ఫ్రీజర్ బాక్సులు, 2 వాటర్ ట్యాంకులు సమకూర్చామన్నారు. గత ప్రభుత్వం కార్మికుల సంక్షేమం గాలికొదిలి వేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల సంక్షేమానికి పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిస్తున్నామన్నారు. డూప్లికేషన్ పేరుతో ఆపిన పథకాలు మళ్లీ పునరుద్ధరించి అమలు చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికుల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు.

# సీమ మీదుగా బెంగళూరు-బీదర్ మధ్య బై వీక్లీ ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,జూన్ 12,ప్రభాతవార్త** ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ రాయలసీమ జిల్లాల మీదుగా బెంగళూరు-బీదర్-బెంగళూరుల మధ్య ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. బెంగళూరు నుంచి బీదర్ వెళ్లే నెంబర్ 06539ప్రత్యేక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుండి 29వరకు ప్రతి శుక్ర,ఆదివారాల్లో బెంగళూరు నుండి రాత్రి 9.15గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11.30గంటలకు బీదర్ చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో బీదర్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 06540బై వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16నుంచి 29వరకు ప్రతి శని,సోమవారాల్లో బీదర్ నుంచి మధ్యాహ్నం 1గంటకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజామున 4గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో లోయలహంక,హిందూపురం,ధర్మవరం,అనంతపురం,గుంతకల్లు,ఆదోని,మంత్రాలయం రోడ్,రాయచూర్,క్రిష్ణా,యాద్గీర్,వాడి,షాహబాద్ ,గుల్బర్గా,హోమ్నాబాద్ స్టేషన్లలో నిలుస్తాయి.

# చరిత్రపుటల్లో నిలిచేలా కుప్పం అభివృద్ధి

## - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

### - ఘనంగా సుపరిపాలన - స్వర్ణాంధ్ర విజయోత్సవాలు!

**కుప్పం, జూన్ 12 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు సారధ్యంలో చరిత్ర పుటల్లో నిలిచేలా ఇకపై కుప్పం అభివృద్ధి ముందుకుసాగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబునాయుడు నాలుగోసారి సిఎంగా బాధ్యతలు చేపట్టి ఏడాదైన సందర్భంగా కుప్పం తెదేపా కార్యాలయంలో సుపరిపాలన, స్వర్ణాంధ్ర విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి ఆయన కార్యకర్తలు, నేతలకు పంచిపెట్టారు. అనంతరం ఆయమన మాట్లాడుతూ కుప్పం మున్సిపల్ అభివృద్ధికి గాను అమరావతి నగరంకు డిజైన్ చేసిన సింగపూర్ బృందంచే మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరుగుతోందన్నారు. కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు భూసర్వే, భూముల సేకరణకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియంకు టెండర్లు పూర్తయ్యాయని త్వరలో పనులు మొదలుపెడతామన్నారు. ఎవరూ ఊహించని రీతిలో కుప్పంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. కుప్పంలో అండర్ గ్రౌండ్ డ్రైన్లు, ప్రధాన రహదారి విస్తరణ, వివిధ కంపెనీలతో ఒప్పందాలు జరుగుతాయన్నారు. కుప్పం ప్రజలు అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి నేతలు, కార్యకర్తలు తీసుకెళ్లాలన్నారు. కార్యకర్తలకు అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా అందర్నీ కలుపుకుని పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ కుప్పం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా చేసేందుకు సిఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, కడ సభ్యులు సుగుణమ్మ, సతీష్, రామచంద్ర, కార్పోరేషన్ డైరెక్టర్లు వేణుగోపాల్, రాజగోపాల్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, జాకీర్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ముగం,రవి, ఎవి రవి, ప్రతాప్, చెక్కునత్తం మణి, హర్ష ధర్మతేజ, జయరాంనాయుడు, వసంతమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దళిత బిడ్డకు అన్యాయం జరిగితే సిఎం చంద్రబాబు స్పందించలేదు..

## అత్యాచారానికి గురైన బాలికను పరామర్శించడానికి వెళ్లకుండా అడ్డుకోవడమేమిటి?: గవర్నర్‌ను కలుస్తాం :మాజీ మంత్రి మేరుగ నాగార్జున, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**అనంతపురం, జూన్ 12, (ప్రభాతవార్త బ్యూరో)** శ్రీ సత్య సాయి జిల్లాలో ఒక దళిత బిడ్డ పైన అత్యాచారం జరిగితే ఇంతవరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించకపోవడం దారుణం అని, అత్యాచారానికి గురైన బాలికను రామగిరి మండలం ఏడుగురాళ్లపల్లిలో అత్యాచారానికి గురైన దళిత బాలికకు తక్షణమే న్యాయం చేయాలని వైసీపీ నేత,మాజీ మంత్రి మెరుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక దళిత బాలిక అత్యాచారానికి గురైతే.. అక్కడ పరామర్శకు వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. మేము ఏమైనా టెర్రరిస్టులమా అంటూ ఆయన నిలదీశారు. అనంతపురం నగరంలో గిరిజన బాలికను దారుణంగా హత్య చేశారని.. ఈ జిల్లాలో ఇటీవల ఇలాంటి ఆకృత్యాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వెంటనే వీటన్నింటి మీద గవర్నర్ ను కలిసి ఫిర్యాదు చేస్తామని నాగార్జున అన్నారు. దళిత బాలికపై అత్యాచారం చేసిన వారి మీద ఎస్సీ ఎస్టీ ప్రకారం చర్యలు తీసుకోవడమే కాకుండా.. ఆ చట్టం ప్రకారమే బాధితురాలు కుటుంబానికి పరిహారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆ కుటుంబానికి భద్రత కూడా కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రామగిరి మండలానికి వెళ్లాలంటే ఏమైనా ప్రత్యేకంగా వీసాలు, పాస్ పోర్టులు ఉండాలా అని ప్రశ్నించారు. ఇవాళ శ్రీ సత్య జిల్లా రామగిరి మండలం పేరూరు పర్యటనకు వెళ్తుండగా వైసిపి నాయకులను అడ్డుకోవడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక అమాయక దళిత బాలికపై దారుణంగా అత్యాచారం జరిగితే... దానిని ఖండిస్తూ పేరూరు పర్యటనకు వెళితే ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. పైగా తెలుగుదేశం పార్టీ అల్లరిమూకలు అలాగే అత్యాచారం చేసిన వ్యక్తుల బంధువులు, మండల కన్వీనర్ ఇలా అందరూ కర్రలు పట్టుకుని విధ్వంసం సృష్టించారన్నారు. వాహనాలను కూడా ధ్వంసం చేశారన్నారు. అసలు ఇదంతా ఏ రాజ్యాంగంలో రాశారని ప్రశ్నించారు. రామగిరి మండలంలో బయటకు వచ్చినవి కొన్నేనని.. వెలుగులోకి రానివి ఇంకా ఎన్నో దారుణాలు జరిగాయన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలను దారుణంగా హింసిస్తూ ఇక్కడ పాలన సాగుతోందన్నారు. ఏడు గుర్రాల పల్లిలో జరిగిన సంఘటన మీద వెంటనే డీజీపీని, గవర్నర్ ను కలుస్తామని ప్రకాష్ రెడ్డి అన్నారు... ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ మాట్లాడుతూ దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు రామగిరి మండలం ఏడుగురాళ్ల పల్లెకి వెళ్లామన్నారు.

# ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకుంటున్న డి సిఎం పవన్‌కళ్యాణ్

## యేడాది పాలన సందర్భంగా ప్రత్యేక వీడియో హాల్‌చల్

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాత్ర రోజు రోజుకీ మరింత బలంగా, ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకుంటూ ముందుకు సాగుతోంది. డిప్యూటీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి గురువారంతో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జనసేన పార్టీ ఓ ఆసక్తికరమైన ప్రత్యేక వీడియో సోషల్ మీడియాలో విడుదల చేసింది. "కొణిదెల పవన్ కళ్యాణ్ అనే నేను" అనే వ్యాఖ్యతో ప్రారంభమయ్యే ఈ వీడియో ప్రస్తుతం పార్టీ శ్రేణుల్లో ఆసక్తికర చర్చనీయాంశంగా మారింది.జనసేన పాలనలో సాధించిన విజయాలు: ఈ వీడియోలో పవన్ కల్యాణ్ నాయకత్వంలో గత ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను హైలైట్ చేశారు. ముఖ్యంగా ప్రతి ఇంటికీ మంచినీటి పంపిణీ, 55 గిరిజన గ్రామాలకు 39 కిలోమీటర్లు రోడ్లు వేయడం, కుంకీ ఏనుగులను కర్ణాటక నుంచి ఆంధ్రాకి తీసుకురావడం, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌లకు సేఫ్టీ కిట్స్ అందించడం వంటి తదితర అంశాలను స్టేటస్ వీడియోలో చూపించారు.రాజకీయ ప్రస్థానంలో గేమ్ ఛేంజర్‌గా పవన్: పార్టీ శ్రేణుల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతున్న ఈ ప్రత్యేక వీడియో, పవన్ ఒక సాధారణ రాజకీయ నేత స్థాయి నుంచి "గేమ్ ఛేంజర్"గా ఎలా ఎదిగారో కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. పిఠాపురంలో ఆయన సాధించిన తొలి ఎన్నికల విజయం ఆ ప్రాంతంలో పార్టీకి 100 శాతం స్ట్రైక్ రేట్ అందించిన తీరు, ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను ఆయన తిరగరాసిన విధానం వంటి అంశాలను వీడియోలో ప్రముఖంగా ప్రస్తావించారు. పవన్ కళ్యాణ్ సహనం,



పట్టుదల, వ్యూహాత్మక పొత్తుల ద్వారా జనసేనను రాష్ట్ర రాజకీయాల్లో అగ్రస్థానానికి చేర్చినట్లు వివరించారు.పార్టీ శ్రేణులకు స్ఫూర్తి ప్రజలకు భరోసా: ఈ వీడియో ద్వారా జనసేన పార్టీ తన శ్రేణులకు ఒక కొత్త ఉత్సాహాన్ని అందించడమే కాక, రాష్ట్ర ప్రజలకు తమ పాలన లక్ష్యాలను మరోసారి గుర్తు చేసింది.

# ఆక్వా పరిశ్రమకు మంచిరోజులు

## - ఉపసభాపతి రఘురామ వెల్లడి

**విజయవాడ,జూన్12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆక్వా రంగం సవాళ్ళు అధిగమించి,స్థిరత్వం సాధించడానికి స్వల్ప,మధ్య,దీర్ఘకాలిక వ్యూహాలు అమలు చేయాలని ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ సిఫార్సు చేసిందని శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు. రాష్ట్రమత్స్య శాఖ కార్యాలయంలో ఆనం వెంకట రమణారెడ్డి, బిజెపి ఎంఎల్‌ఏ కామినేని శ్రీనివాస్‌లతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పదెకరాల నిబంధనతో సంబంధం లేకుండా ఆక్వా రైతులకు రూ.1.60కే విద్యుత్ ఇచ్చే నిర్ణయంపై సిఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఆక్వా ఉత్పత్తుల స్థానిక వినియోగం పెంచేందుకు జీఎస్టీ మినహాయింపు అంశాన్ని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

# రాష్ట్ర కళా, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటాలి

## : మంత్రి కందుల దుర్గేష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జూన్ 12( ప్రభాతవార్త):** కళలకు కాణాచి అయిన సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలోని ఆనం కళాక్షేత్రంలో జరిగే కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలను ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. గురువారం రాజమహేంద్రవరం ఆనం కళాక్షేత్రం నందుఈ నెల 12 నుండి 15 వరకు శ్రీ రాధాకృష్ణ కళాక్షేత్రం వారిచే నిర్వహించబడుతోన్న 43వ కళా సమ్మేళనం-2025 కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

# కూటమి యేడాదిపాలనపై నేతల్లో వెల్లివిరిసిన ఆనందోత్సాహాలు

**జగ్గయ్యపేట, జూన్ 12, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వ సంవత్సర పరిపాలన విజయవంతంగా కొనసాగిందని, సూపర్‌సిక్స్ పథకాలు కూడా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కార్యరూపం దాల్చాయని కూటమి ప్రభుత్వ పాలకులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతాపార్టీ నాయకులు సంతోషం వ్యక్తంచేశారు. ఈమేరకు ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ పట్టణంలో ఏడాది విజయోత్సవ ర్యాలీని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహ కూడలివద్దకు ర్యాలీగా చేరుకుని కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్‌తో కలిసి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ ఆనందోత్సాహాలను ప్రదర్శించారు. కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో సాధించిన ప్రగతి, ప్రజలకు చేసిన ఉపకారం, ఒకపక్క సంక్షేమ పథకాల అమలుతోపాటు మరోపక్క అభివృద్ధి పనులను కొనసాగించటం సిఎం చంద్రబాబు ప్రత్యేకతగా వర్ణించారు. గత ఐదేండ్ల వైఎస్‌ఆర్సీపి పరిపాలనలో భ్రష్టుపట్టిన వ్యవస్థలను సరిదిద్దటం, సుపరిపాలనను అందించటం, ప్రజల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవటం కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలంటూ నేతలు రఘురామ్, రాజగోపాల్ వివరించారు. కాగా కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీమున్సిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు, బిసి నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు, మాజీమున్సిపల్ వైస్‌ఛైర్మన్ నూకల కుమారరాజ, కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జివిజె జెడ్‌పి బాలుర హైస్కూలులో విద్యాకిట్లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

# చిత్తూరులో దారుణం - తండ్రిని హత్య చేసిన కుమారుడు

**చిత్తూరు, జూన్ 12 ప్రభాతవార్త:** చిత్తూరు నగరంలో గురువారం దారుణం జరిగింది. చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ తండ్రి అతని కుమారుడి చేసిలో దారుణ హత్యకు గురయ్యాడు. చిత్తూరు లెనిన్‌నగర్‌కు చెందిన టి.వెంకటరెడ్డి(50)ని అతని కుమారుడు సోమశేఖర్‌రెడ్డి(21) కత్తితో దాడి చేసి హత్య చేశాడు. వెంకటంరెడ్డి నివాసం వున్న ఇంట్లోనే ఈ ఘటన చోటు జరుగడంతో కుటుంబ వ్యవహారాల్లో ఏం జరిగిందో! తండ్రిని కుమారుడు ఎందుకు హత్య చేస్తాడు! తండ్రి ఏం చేయకుంటే కుమారుడు ఇలా చేస్తాడు! అని స్థానికుల్లో చర్చ ప్రారంభమైంది. చిత్తూరు టుటౌన్ ఇన్‌ఛార్జ్ ఇన్స్‌పెక్టర్, వన్‌టౌన్ సిఐ మహేశ్వర్ వెల్లడించిన వివరాల మేరకు లెనిన్ నగర్‌లో టి.వెంకటరెడ్డి కుటుంబం నివాసం వుంటుంది. వెంకటరెడ్డికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

# ఖరీఫ్ 2025 సీజన్ నుండి వ్యవసాయ శాఖ పూర్తి డిజిటలైజేషన్

**సచివాలయం,జూన్12,ప్రభాతవార్తప్రతి::** ఇథియోపియాకు చెందిన అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి బృందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపట్టిన ఆధునిక డిజిటల్ పథకాల అధ్యయనం నిమిత్తం రాష్ట్రాన్ని సందర్శించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ 2.0అమలుపై వారు అవగాహన పొందారు.ఈ బృందం ఆర్టీజీఎస్ రాష్ట్ర కేంద్రాన్ని సందర్శించి, ఇన్‌పుట్ పంపిణీ, ఈ మార్కెట్ ప్లేస్ సమన్వయం వరకు జరిగే పూర్తి స్థాయి డిజిటల్ సేవల వ్యవస్థపై వివరాలను తెలుసుకున్నారు. ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగిస్తున్నారు. ఈథియోపియా బృందానికి డిజిటల్ అగ్రికల్చర్ ఫైనాన్స్ ప్రోగ్రాం డైరెక్టర్ శ్రీ గిరుమ్ కెటెమా టెక్లెమరియం నేతృత్వం వహించగా, మొత్తం 10 మంది సీనియర్ అధికారులు ఇందులో పాల్గొన్నారు.

# విధ్వంసం నుంచి.. వికాసంవైపు

## ఐటీ,విద్యాశాఖ మంత్రి నారాలోకేష్

**విజయవాడ,జూన్ 12,ప్రభాతవార్త బ్యూరో:** విధ్వంసం నుంచి వికాసం వైపునకు, రాష్ట్ర సర్కారు ప్రయాణం ప్రారంభించిందని, ఏడాది సుపరిపాలనతో అన్నింటా ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని,ఐటీ విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్రమోడీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో.. డబుల్ ఇంజన్ సర్కాం ఏడాదిగా అనేక విజయాలు సాధించిందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనకు, ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రిలోకేష్ ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో ప్రసంగించారు.

"పదేళ్లలో రాని పెట్టుబడులు ఏడాదిలో సాధించడం, కూటమి ప్రభుత్వ విజయంగా పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా పెన్షన్ల పంపిణీ మన రాష్ట్రంలో జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా, పాఠశాలలు ప్రారంభించిన వెంటనే తల్లికి వందనం హామీ నిలబెట్టుకున్నామన్నారు. సమగ్ర సంక్షేమం,సంపూర్ణ అభివృద్ధి..అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. విధ్వంసక పాలననుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభించిందని, ప్రజాస్వామం గెలిచి రాష్ట్రమంతటా పండగ వాతావరణం ఉందన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపుకు రాష్ట్రం ప్రగతి ప్రయాణం సాగుతుందన్నారు. యువతకు ఉపాధి కల్పన రాష్ట్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యమన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ప్రజా ప్రభుత్వం భర్తీ చేస్తోందని మంత్రి తెలిపారు. డీఎస్సీని ఎట్టిపరిస్థితుల్లోనైనా ఆపాలని ప్రతిపక్ష పార్టీ సుమారు 24 కేసులు వేసిందన్నారు. గురువార నాటితో చివరి కేసు కూడా సుప్రీంకోర్టులో డిస్మిస్ అయిందని మంత్రి తెలిపారు. యువత ఉపాధి అవకాశాల మెరుగుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 8.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు వివిధ పారిశ్రామిక సంస్థలో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. డొమెస్టిక్ ఇన్వెస్ట్ మెంట్స్ లో ఏపీ భారతదేశంలోనే నెంబర్ వన్ గా ఉందని మంత్రి లోకేష్ చెప్పారు. ఆమేరకు 16శాతం పెట్టుబడులు ఏపీకి వచ్చాయని, ఇందులో భాగంగా టీసీఎస్, ఎల్జీ, ఎన్టీపీసీ గ్రీన్, ఆర్సెల్లార్ మిట్టల్, బీపీసీఎల్, రిలయన్స్ రెన్యూ పవర్ లాంటి సంస్థలు ఈ రోజు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు.

# పశుసంవర్ధక శాఖలో బదలీల ప్రక్రియపై పునఃసమీక్ష చేయాలి:

## ఆంధ్రప్రదేశ్ యానిమల్ హాస్బండరీ గెజిటెడ్ ఆఫీసర్స్ జెఎసి

**విజయవాడ, జూన్ 12, ప్రభాతవార్త :** పశుసంవర్ధక శాఖలో జరుగుతున్న బదిలీ ప్రక్రియను పునఃసమీక్ష చేయాలని, ఏపి యానిమల్ హస్పండరీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఏపి పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న తన భార్య డా పద్మలీలకు అన్యాయం చేశారని వివరించడానికి వచ్చిన డా సురేష్‌పై పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర నాయుడు యొక్క దురుసు ప్రవర్తనను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ యానిమల్ హ్బాండ్రి గెజెటెడ్ ఆఫీసర్స్ జెఎసి తెలిపింది. జిఓ 23 ప్రకారం జరగాల్సిన బదిలీలు నిబంధనలు తుంగలో తొక్కి అడ్డదారిలో రాజకీయ నాయకుల సిఫార్సు లెటర్లున్న వారికి మాత్రమే అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. తాము ఎన్నిసార్లు బదిలీల ప్రక్రియ పారదర్శకంగా వుండాలని వినతి చేసుకున్నా ప్రయోజనం లేదంటూ వాపోయారు. పైగా తమను టార్గెట్ చేస్తామని డైరెక్టర్ దామోదర్ నాయుడు బెదిరింపులకు దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. బదిలీ చేయడానికి కావాల్సిన ఏళ్ళు పూర్తవకుండానే తనను వర్కింగ్‌ప్లేస్ నుండి తీసేశారని విశాఖలో పనిచేస్తున్న డా పద్మలీల తన భర్త డా సురేష్‌తో కలిసి విజయవాడలోని డైరెక్టర్ దామోదరనాయుడుకు వివరించే సమయంలో దామోదరనాయుడు డా సురేష్‌పై చేయిచేసుకోడానికి పయత్నించారని, అభ్యర్థనలు వినకపోగా తమపై చేయిచేసుకోడానికి ప్రయత్నిండాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

13-6P□g7exHMNWJQE.qxd:13-6P□g7exHMNWJQE.qxd 01/01/01 7:53 AM Page 1



# విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

## కాస్మటిక్ చార్జీలు నేరుగా విద్యార్థుల అకౌంట్‌లోకి

### 4 నెలల అద్దె బకాయిలు విడుదల

### విడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్



అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా బిసి గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల భవితను ఉన్నతంగా తీర్చిదిద్దాలని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కాస్మటిక్ చార్జీలు నేరుగా విద్యార్థుల అకౌంట్‌లోకి వేయనున్నట్టు తెలిపిన మంత్రి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం, వసతి అందించాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధనుపెట్టి.. హెల్త్ ప్రొఫైల్ తయారుచేయాలన్నారు. బిసి సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, ఎంజెపి సెక్రటరీ బడుగు సైదులు, ఎంబిసి డెవలప్ మెంట్ కార్పొరేషన్ సిఇవో అలోక్ కుమార్, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ డైరక్టర్ ఇందిర పాల్గొన్నారు. గురువారం నుంచి 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారికి నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, వసతి సదుపాయాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నతమైన ప్రమాణాల విద్యను అందించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన సూచించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన, విద్యాబోధనలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. ప్రిన్సిపాల్స్, హాస్టల్ వార్డన్స్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ విద్యార్థుల భవితవ్యం కోసం శాయశక్తుల కృషి చేయాలన్నారు. దేశం గర్వపడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. రేపటి భవిష్యత్ నేటి విద్యార్థులపైనే ఆధారపడి ఉందని, బిసి సంక్షేమ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగునెలల అద్దె బకాయిలు విడుదల చేసిందని.. భవనాల యజమానులతో సంప్రదించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పాఠశాలలో, హాస్టల్‌లో పరిశుభ్రత పాటించాలని, దోమల నుంచి రక్షణ కోసం నెట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, వసతి సామాగ్రి వెంటనే అందించాలని మంత్రి సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు వారి కాస్మటిక్ చార్జీలు నేరుగా వారి బ్యాంక్ అకౌంట్ లో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని.. ఇందుకు సంబంధించి విద్యార్థులు అందరికీ బ్యాంక్ అకౌంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ.. వారి నెలవారి ఆరోగ్య పట్టికను సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో బిసి గురుకులాలు అత్యుత్తమ ఫలితాలు సాధించి ఫస్ట్ ప్లేస్‌లో ఉండేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# నేడు దోస్త్-2025 రెండో విడత సీట్ల కేటాయింపు

### 35,954 మంది రిజిస్టర్.. 46,886 మంది వెబ్‌ఆప్షన్లు

### 18లోపుగా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడానికి నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) -2025లో రెండో విడత సీట్ల కేటాయింపు నేడు(శుక్రవారం) చేయనున్నారు. ఇప్పటికే మొదటి విడత సీట్ల కేటాయింపు చేయగా.. అందులో 41,285 మంది కాలేజీల్లో చేరడానికి సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. రెండో విడతలో రిజిస్ట్రేషన్స్‌కి అవకాశం ఇవ్వగా.. వారిలో ఫీజు చెల్లించిన వారు వెబ్ ఆప్షన్లను ఇచ్చిన వారిని నేడు సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. రెండో విడతలో 35,954 మంది రిజిస్టర్ చేసుకోగా వారిలో 33,409 మంది ఫీజును చెల్లించారు. 34,276 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. రెండో విడతలో 46,886 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వారికి నేడు సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. సీటు పొందిన వారు ఈ నెల 18 వరకు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. మూడో విడత రిజిస్ట్రేషన్లను ఈ నెల 13 నుంచి 19 వరకు అవకాశం కల్పించారు దోస్త్ అధికారులు. దరఖాస్తు సమయంలోనే వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈనెల 23న సీట్ల కేటాయింపు చేస్తారు. సీటు పొందిన వారు ఈ నెల 23 నుంచి 28 వరకు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. అన్ని ఫేజుల్లో సీట్లు పొందిన వారు ఈ నెల 24 నుంచి 28 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. జూన్ 30 నుంచి సెమిస్టర్-1 క్లాసులను ప్రారంభించనున్నారు. మొదటివిడతలో 89,468 మంది రిజిస్టర్ చేసుకోగా .. వారిలో 83,119 మంది ఫీజు చెల్లించారు. అందులో 77,012 మంది దరఖాస్తు చేశారు. వారిలో 65,190 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. అందులో 60,428 మందికి సీట్ల కేటాయింపు చేశారు. కాలేజీల్లో సీటు అలాట్ అయిన వారిలో మంగళవారం మధ్యాహ్నం వరకు 41,285 మంది సెల్ఫ్ రిపోరింగ్ చేశారు.

# ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాల్సిందే

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌తో మున్నూరుకాపు నేతల భేటీ

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తను ఎప్పుడు ఏ పదవులు ఇచ్చి ఉపయోగించుకోవాలో.. అప్పుడు వారికి అవకాశాలు ఇచ్చి వారి సేవలు తీసుకొంటుందని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సామాజిక న్యాయం కోసం పాదయాత్ర చేయడమేకాదు తెలంగాణలో కులగణన చేసి దేశంలో కులగణన జరపడానికి మార్గదర్శిగా నిలిచారని, అన్ని సామాజికవర్గాల రాజకీయ అభ్యున్నతి కోసం మన నాయకుడు పాటు పడుతున్నారని అన్నారు.


గురువారం 33 జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన మున్నూరు కాపు సంఘం నాయకులు మున్నూరకాపు సామాజికవర్గానికి చెందిన ఆదిశ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గాంధీభవన్ వచ్చిన నాయకులతో ఆయన సమావేశయ్యారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంచి భవిష్యత్ ఉందని అధినాయకత్వం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొంటుందని మహేష్‌కుమార్ మున్నూరు కాపులను సముదాయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్‌కు, ఎఐసిసి చీఫ్ మల్లి కార్జునఖర్గే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామిచ్చారు.

# సెరికల్చర్‌పై గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అందని కేంద్ర నిధులు

### నియామకాలతో పట్టుపురుగుల సాగు బలోపేతం

### రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** సెరికల్చర్‌పై గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సెంట్రల్ ప్రభుత్వం నుంచి నిధులు పొందలేక పోయామని రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు పెంచడానికి ఎంతగానో తోడ్పాటు నిచ్చే ఈ సాగును ప్రోత్సహిస్తామని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. గురువారం బిఆర్కే భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానీరెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్ తో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమావేశమయ్యారు. సెరికల్చర్ డిపార్టు మెంట్‌లో త్వరగా నియమాకాలు చేపట్టేందుకు ప్రభుత్వంకు సూచిస్తామని ఆయన వివరించారు. గత పదేండ్ల కాలంలో సెరికల్చర్ డిపార్ట్ మెంట్ నిర్లక్ష్యానికి గురైందని, నియామకాలు చేపట్టకపోవడం, నిధులు కేటాయించక పోవడంతో సెరికల్చర్ విభాగం నిర్వీర్య పరిస్థితికి వచ్చిందని అధికారులు కమి షన్ దృష్టికి తీసుకొచ్చారు. ఇక గత ప్రభుత్వంలో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో సెరికల్చర్‌ను కలపడం వల్ల సెరికల్చర్ మనుగడకే ప్రమాదంగా మారిందని వివరించారు. జిల్లా స్థాయిలో కూడా అధికారుల కొరత తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్రంలో పట్టుపురుగుల సాగులో మంచి లాభాలున్నా.. పట్టించుకోలేదని, పట్టు పరుగుల సాగుతో రైతులు లాభపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కమిషన్ చైర్మన్, సభ్యులకు సెరికల్చర్ అధికార యంత్రాంగం వివరించింది. ముఖ్యంగా సెరికల్చర్ డిపార్ట్ మెంట్‌లో గత కొన్నేళ్లుగా నియామకాలు చేపట్ట లేదని, రాష్ట్రవ్యాప్తంగా సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగుల సంఖ్య 60 మందే వున్నారని తెలి పారు. సెంట్రల్ సిల్క్ బోర్డు ద్వారా పట్టు పురుగుల సాగుకు నిధులు కూడా తీసుకోవచ్చని, తెలంగాణలో సిల్క్ దుస్తువుల డిమాండ్ ఉందని తెలిపారు. సెరికల్చర్ అధికారులు తెలిపిన వివరాలను విన్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్.. సెరికల్చర్ డిపార్మెంట్ లో పేరుకుపోయిన సమస్యలు, అభివృద్ధి చేయడానికి సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హామీ ఇచ్చారు.



అభివాదం చేస్తున్న రాజారాంయాదవ్, మేకల రాములుయాదవ్, తదితరులు

# యాదవ, కురుమలకు మంత్రి పదవి ఇవ్వాలి

### లేకుంటే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తాం

### యాదవ కురుమ సంఘాల జెఎసి

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** యాదవకురుమలకు మంత్రి పదవి కేటాయించకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి. రాజారాం యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో యాదవకురుమ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించిన యాదవుకురుమలకు కాంగ్రెస్ పార్టీ మొండి చేయి చూపించిందని ఆరోపించారు. ప్రభుత్వ పదవులను పక్కన పెడితే కనీసం నామినేటెడ్ పదవుల్లోనూ యాదవ కురుమలకు స్థానం కల్పించకుండా యాదవ కురుమలను అవమానించారని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకొని ఇప్పటివరకు యాదవ కురుమలు మంత్రిగా లేని క్యాబినెట్ లేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరోవైపు యాదవకురుమలకు మంత్రి పదవి కేటాయించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దలు దిగి రాకపోతే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈనెల 27న ఇందిరాపార్కు దగ్గర నిర్వహిస్తున్న యాదవకురుమల ఆత్మగౌరవ సభకు జెండాలు, అజెండాలు పక్కనపెట్టి సంఘాలకు అతీతంగా హైదరాబాద్ కు యాదవ కురుమలు పెద్ద ఎత్తున తరలిరావాలని రాములు యాదవ్ విజ్ఞప్తి చేశారు. యాదవులు పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని యాదవులను ఆదరిస్తే కాంగ్రెస్ పార్టీని అక్కున చేర్చుకుంటారని అన్నారు.

# ఆటో మీటర్‌చార్జీలు పెంచడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** ఆటో మీటర్‌చార్జీలు, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డుతోపాటు ఇతర పెండింగ్ లోఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా ఆటోరిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ జిఓ జారీ చేసేందుకు కృషి చేసిన కూనంనేని సాంబశివ రావుకు తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు గురువారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలు సిహెచ్ జంగయ్య, ఎండి ఒమర్ ఖాన్, ఎస్కె లతీఫ్, ఎం శ్రీనివాస్ (ఎఐటియుసి), వి ప్రవీణ్, లింగం (టియుసిఐ), వి మారయ్య, మహేష్ (బిఆర్‌టియు,) పి శ్రీకాంత్, అజయ్‌బాబు (సిఐటియు), పి యాదగిరి (టీఎస్టీయూసీ) పాల్గొన్నారు. జేఏసీ కన్వీనర్ బి వెంకటేశం ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, ఆటో మీటర్‌చార్జీలు పెంచడం, ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ రూ.12.000 ఆర్థిక సహాయం, ఆటో రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఓలా, ఊబర్, రాపిడోల నుండి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను రూపొందించడం వంటివి తక్షణమే పరిష్కరించడానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రితో చేర్చించి పరిష్కారానికి కృషి చేయాలనీ విజ్ఞప్తి చేశారు.

**అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై కూనంనేని తీవ్ర దిగ్భ్రాంతి**

గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారికి ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. విమానం పడిన భవనంలో నివసిస్తున్న మెడికల్ విద్యార్థు సైతం చనిపోవడం తీవ్రంగా కలచి వేసిందన్నారు. . చనిపోయిన ప్రయాణికులకు, విద్యార్థులకు, సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కూనంనేని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇప్పటికైనా దేశ పౌర విమానయాన శాఖ కట్టుదిట్టమైన నిర్వహణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# పంచాయతీ ట్రాక్టర్లకు సైతం డీజిల్ లేని దుస్థితి

### పంచాయతీలకు 16 నెలలుగా నిధులు అందడం లేదు: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 12:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గ్రామ పంచాయతీలకు గత 16 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల కావడం లేదని హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. నిధుల కొరత కారణంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను నడిపేందుకు కూడా డీజిల్ లేని దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ల తాళాలను ఉన్నతాధికారులకు అప్పగించేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మారితే మార్పు వస్తుందని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని, అయితే ఇప్పుడు గ్రామాల్లో కనిపిస్తున్న ఈ దుస్థితేనా ఆ మార్పు? అని హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు.

'ఇది మార్పు కాదు, ఏమార్పు' అంటూ ఆయన తన పోస్టులో ఎద్దేవా చేశారు. గ్రామ స్వరాజ్యానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మాత్రం గ్రామాలకు నిధుల కటకట ఏర్పడిందని హరీశ్ రావు ఆరోపించారు. ఈ నిధుల కొరత వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# కర్షకుల ప్రయోజనార్థం కొత్త వ్యూహాలు అమలు చేయాలి

### వ్యవసాయ విశ్వవిద్యాలయం 61వ వ్యవస్థాపక దినోత్సవంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, పాత్రికేయుడు పాశం యాదగిరి, మాజీ ఐఎఎస్ వి. నాగిరెడ్డి, పూర్వ ఉపకులపతి రఘువర్ధన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్ అత్తాపూర్) జూన్ 12, ప్రభాతవార్త :** వ్యవసాయ విశ్వవిద్యాలయం 61వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం రాజేంద్రనగర్‌లోని విశ్వ విద్యా లయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతి థిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం 'అద్భుతమైన వార సత్వం, భవిష్యత్తు సవాళ్ల'పై ఆయన ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చాక దేశ ఆహార అవసరాలు తీర్చే ఉద్దేశంతో అన్ని రాష్ట్రాల్లోనూ వ్యవసాయ విశ్వవిద్యా లయాలు ఏర్పడ్డాయని, అందులో భాగంగానే హైదరాబాద్‌లోనూ 1964లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటైందారు. ఆ విశ్వవిద్యాలయం రూపొం దించిన ఎన్నో వంగడాలు దేశ వ్యాప్తంగా ఆదరణ పొందాయన్నారు. దేశంలో అమలుచేసిన భూసంస్కరణలు, హరిత విప్లవాలు సత్ఫలితాలు ఇచ్చినప్పటికీ కొన్ని అసమానతలకు కారణం అయ్యాయని కోదండరాం వివరించారు. ప్రత్యేక తెలంగాణ సహకార మైనందున సన్న, చిన్నకారు రైతాంగ సమస్యలపై ప్రత్యేకదృష్టి పెట్టా లని ఆయన విశ్వవిద్యాలయానికి సూచించారు. సన్న, చిన్నకారు రైతాంగానికి ప్రయోజనకరమైన నూతన వ్యూహాల్ని అనుసరించాలని కోదండరాం సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ మధ్య నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని కోదండరాం అభినందించారు. వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయం తీవ్రమైన మార్పు లకు లోను కానుందని ప్రముఖ పాత్రికేయుడు పాశం యాదగిరి అన్నారు. నేడు నకిలీ విత్తనాలు, ఎరువులతో రైతులు కుదేలవుతున్నారని, భూసారం క్షీణిస్తుందన్నారు. విశ్వవిద్యాలయం తెలంగాణ సాంప్రదాయ పంటలు, చిరుధాన్యాలపై పరిశోధనలు చేసి రైతాంగానికి ఉపయోగపడాలని పాశం యాదగిరి సూచించారు. రైతు, వ్యవసాయం సుభిక్షంగా ఉండాలంటే వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయాలు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఐఎఎస్ వి. నాగిరెడ్డి అన్నారు. తెలంగాణ పరిస్థితుల నేపథ్యంలో సమర్థ నీటి యాజమాన్యం అత్యవసరం అని విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి డాక్టర్ రఘువర్ధన్ రెడ్డి అన్నారు. దేశంలో ఏర్పాటైన రెండవ వ్యవసాయ విశ్వవిద్యాలయ 61వ వ్యవస్థాపక దినోత్సవం తన హయాంలో నిర్వహించడం తనకు చాలా సంతోషాన్నిస్తుందని పిజెటిఎయూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. తాను ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వ్యవస్థల్ని పునర్ వ్యవస్థీకరిస్తూ కొత్త విభాగాల్ని ఏర్పాటు చేశానన్నారు. ఈ సందర్భంగా 60 యేళ్ల విశ్వవిద్యాలయం ప్రస్థానానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అలాగే ఒక విడియోను ప్రదర్శించారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యత

### పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి నైతిక బాధ్యతగా భావించాలని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచబాల కార్మిక దినోత్సవం స్ఫూర్తితో బాల బంగరు భవిష్యత్‌కు పునరంకితం కావాలని ఆయన కోరారు. బాల కార్మిక వ్యవస్థను శాశ్వతంగా అంతం చేయాలంటే చట్టాలతో పాటు సామాజిక చైతన్యం అవసరమని అన్నారు. విద్యాసంస్థల పనివేళలలో 18ఏళ్ళ వరకు ప్రతి బాలబాలికలు,యుక్తవయస్సు పిల్లలు బడిలో,కాలేజిలో విద్యాభ్యాసం కోసం ఉండాలని పనిలో ఉండకూడదని ఆయన అన్నారు. బాలల భవిష్యత్ కాపాడడం మన అందరి సామాజిక బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. బడీడుపిల్లలతో ఎవరు కూడా కూలీ పనులు చేయించకూడదని ఆయన కోరారు.

# కెసిఆర్ కుటుంబాన్ని చూసి ఘోషిస్తున్న అమరవీరుల ఆత్మలు

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 12,ప్రభాతవార్త:** కెసిఆర్ కుటుంబాన్ని చూసి అమర వీరుల ఆత్మలు ఘోషిస్తున్నాయని,అక్రమంగా సంపాదించిన అవినీతి డబ్బు బలుపుతో కెటిఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. గురువారం సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ సాఫ్ట్ వేర్ సంస్కారం ఇదేనా? నీ అయ్య నేర్పిన సంస్కారం ఇదేనా?! అని నిలదీశారు. కెటిఆర్ నీ అయ్య ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా? కల్వకుంట్ల కుటుంబం కంటే స్టువర్ట్ పురం దొంగలు నయం అని తీవ్ర పదజాలంతో విమర్శలు చేశారు. కెటిఆర్‌ను తిట్టాలంటే మాకు సంస్కారం అడ్డు వస్తోందని అన్నారు. ఏ శాఖను వదిలిపెట్టకుండా కల్వకుంట్ల కుటుంబం అడ్డదిడ్డంగా దోచుకుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిమయమని ఆరోపణలు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సిగ్గులేకుండా కేసీఆర్ వెంట తిరుగుతున్నాడని దుయ్యబట్టారు .వరంగల్ లో కబ్జా చేసి బిఆర్ఎస్ ఆఫీసు కట్టుకున్నారని ఆరోపించారు. నా పైన బిఆర్ఎస్ ప్రభుత్వం 36 కేసులు పెట్టి వేధించిందని అయన గుర్తుచేసుకున్నారు. ఇన్ని అక్రమాలు చేసిన కల్వకుంట్ల కుటుంబం ఇంకా జైలుకు వెళ్లడం లేదనే బాధ మాకుందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కక్ష సాధింపు చర్యలు వద్దు ఓపిక గా ఉండాలని మా సిఎం రేవంత్ రెడ్డి అంటున్నారని ఆయన తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి మంచితనం వల్లనే కల్వకుంట్ల కుటుంబం ఇప్పటి వరకు జైలుకు వెళ్లలేదని ఆయన అన్నారు. ఏనాటికైనా కల్వకుంట్ల కుటుంబం ఊచలు లెక్క పెట్టాల్సిందే..ఆంధ్ర ప్రదేశ్ లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం జైళ్లకు పంపిస్తున్నారు.గుర్తు పెట్టుకోండి తిన్నది కక్కించడానికే కెసిఆర్ ను కాళేశ్వరం కమిషన్ విచారణకు పిలిచింది. తప్పు చేసిన వారు కమిషన్ ముందుకు వెళ్లాల్సిందే అని ఆయన అన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ప్రఫుల్ రామ్‌రెడ్డి

# 'గద్దర్ ఫిలిం అవార్డులను ఆంధ్ర సినిమాలకు ఇవ్వొద్దు'

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 12, ప్రభాతవార్త:** ప్రజాగాయకుడు గద్దర్ పేరిట ఇచ్చే గద్దర్ ఫిలిం అవార్డులను ఆంధ్ర సినిమాలకు ఇవ్వరాదని తెలంగాణ సినిమా వేదిక (టిసివి) డిమాండ్ చేసింది. ఈ మేరకు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, కోర్టుకు శుక్రవారం తమ వాదనలను వినిపించ బోతున్నామని, కోర్టు ద్వారా తెలంగాణ సినిమాకు న్యాయం జరుగుతుందనే తాము భావిస్తున్నామని వేదిక ప్రతినిధులు అశాభావం వ్యక్తం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, కన్వీనర్ లారా, కో-కన్వీనర్ మోహన్‌బైరాగి మాట్లాడుతూ తెలంగాణ వచ్చి 12 సంవత్సరాలు అవుతున్నా, సినిమా రంగంలో ఆంధ్ర సినీపెద్దల ఆధిపత్యం ఇంకా కొన సాగుతున్నదని, ఏపి సిఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఏకమై తెలంగాణ సినిమా రంగానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపిం చారు.

# కెటిఆర్, కౌశిక్‌రెడ్డిపై సైబర్ పోలీసులకు కాంగ్రెస్ ఫిర్యాదు

### సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే గుణపాఠం తప్పదు

### సిఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశా రని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ సెక్రటరీకి కూడా కెటిఆర్,కౌశిక్‌రెడ్డిలపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే,ప్రజలే ఆయనకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కెటిఆర్ సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని సామాజిక మాద్యమాల్లో కౌశిక్‌రెడ్డి అనుచిత పోస్టులు పెట్టారని ఫిర్యాదు చేశామని వివరించారు. ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వీరిద్దరి చర్యలు ఉన్నాయని ఆయన అభ్యంతరం తెలిపారు. రాజకీయాల్లో సున్నితంగా ఉండే వాతవార్ణం దెబ్బతీసేందుకు కెటిఆర్‌కు ఉబలాటం ఎక్కువగా ఉందని ఆరోపించారు. కెటిఆర్ చేసిన తప్పులకు జైలు కు వెళ్ళే రోజు వస్తుందని జోస్యం చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం, బిఆర్ఎస్ ప్రభుత్వం లెక్కా కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం లేదని ఆయన అన్నారు. జరిగిన తప్పులపై చట్టపరంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. కెటిఆర్ గత ప్రభుత్వ అసెంబ్లీలో సంస్కారం గురించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ ను తిట్టొద్దని నీతులు చెప్పాడని గతంను గుర్తుచేసుకున్నారు.మరి ఇవాళ నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై నువ్వు మాట్లాడుతున్నా భాష ఎలాంటిదో ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు.ఆనాడు నీతులు చెప్పిన కేటీఆర్ ఇప్పుడు, రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకుని తిడుతున్న మాటలకు సమాధానం చెప్పాలి. తెలంగాణను దోచుకున్న దోపిడిదొంగల కుటుంబం, కల్వకుంట్ల కుటుంబ అని ఆయన అభివర్ణించారు. రేవంత్ రెడ్డి రైతు బిడ్డా, ప్రజల పక్షాన ప్రతిపక్ష నేతగా పోరాటం చేసి ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. కెటిఆర్ నువ్వు ఇలాగే మాట్లాడితే నిన్ను రోడ్లమీద బట్టలు ఊడదీసి కొడతారని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.కెటిఆర్ చూసుకుని సోషల్ మీడియాలో రెచ్చిపోతున్న కొందరు బిఆర్ఎస్ నేతలకు తగిన గుణపాఠం చెప్తాం అని హెచ్చరించారు.నువ్వు చేసిన తప్పులను, తప్పుడు టీడీఆర్ లను బయటపెట్టి నీ అవినీతి, చీకటి పనులను బట్టబయలు చేస్తాం అని హెచ్చరించారు.తెలంగాణ కోసం కెసిఆర్ చేసింది ఏమి లేదు, ప్రజా పోరాటం తోనే తెలంగాణ వచ్చింది.తెలంగాణ అమరవీరులను అవమానించిన చరిత్ర కెసిఆర్‌ది.కెటిఆర్ భేషరతుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి క్షమాపణలు చెప్పాలి.కౌశిక్ రెడ్డి లాంటి నేతలు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలే బట్టలు ఊడదీసి కొడతారు.చట్టానికి ఎవరూ అతీతులు కారు, ఎవరైనా కమిషన్ ముందు హాజరు కావాల్సిందే అని ఆయన అన్నారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14